ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. సంప్రదాయం—వసుంధర
24. గూడుచేరని గూఢచారులు—కె.వి.యస్.ఎన్. మూర్తి
40. అతీంద్రియ శక్తులు—వి. పద్మప్రియ
57. బ్యాంకు దోపిడీ—సుంకరి రాంప్రసాద్
83. ప్రాణం తీసిన ఫోన్ కాల్—ఫణిబాబు
94. రెండు దెయ్యాలు—వి.యస్.పి. తెన్నేటి
111. శిరచ్ఛేదం—బొమ్మిడి అచ్చారావు
123. సమసిపోని సమస్య—జొన్నలగడ్డ రామలక్ష్మి
142. నలిగిన మల్లెలు—బి. రాజేశ్వరి
157. విషం నిద్దురపోయింది—యస్.డి.వి. అజీజ్
176. మరణయాత్ర—(సీరియల్) ప్రతాప రవిశంకర్

నవలలు (సప్లిమెంట్)

3. గోవిందరావు మరణం—వసుంధర
48 మాటువేసిన మృత్యువు—కె.వి.యస్.ఎన్. మూర్తి
86. వజ్రకిరీటం—వి. యస్. రావ్
142. తెల్ల పావురం—బొమ్మిడి అచ్చారావు
180. అన్వేషణ—(సీరియల్) వి.యస్. రావ్

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

సంప్రదాయం

వసుంధర

ఎంతో అందమైన ఆ పార్కులో—ఎన్నో వికసించిన పుష్పాల మధ్య—ముకుళిత పద్మంలా ఉన్నది సుందరి. ఆమె కెదురుగా కూర్చున్న సుబ్బారావు—గంభీరంగా ఉన్నప్పటికీ ముఖంనుంచీ వెన్నెలలు కురుస్తున్నాయి. ఆ వెన్నెల లామెపై పనిచేయడం లేదు.

సుబ్బారావు తండ్రి జగన్నాధం—సుందరి తల్లికి స్వయానా పెద్దన్నగారు. బంధుత్వంలో ఎంత దగ్గరైనా అంతస్థులో సుబ్బారావుకీ సుందరికీ చాలా దూరముంది.

లంచం పుచ్చుకున్నా డన్న నేరంమీద జగన్నాధా న్నుద్యోగం లోంచి డిస్మిస్ చేశారు. ఆయన దానికి కృంగి పోకుండా—తెగించి వ్యాపారం ప్రారంభించి అదృష్టం కలిసి రాగా అచిరకాలంలో లక్షాధికారి అయ్యాడు.

సుందరి తండ్రి రామగోపాలాన్నాయన టీచరుద్యోగం వదిలి తనతో కలవమన్నాడు. ఇద్దరూ ఒకే ఊళ్ళో ఉంటున్న మూలాన చెల్లెల్ని తనతో సమాన హోదాకు తీసుకు రావాలని జగన్నాధం ఆశయం.

రామగోపాలం మృదువుగా నిరాకరిస్తే సరిపోయేది. ఆయన జగన్నాధంతో—"బావగారూ! నేను మామూలు టీచర్ని. నీతిగా బ్రతుకుతున్నాను. నా ఆదాయం నాకు తృప్తినిస్తోంది. నా ఉద్యోగం నాకు సంతోషాన్ని కూడా యిస్తూంది. వ్యాపారం నన్ను కుటుంబ జీవితానికి దూరం చేస్తుంది. అవినీతికి ప్రోత్సహిస్తుంది సంతృప్తికి తావు లేకుండా చేస్తుంది. మీరైతే తప్పనిసరై వ్యాపారంలోకి దిగారు. నాకలాంటవసరం లేదుకదా—" అన్నాడు.

క్రింది మెట్టులో ఉన్నవారికి ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు వుంటుంది. ఆ కాంప్లెక్సులో వారు తాము నీతిపరులమనీ పై మెట్టులోని వారు—చెడ్డవారనీ నమ్మడానికి ప్రయత్ని స్తూంటారు. రామగోపాలం అదే చేశాడు.

అంతమాత్రాన జగన్నాధానికీ ఆయనకూ మధ్య సంబంధం తెగిపోలేదు. సమయం చూసి రామగోపాలా నికి బుద్ధి చెప్పాలన్న కోరిక మాత్రం జగన్నాధంలో క్రమంగా పెరిగి పెద్దదైంది.

రామగోపాలం కూతురు సుందరి పెళ్ళీడు కొచ్చింది. జగన్నాధం కొడుకామె కీడైనవాడు. ఇద్దరూ చిన్నతనం నుంచీ స్నేహంగా ఉండేవారు. పెద్దయ్యేసరి కా స్నేహం ప్రేమగా మారింది.

ఆడపిల్ల తండ్రి కాబట్టి రామగోపాలం తనే వెళ్ళి జగన్నాధాన్ని సంబంధం గురించి కదిపాడు.

"సుందరంటే నాకూ యిష్టమే! మేనకోడల్ని కోడలిగా చేసుకోవాలని నాకుంది. ఎటొచ్చీ పెళ్ళి నా హోదాకు తగ్గట్లు చేయాలి. కట్నం మన సంప్రదాయం కాబట్టి పది వేలైనా యివ్వాలి" అన్నాడు జగన్నాధం.

లెక్కవేసి చూస్తే వైభవంగా పెళ్ళిచేయాలంటే యాభై వేలకు తక్కువ కాదని తేలింది.

మొత్తమంతా కలిపి—రామగోపాలం పెళ్ళిగురించి పాతికవేలు ఖర్చుపెట్టగలడు. అందుకే ఆయన అప్పు చేయాల్సింటుంది.

"ఒక్కగానొక్క కొడుకు నాకు. వైభవంగా పెళ్ళి జరక్కపోతే ఈ హోదా ఎందుకు? కావాలంటే నేను ఉభయఖర్చులూ పెట్టుకోగలను. అది నాకు బంధువుల్లో చిన్నతనంగా ఉంటుంది. వేరే ఎక్కడా గతిలేనట్లు—వాడికింకెక్కడా పిల్ల దొరకనట్లు—అంతా చెప్పుకుంటారు. అది నేను భరించలేను. మీ కూతురి పెళ్ళికి మీరే ఖర్చు పెట్టడం మన సంప్రదాయం" అన్నాడు జగన్నాధం.

రామగోపాలం సిగ్గువిడిచి తన ఆర్థిక పరిస్థితిని బావ గారికి చెప్పుకున్నాడు.

ఆయన కిద్దరే పిల్లలు. సుందరి బియ్యే ఫస్టియర్లో ఉంటే కొడుకు ఇంటర్మీడియేట్ సెకండియర్లో ఉన్నాడు. వాడికి చదువు బాగా వస్తోంది.

జగన్నాధం నిట్టూర్చి—"నేను మీమీద పగబట్టి ఇలా గంటున్నా ననుకోవద్దు. నేను సాంప్రదాయం పాటించే మనిషిని" అన్నాడు.

రామగోపాలం ఆ సంబంధంపై ఆశ వదులుకున్నాడు.

సుబ్బారావుతో మాట్లాడ్డం మానేసింది సుందరి.

సుబ్బారావు నిజంగా సుందరిని ప్రేమిస్తున్నాడు. అత డామెను కలుసుకుని "మన పెళ్ళి జరుగుతుంది. అందుకు నా ప్రయత్నాలు చేస్తాను" అన్నాడు. అయితే తండ్రి నెదిరించడం అతడివల్ల కాదు. స్వతహాగా అతడు మెత్తటి మనిషి. పెద్దలు చెప్పింది బుద్ధిగా వింటాడు. ఇప్పు డొచ్చిన యీ సమస్యనుంచెలా బయటపడాలో అతడికి తెలియడంలేదు.

"బుద్ధిగా నాన్న చెప్పిన పిల్లని చేసుకో. నన్ను మర్చిపో" అంది సుందరి. ఈ మాటలు నామె ప్రేమగా అనలేదు. కోపంగా, వ్యగ్యంగా అంది.

సుబ్బారావు తొందరపడేవాడు కాదు కానీ అతడిప్పుడు భాస్కర్ గురించి భయపడుతున్నాడు.

భాస్కర్ సుందరి చదువుతున్న కాలేజీలో లెక్చరర్. అతడికి కాలేజీలో మంచిపేరుంది. కొత్తగా కాలేజీకి వచ్చాడు. సుందరి అతడికి నచ్చింది. కట్నం. పెళ్ళి ఖర్చులు లేకుండా అతడు సుందరిని పెళ్ళి చేసుకుంటా నంటున్నాడు.

రామగోపాలానికైతే సుందరిని భాస్కర్‌కిచ్చి పెళ్ళి చేయాలనుంది.

సుందరి తల్లి సరస్వతి మాత్రం ఊగిసలాడుతోంది. అన్నగారు తన మాట కాదనడని ఆమె నమ్మకం. ఆ నమ్మకంతో ఆమె ఓ ప్రయత్నం చేసింది.

"చెల్లెలిగా నువ్వంటే నా కిష్టమే! మేనకోడలిగా సుందరన్నా యిష్టమే! కానీ ప్రతి హోదాకూ కొన్ని సంప్రదాయా లుంటాయి. అవి పాటించి తీరాల్సిందే! అందుకు తూగ లేమనుకుంటే వేరే సంబంధం చూసుకోవడం మంచిది" అని జగన్నాధం కచ్చితంగా చెల్లెలికి చెప్పేశాడు.

అప్పుడు సరస్వతి అన్నగారికి భాస్కర్ సంబంధం గురించి చెప్పింది.

"అయితే యింకేం—శుభస్య శీఘ్రం!" అన్నాడు జగన్నాధం.

సరస్వతి తెల్లబోయింది — "వాళ్ళిద్దరూ ఒకర్నొకరు ప్రేమించుకుంటున్నా రన్నయ్యా" అందామె.

"ప్రేమదేముంది—హోదలు మారినా మన అన్నా చెల్లెళ్ళ ప్రేమ కద్దేమొచ్చింది. వాళ్ళూ అలాగే మర్చిపోతారు. ఇద్దరికీ వేరేవేరే పెళ్ళిళ్ళైతే—ప్రేమ అభిమానంగా మారిపోతుంది. అంతే!" అన్నాడు జగన్నాధం.

"అవతల భాస్కర్ తొందర పెడుతున్నాడు. నాకేమీ తోచడంలేదు."

"మీ కవసరమనుకుంటే — నేను డబ్బు సాయం చేస్తాను. వచ్చిన అవకాశం పోగొట్టుకోకండి"—అన్నాడు జగన్నాధం తాపీగా.

సరస్వతికి చాలా కోపం వచ్చింది.

ఆ తర్వాత సుందరి, సుబ్బారావు పార్కులో కలుసుకున్నారు.

అతడు చంద్రుడిలా వెన్నెలలు కురిపించాలనుకుంటున్నాడు. ఆమె పద్మంలా ముకుళించుకుపోతోంది.

"నే నో ఉపాయ మాలోచించాను. కాదనకు...."

అన్నాడు సుబ్బారావు ప్రతిమాలుతున్నట్లుగా.

సుందరి చెప్పమనికూడా అడగలేదు.

సుబ్బారావే మళ్ళీ—"మన మిద్దరం కలిసి రహస్యంగా పెళ్ళి చేసుకుందాం. ఆ తర్వాత పెద్దలకు చెబుదాం. అప్పుడు వాళ్ళింకేమీ చెయ్యలేరు" అన్నాడు.

"అలా చేస్తే నాకు, మా కుటుంబానికి చెడ్డపేరు. జీవితాంతం మీ నాన్న మమ్మలి సాధిస్తాడు. డబ్బు లేకపోయినా మాకు పరువుంది" అంది సుందరి.

"మీకు చెడ్డపేరు రానివ్వను. తప్పంతా నాదేనని ఒప్పుకొంటాను. నేను చెప్పిందానికి కాదనకు" అన్నాడు సుబ్బారావు.

"జగన్నాధం మామయ్య డబ్బు మనిషి. డబ్బుకోసం ఆయన ఆత్మీయతను కూడా వదులుకుంటాడు. అలాంటింట్లో కోడల్ని కావడం నా కిష్టంలేదు. కట్నం తేలేదని నన్ను కిరసనాయిలుతో తగలెట్టినా ఆశ్చర్యంలేదు...." అంది సుందరి.

"నాన్నలాంటివాడు కాదు. కట్నం కోసం పట్టుబట్టాడంటే - అది దుర్మార్గంకాదు. కొన్ని సంప్రదాయాల్నాయన నమ్మాడంతే!"

"పెద్దలు దీవించినప్పుడే పెళ్ళిచేసుకోవడం మాయింటి సంప్రదాయం. ఆ సంప్రదాయాన్ని నేనూ వదులుకోలేను...." అంది సుందరి.

"ప్లీజ్ - నాకోసం...." అన్నాడు సుబ్బారావు.

"ముందు నువ్వు నాకోసం ఏమైనా చేయి. ఆ తర్వాత నీకోసం నన్నేమైనా చేయమను...." అంది సుందరి.

"సుందరీ! నా సంగతి నీ కర్థంకావడంలేదు. స్వతహాగా నాకు నాన్నంటే భయం. అమ్మ దగ్గర మొహ

మాటం. వాళ్ళెప్పుడూ నా సుఖం గురించే ఆలోచిస్తారు. నా మంచి గురించే చూస్తారు. వాళ్ళను తప్పుపట్టడం, వాళ్ళమాట కాదనడం - ఇంతవరకూ చేయలేదు. నీకోసం ఆమాత్రం చేయలేనా అని నువ్వనుకోవచ్చు. అందుకు నాకు నీ బలం కావాలి. నువ్వు నిజంగా నాదానివైతే అప్పుడు నాలో కొత్తబలం వస్తుంది. నీకోసం ఏమైనా చేయగల్గుతాను. ఎవరినైనా ఎదిరించగల్గుతాను....అందుకే అడుగుతున్నాను. ప్లీజ్....నువ్వు నాదానివి కావాలి. మనం పెద్దలకు తెలియకుండా పెళ్ళిచేసుకుందాం...."

"అయాం సారీ - డియర్ మిస్టర్ సుబ్బారావ్!" అంటూ అక్కణ్ణించి లేచింది సుందరి.

సుబ్బారావేదో అనబోతూంటే ఆమె వినిపించుకో లేదు.

2

బజార్లో తనక్కావలసిన గాజులు, చెంప పిన్నులు, కాటుక వగైరాలు కొనుక్కుని ఇంటికి తిరిగి వెడుతూంటే ఆమె పక్కన ఓ కారాగింది. కార్లోంచీ సునీత ఆమెను పలకరించి - "కారెక్కవే - నీకోమాట చెప్పాలి-" అంది.

తటపటాయించకుండా కారెక్కింది సుందరి.

సునీత ఆమెకు మంచి స్నేహితురాలు. కాలేజీలో క్లాస్ మేటు.

సునీతకు కారులేదు. కారెక్కేటంత హోదా లేదు.

"ఏమిటే విశేషం!" అంది సుందరి కుతూహలంగా.

"నన్ను మన్నించు—" అంది సునీత.

"ఎందుకు?" అంది సుందరి ఆశ్చర్యంగా.

"నేను తప్పుచేస్తున్నానని తెలుసు. కానీ తప్పనిసరి.."

"ఏమిటే?" అంది సుందరి కుతూహలంగా.

సునీత కన్నీళ్ళను కొంగులో ఒత్తుకుంది.

"నేను చెప్పనక్కర్లేదు. కాసేపట్లో నీకే తెలుస్తుంది."

కారు శరవేగంతో దూసుకుని పోతోంది.

సుందరికేమీ అర్థంకాలేదు. సునీత కేదో ప్రమాదం జరిగిందని ఆమె అనుకుందికానీ - ప్రమాదం తనకేనని ఆమెకు తెలీదు.

"చెప్పవే!" అని ఆమె ఇంకా ఏదో అనబోతూండగా ముందు సీట్లోంచి ఓ వ్యక్తి వెనక్కి తిరిగాడు.

కారు వేగం తగ్గింది.

అత డెందుకు వెనక్కి తిరిగాడో సుందరికి తెలియదు. అతడి చేతిలోని రుమాలు ముందు సుందరికీ తర్వాత సునీతకూ స్పృహను పోగొట్టింది.

స్పృహ వచ్చేసరికి సుందరి ఓ చిన్నగదిలో ఉంది.

గదిలో ఓ పాతిక వాట్ల బల్బు వెలుగుతోంది. పైన ఫ్యాను నెమ్మదిగా తిరుగుతోంది. తలుపులు మూసి ఉన్నాయి.

ఇనప్పెట్టిలా ఉందా గది.

ఆ గదిలో మొత్తం ఎనమండుగురు యువతులున్నారు సుందరితో కలిపి.

అందరివీ లేత వయసులు. అంతా అందంగా ఉన్నారు.

సుందరి వారిలో సునీతను గుర్తుపట్టింది.

సునీతకు కూడా అప్పుడే స్పృహ వచ్చింది.

"ఏమిటే యిది!" అంది సుందరి.

"మన మిపుడు బందీలం-" అంది సునీత.

"ఎందుకు?"

"బహుశా మన నే దూరప్రాంతాలకో అమ్మేస్తారు."

"ఎందుకు?"

"ఆడపిల్లల్నెవరైనా ఎందు కమ్మేస్తారు?" అంది సునీత.

సుందరి భయంగా చుట్టూ చూసింది.

అక్కడున్న యువతులందరి ముఖాల్లోనూ అదే రకం భయం కనబడుతోంది.

వారందరూ ఒకరి నొకరు పలకరించుకుని పరిచయాలు చేసుకున్నారు. అంతా సామాన్య కుటుంబాలకు చెందిన పడతులు. ఇంచుమించు ఒకే వయసువారు.

"సునీతా! నువ్వు నన్ను మోసం చేశావు...." అంది సుందరి.

"నడిరోడ్లో బట్టలు విప్పి నడిపిస్తానంటే భయపడి వాళ్ళు చెప్పినట్లు చేశాను-" అంది సునీత.

"నువ్వెలాగొచ్చా విక్కడికి?"

మోసం చేయాలంటే లక్షమార్గాలు. ఆ యువతులందరూ మోసంతో అక్కడకు రప్పించబడ్డారు.

వారిలో ప్రియ అనే యువతికి మాటి మాటికీ ఏడుపొస్తోంది.

వారం రోజుల్లో ఆమెకు పెళ్ళి. తండ్రి కష్టపడి ఓ సంబంధం కుదిర్చాడు. పెళ్ళివారికి పదివేల రూపాయల కట్నం అడ్వాన్సుగా యిచ్చాడు.

ఇప్పుడు పెళ్ళి చెడిపోతుంది. కట్నం డబ్బు పోతుంది.

ప్రియ ఏడుపు ఆ కన్నెపడుచు లందరి గుండెల్నీ దేవేస్తోంది.

అప్పుడా గది తలుపులు తెరుచుకున్నాయి.

ఓ యువకుడు లోపల ప్రవేశించాడు. ఎర్రగా బుర్రగా బాగున్నాడు మనిషి. అతడి చేతిలో ఓ సంచీ ఉంది.

"అమ్మాయిలూ! మీకోసం టిఫిన్ తెచ్చాను-" అన్నా డతను ఇంగ్లీషులో. ఉచ్చారణ నా త్రిండియన్లకులాగుంది.

"మాకు టిఫిన్ వద్దు. మమ్మల్ని వదిలిపెట్టు-" అంది సునీత.

ఆ యువకుడు మాట్లాడలేదు....

"ఎవర్నువ్వు?" అంది సునీత.

అతడు నవ్వి—"మిమ్మల్నిక్కడకు రప్పిస్తే అది నా ఉద్యోగం. వ్యాపారం కాదు-" అన్నాడు.

"వ్యాపారం వేరే ఎవరికైనా ఉందా?"

"ఉంది—"

"ఎవరికి?"

"అది చెప్పడం నా ఉద్యోగ ధర్మం కాదు...."

"ఏం చేస్తారు మమ్మల్ని?"

"మా కస్టమర్స్వచ్చి మిమ్మల్ని చూసి పరీక్షచేసి ఎన్నుకుంటారు. వాళ్ళు మీకు కట్టిన ధర మాకు నచ్చితే - మీ రమ్ముడుపోతారు. అమ్ముడయ్యేదాకా మీ రీ గదిలో ఉంటారు. మీ కతిథిమర్యాదలు జరిపే బాధ్యత నాది...." అన్నా డతడు.

"మే మిక్కణ్నించి తప్పించుకొనే అవకాశం లేదా?" అంది సుందరి.

"ఉంది."

"ఎలా?"

"మీలో ప్రతి ఒక్కరికీ కనీసం పాతికవేల రూపా యల ధర పలుకుతుందని బాస్ అంచనా. మీవాళ్ళు యాభై వేలివ్వగలిగితే - బాస్ మిమ్మల్ని తిరిగి మీ యింట్లో అప్ప జెప్పేస్తాడు" అన్నా డా యువకుడు.

"యాభయి వేలా - అంత డబ్బు వాళ్ళివ్వలేరు."

"ఇవ్వగల వాళ్ళనింట్లోంచి బాస్ పిల్లల్నెత్తుకుని రాడు...." అన్నాడా యువకుడు నవ్వుతూ.

అతడు మనిషి అందంగా ఉన్నప్పటికీ - ముఖంలో రవంత జాలి కూడా లేదు.

అతడికి భయపడి వారతడు తెచ్చిన టిఫిన్ తిన్నారు.

అతడు వెళ్ళిపోయాక యువతులు కబుర్లలో పడ్డారు.

అందరికీ ఒకటే దిగులు....అక్కణ్ణించి బయటపడ్డం ఎలా?

3

ఒకరోజు సుందరి కక్కడ ఏ విశేషమూ లేకుండానే గడిచింది. రాత్రంతా వారు ఆ గదిలో కటిక నేలమీద పడుకున్నారు.

గది నానుకుని బాత్రూముంది. అందులోంచి బయటకు పారిపోయే అవకాశాలేమైనా ఉంటాయేమోనని యువతు లందరూ పరిశీలించారు. కానీ వెంటిలేటరు వారి కంద నంత ఎత్తులో ఉంది. దాన్నందుకుందుకు గదిలో స్టూలు లాంటి దేమీ లేదు.

"మన గతి యింతే!" అంది ప్రియ.

వేరే గదిలో వారికి స్నానాల సదుపాయం ఏర్పాటు చేయబడింది అక్కడ యిద్దరు యువతులు ప్రతి యువతి చేత స్నానం చేయించి మంచి బట్టలు కట్టబెట్టేరు. అవి అంతవరకూ వారు ధరించని ఆధునిక దుస్తులు. ఆ ఆ దుస్తులు చూసుకుని కొందరు మొహమాటపడ్డారు. కొందరు సంతోషపడ్డారు.

ఏం జరుగుతుందోనని అందరూ భయపడుతున్నారు.

స్నానాలయ్యేక ఓ డైనింగ్ హాల్లో అందరూ టిఫిన్ చేశారు.

ఇల్లు చాలా గొప్పగా ఉంది. కానీ వారికిల్లంతా స్వేచ్ఛగా తిరిగే అవకాశం లేదు. గొర్రెల మందలా తమను నడిపించేవారిమీద ఆధారపడాలి వారు.

అప్పుడు వారికి తిరిగి నిన్నటి యువకుడు కనిపించాడు.

"కస్టమర్స్ వచ్చారు. మీరిక్కడే వుండండి" అన్నా డతడు ఇంగ్లీషులో.

యువతులందరికీ గుండె లదిరాయి.

"ఎవరి పేరు పిలిస్తే వారు బయలుదేరి రావాలి...." అన్నాడు మళ్ళీ.

అందరూ గుండెలు బిగబట్టారు. అతడు వెళ్ళి పోయాడు.

వారిచేత స్నానం చేయించిన యువతులు ఒక్కొక్క రికీ మేకప్‌తో ఫైనల్‌టచెస్ ఇస్తున్నారు.

యువతులందరి మనసుల్లోనూ ఒక్కటే భయం....

ఏం జరుగుతుం దిప్పుడు?

తాము మళ్ళీ తమ వాళ్ళను చూడగలరా?

మున్ముందెలాంటి జీవితం తమకు రాసిపెట్టి ఉంది?

యువకుడు వచ్చి ఓ పేరు పిలిచాడు.

ప్రియ....

ఆమె వెళ్ళి తిరిగిరావడానికి ఇరవయి నిముషాలు పట్టింది.

"ఏం జరిగింది?" అంటూ అంతా ఆమెను చుట్టు ముట్టారు.

ఆమె ఏడుస్తూంది. అప్పటికే చాలాసేపట్నుంచి ఏడు స్తూందేమో - బుగ్గమీద చారికలు కూడా ఏర్పడ్డాయి.

"ఏం జరిగింది?" సునీత అడిగింది.

"నాకు ముప్ఫయివేలు ధర కట్టారు. బేరం అయి

పోయింది....” అంది ప్రియ ఏడుపు గొంతుతో.

ఇంతలో యువకుడు మళ్ళీ వచ్చాడు....సుందరి....

వణుకుతున్న తనువుతో సుందరి అక్కణ్నించి కదిలింది.

అప్పుడు సుందరి మినీస్కర్టు ధరించి ఉంది. ఆ డ్రస్సామె శరీరంలోని వంపుసొంపుల్ని - గుండె ఎత్తుల్ని స్పష్టంగా ప్రదర్శిస్తూంది.

ఆమె ఓ గదిలోకి చేరుకుంది.

చిన్న గది.

నేలమీద ఖరీదైన కార్పెట్.

గదిలో సోఫా.

గోడలకు శృంగారభరితమైన పోస్టర్లు.

సోఫాలో ఇద్దరున్నారు.

“బాస్....సుందరి!” అన్నాడతడు.

సోఫాలో ఉన్న యిద్దరిలో ఒకడు లేచి నిలబడ్డాడు. అతడు నల్లగా ఉన్నాడు. అతడి నంతకు ముందెప్పుడూ సుందరి చూసి ఉండలేదు. అతడే బాస్ అని ఆమె గ్రహించింది.

రెండో వ్యక్తి పచ్చని దబ్బపండు చాయలో ఉన్నాడు. సుమారయిన ఎత్తు. వయసు ముప్పై పయిన వుంటుంది. చురుకయిన చూపులు.

“మిస్టర్ లాల్! ఏమిస్తారో చెప్పండి....” అన్నాడు బాస్.

లాల్ లేచి నిలబడ్డాడు. అతడి చురుకయిన చూపులామె దుస్తుల్ని వలిచి చూస్తున్నాయి.

“పద్దెనిమిది వేలు” అన్నాడతడు.

“చాలా తక్కువ....” అన్నాడు బాస్.

"అంతకు మించి యివ్వలేను...."

"మీరు సరిగ్గా చూడలేదు...."

"ఒక్క చూపులో ఆడదాని నగ్నదేహాన్ని ఆయిల్ పెయింటింగ్‌లా గీయగలను. ఈమెకింతకు మించి యివ్వ లేను...." అన్నాడు లాల్.

బాస్ టీపాయ్ మించి ఓ ఫైలు తీశాడు. అందులో ఎందరో నగ్నయువతుల బొమ్మలున్నాయి. బొమ్మలకింద ధరలున్నాయి. అందులో ఎవరి ధరా పాతిక వేలకు తక్కువ లేదు.

"వీరిలో ఈమె నెవరితో పోల్చి చూస్తారో చూసుకుని అప్పుడు ధర కట్టండి" అన్నాడు బాస్.

"నాకు శాంపిల్సవసరం లేదు. ఈమెకు పద్దెనిమిది వేలకు మించి యివ్వను...."

"సరే - మీరు వెళ్ళొచ్చు...." అన్నాడు బాస్.

లాల్ వెళ్ళిపోయాడు. గదిలోకి మరో నౌఖర్ వచ్చాడు. అతడు సుందరిని ఫోటోలతో పరీక్షించి - ఇరవయి వేల కంటే చేయదన్నాడు.

ఆ తర్వాత ఓ గోవింద్ వచ్చి ఆమెకు పదహారు వేలు ధర కట్టాడు.

మొత్తం అయిదుగురామెను పరీక్షించారు.

చివరికి ఇరవయి రెండు వేలకు ఓ సుకుమార్ బేరం ఫయినల్ చేశాడు. మనిషి మారకుండా అతడు సుందరి వేలిముద్రలు తీసుకున్నాడు.

జరుగుతున్న ఈ అవమానకరమైన బేరానికి సుందరికి ఆపుకోలేని దుఃఖం వచ్చింది. ఆమె వెక్కి వెక్కి ఏడు స్తూంది.

లేడి కన్నీళ్ళు వేటగాడికి జాలిగొలుపవు.

సుకుమార్‌ని పంపి "నెట్టు!" అన్నాడు బాస్.

సుందరి గదిలోంచి యువతుల మధ్యకు వెళ్ళింది.

"ఏం జరిగింది?" అంటూ ఆమె చుట్టూ చేరిన వారిలో ప్రియ లేదు.

సుందరి ప్రియ పక్కకు పోయి కూర్చుంది.

ప్రియ ఇంకా ఏడుస్తూంది.

సుందరి ఆమెతో శృతి కలిపింది.

4

ఆ రాత్రి యువతులకు కటిక నేలకాదు.

నేలంతా ఓ పెద్ద పరుపు. దానిమీద వారు పడుకున్నారు.

అయితే ఆ రోజాపరుపు కటిక నేలకంటె కఠినంగా తోస్తూంది వారికి.

అయినవారందరికీ దూరంగా ఎక్కడికో వెళ్ళిపోయి పరమ నికృష్టమైన జీవితం తామనుభవించాల్సి ఉందని వారందరికీ తెలుసు.

అందరూ ఒకరివంక ఒకరు దిగులుగా చూసుకొంటున్నారు.

ఒక్కరూ మాట్లాడడంలేదు.

ఉన్నట్లుండి గది తలుపులు తెరుచుకున్నాయి.

అప్పుడు బహుశా ఏ అర్ధరాత్రో అయుంటుంది. అయినా అంతా మెలకువగానే ఉన్నారు.

గుమ్మంలో ఆ యువకుడు నిలబడి ఉన్నాడు.

"సుందరి!" అన్నాడతడు.

సుందరి చటుక్కున లేచి కూర్చుని—"నేను రాను"—అంది భయంగా.

"మీవాళ్ళు నీ గురించి యాభై వేలిచ్చారు...." అన్నాడతడు.

సుందరి తెల్లబోయింది.

"నీ కీ రోజు విముక్తి; వెళ్ళిపోవచ్చు...." అన్నాడతడు.

సుందరి ఉత్సాహంగా లేచి నిలబడింది.

"నువ్వు నిజం చెబుతున్నావా?" అంది నమ్మలేనట్లు.

అతడామెను సమీపించాడు. అతడి చేతిలోని రుమాలామెకు మరుక్షణంలో స్పృహ తప్పించింది.

స్పృహ వచ్చేసరికి సుందరికి తల్లి కనిపించింది.

ఆమె కళ్ళు నులుముకుని—"ఇది కలా, నిజమా?" అంది.

"నిజమే—" అంది తల్లి.

అప్పుడామె తన ఎదురుగా ఉన్న తండ్రినీ, తమ్ముణ్ణీ కూడా చూసింది. వాళ్ళందరూ ఏడుస్తున్నారు.

"అసలేం జరిగిందే?" అంది తల్లి.

"నేనిక్కడి కెలా వచ్చాను?" అంది సుందరి.

"అర్ధరాత్రిపూట మీ నాన్నగారికో చీటీ అందింది. నువ్వో పార్కులో స్పృహ లేకుండా ఉన్నావని! వెళ్ళి నిన్ను తెచ్చుకున్నాం...."

"కానీ—నన్నెలా విడిపించారు మీరు?" అంది సుందరి.

సరస్వతి నిట్టూర్చి—"నీమీద ఆశ వొదులుకున్నాం. కానీ అనుకోకుండా నీ మామయ్య సాయంచేశాడు—" అంది.

"మామయ్య సాయంచేశాడా?" అంది సుందరి ఆశ్చర్యంగా.

అంతకంటే ఆశ్చర్యకరమైన విశేషం వింది సుందరి తర్వాత.

కిడ్నాపర్సునుంచి రామగోపాలానికి ఉత్తరం అందింది. ఆయనకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. పోలీసు కంప్లైంటిస్తే పిల్ల శవాన్నే చూస్తారని బెదిరించాడు కిడ్నాపర్. డబ్బేమో ఫలానా పార్కులో ఫలానా క్రోటన్సు మొక్కల వెనుక ఉంచమని రాశాడు.

సరస్వతికేం చేయాలో దిక్కుతోచక — జగన్నాథం దగ్గరకు పరుగెత్తి విషయం చెప్పింది.

"దిగులుపడకు. డబ్బు నేనిస్తాను. సుందరిని విడిపించుకో" అన్నాడు జగన్నాథం వెంటనే.

"నిజంగా డబ్బు నువ్విస్తావా?" అంది సరస్వతి తెల్లబోయి.

"చూస్తూ చూస్తూ నా మేనకోడల్ని కిరాతకుల చేతిలో వదిలిపెడతానా?" అన్నాడు జగన్నాథం.

"దాన్ని కోడల్ని చేసుకోమంటే డబ్బు కావాలన్నావు. నేనెంత బతిమాలినా కరగలేదు. అలాంటి దిప్పుడు దాని కోసం డబ్బిస్తానంటూంటే...." అంది సరస్వతి.

"పెళ్ళికి కట్నం సంప్రదాయం. కాబట్టి అడిగాను. కోడల్ని డబ్బిచ్చి తెచ్చుకోవడం సంప్రదాయానికి వ్యతిరేకం. కాబట్టి కాదన్నాను. కానీ నా మేనకోడల్నిలాంటి పరిస్థితుల్లోంచి రక్షించుకుందుకే సంప్రదాయమూ నా కడ్డురాదు. దాన్ని రక్షించుకోలేకపోతే నా డబ్బుకు విలువలేదు. చంటపప్పట్నించీ నేనూ దాన్నెత్తుకుని పెంచాను. అది నీకెంతో నాకూ అంతే?" అన్నాడు జగన్నాథం.

సరస్వతి అన్నగారి కాళ్ళమీద పడి—నువ్వు దేవుడివంది.

"నేను డబ్బిచ్చినట్లెవరికీ చెప్పకండి. పిల్ల కిడ్నాపర్సు చేతిలో పడిందనెవరికీ తెలియనివ్వకండి. మళ్ళీ పెళ్ళి కావడం కష్టం" అని హెచ్చరించి జగన్నాధం సరస్వతికి డబ్బిచ్చాడు.

సుందరి రక్షించబడింది.

"మామయ్యింత మంచివాడని నే ననుకోలేదు. డబ్బిచ్చినా ఏ నోటో రాయించుకుంటా డనుకున్నాను" అంది సుందరి అమితాశ్చర్యంతో.

ఈలోగా అక్కడికి సుబ్బారావొచ్చాడు. సుందరి తిరిగొచ్చినందు కతడికెంతో సంతోషంగా ఉంది.

అక్కడ తనకు జరిగిన భయంకరానుభవాలు గుర్తు తెచ్చుకుందుకూడా భయపడింది సుందరి.

సుబ్బారావు సుందరితో ఏకాంతంగా మాట్లాడా లన్నాడు.

"మా నాన్న నిన్ను కిరసనాయిలుతో తగలబెట్టడన్న నమ్మకం కలిగిందిగా—నా మాట విను. మనం రహస్యంగా పెళ్ళి చేసుకుందాం" అన్నాడు సుబ్బారావు ఏకాంతంలో.

సుందరి వెంటనే "మామయ్యమీద నాకున్న దురభిప్రాయం పోయింది. అందుకే నేనాయన కన్యాయం చేయలేను. ఈ పెళ్ళి మామయ్య కిష్టమైతేనే జరుగుతుంది. నీ కిష్టమైనా సరే జరుగదు" అంది.

"నీ కిడ్నాపింగ్ గురించి వాడవాడలా ప్రచారం చేస్తాను. అప్పుడు నిన్నెవ్వరూ పెళ్ళిచేసుకోరు. నేను తప్ప నీకు గతి ఉండదు" అన్నాడు సుబ్బారావు.

సుందరి అప్పటికేమీ మాట్లాడలేదు.

తర్వాత ఆమెను చూడ్డానికి జగన్నాథం వచ్చాడు. ఇంట్లో అంతా జగన్నాథాన్ని దేవుడిలా చూశారు. సుందరి ఆయన కాళ్ళమీద పడిపోయింది. జగన్నాథం ఆమెను ఆప్యాయంగా దగ్గరగా తీసుకున్నాడు.

సుందరి ఆయనకు సుబ్బారావేమంటున్నాడో చెప్పి— "బావకు నేను సహకరించనని మాటిస్తున్నాను. నువ్వు కిడ్నాపింగ్ గురించి బావ దుష్ప్రచారం చేయకుండా ఆపు మామయ్యా!" అంది.

జగన్నాథం సుందరిని మెచ్చుకుని "చిన్నప్పట్నించీ మంచి బుద్ధులే నీవి. మీ నాన్నెలాగో అలా డబ్బు కూడ బెట్టి నిన్ను నా యింటి కోడల్ని చేస్తే బాగుండేది. కానీ మనకలాంటి అవకాశం లేదు" అన్నాడు.

సుందరి మనసు చివుక్కుమంది.

అయితే ఆ మర్నాడంతకంటే పెద్ద విశేషం జరిగింది.

మొత్తం కిడ్నాపర్సు పట్టుబడ్డారు. అందరాడపిల్లలూ విడిపించబడ్డారు. రామగోపాలానికి యాభై వేలూ తిరిగొచ్చాయి.

డబ్బు తీసుకుని కుటుంబసమేతంగా జగన్నాథం ఇంటి కెళ్ళాడు రామగోపాలం.

"కిడ్నాపర్సు సామాన్యుల పిల్లల్నే పడుతున్నారు. వాళ్ళకీ దేశంలో రక్షణలేదని వాళ్ళ నమ్మకం. నేను డబ్బిచ్చాను కాబట్టి నువ్వు నీ కూతుర్ని విడిపించుకోగలిగావు. కానీ నేను డబ్బిచ్చి చేతులు ముడుచుకు కూర్చోను గదా! అత్యున్నత స్థాయిలో పోలీసు రిపోర్టిచ్చాను. పోలీసులు రహస్యంగా రంగంలోకి దిగారు. సుందరి ఇంటికొచ్చే దాకా వాళ్ళేమీ చేయకూడదని నా శాసనం. ఆ తర్వాత

వాళ్ళు కిడ్నాపర్సుమీద దాడి చేశారు. చాలా భయంకర మైన ముఠా యిది. వీళ్ళు దొరకడంతో—దేశానికో పెద్ద పీడ వదిలింది'' అన్నాడు జగన్నాధం.

''నిజం మామయ్యా! ఆడపిల్లలకు నువ్వు నిజంగా చాలా పెద్ద ఉపకారం చేశావు....'' అంది సుందరి కిడ్నా పర్సు దుర్మార్గాన్ని తలచుకుంటూ.

''బావగారూ — మీ డబ్బుగట్టిది'' అన్నాడు రామ గోపాలం.

''అది నా డబ్బుకాదు. మీది. నా మేనకోడలి కోసం నేనా డబ్బిచ్చాను. అది పోయిందనే అనుకున్నాను. నాకు సంబంధించినంతవరకూ అది పోయినట్లే లెక్క. తిరి గొస్తే అది మీ డబ్బు. మీ అదృష్టం....'' అన్నాడు జగన్నాధం.

రామగోపాలం తెల్లబోయి—''ఏం చేసుకోను నే నీ డబ్బు?'' అన్నాడు.

''అలాగంటారేమిటి బావగారూ! సుందరికి పెద్దింటి సంబంధం చూసి పెళ్ళిచేయండి. మీరు యాభై వేలు ఖర్చు చేయగలనంటే—నా కొడుకే ఉన్నాడసలు....'' అన్నాడు జగన్నాధం.

సుందరికీ సుబ్బారావుకీ పెళ్ళయింది. అందుకు తన ప్రేమబలమే కారణమన్నాడు సుబ్బారావు.

సుందరికి మాత్రం జగన్నాధం నమ్మే సంప్రదాయా న్నించి తనవంటి వారికి హాని కలగకుండా — కొందరు కిడ్నాపర్సు కాపాడుతున్నారని ఎప్పటికీ అని పిస్తుంది. □

నటుచేరని గూఢచారుడు

కె.వి.యస్.యన్.మూర్తి

రమేష్ టండన్ నడుపుతోన్న జీపును ఆపాడు. తన ప్రక్కనే కూర్చుని వున్న మీనామధుకర్ని చూశాడు. ఆమె మొహం పాలిపోయి నీరసంగా వుంది.

మధ్యాహ్నం పన్నెండు కావస్తూంది. ఎడారి ప్రాంతం కావటంవలన ఎండ నిప్పులు చెరుగుతోంది. వెచ్చటి

గాడ్పులు వాళ్ళకు ఈ చెంపలోంచి, ఆ చెంపలోనికి దూసుకొని పోతున్నాయి. గాలితోపాటు ఎగిరి వచ్చిన యిసుక రేణువులు మాత్రం, వారిని వదలకుండా వాళ్ళ శరీరాలకు ఎక్కడ తగిలినవి అక్కడే వుండిపోయి, వారి శరీరం రంగునూ, వెంట్రుకల రంగునూ మారుస్తూన్నాయి.

రక్తంలో వున్న నీరంతా ఆవిరయిపోతుందేమోనన్న భయంతో వాళ్ళిద్దరూ మాటి మాటికీ గ్లూకోజ్ చప్పరిస్తున్నారు, ఎలక్ట్రాల్ పౌడర్ను నీటిలో కలుపుకు తాగుతోన్నారు. అయినా వాళ్ళిద్దరినీ ఏదో తెలియని నీరసం ఆవహిస్తూంది.

రమేష్‌కు - ఛీఫ్ చంద్రశేఖర్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

"రాజస్థాన్ డెజర్ట్‌లోని జైసల్మేర్ జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అది అక్కడితో ఆగిపోతే బావుణ్ను. పాకిస్తాన్ గూఢచారులకూ స్మగ్లర్లకూ అది పెద్ద ఎసైలమ్ అయిపోయింది. ఈమధ్య మన సైనిక రహస్యాలూ, ఆయుధ కర్మాగారాల బ్లూ ప్రింట్లూ ఆ ప్రాంతం ద్వారానే పాకిస్తాన్‌కు చేరుతున్నాయి. దీనికి అక్కడి స్థానికుల మద్దత్తు చాలా వుంది. ఎవరు మంచివాళ్ళో, ఎవరు చెడ్డవాళ్ళో తెలియటం లేదు. ఎవర్ని అనుమానించటానికీ మన దగ్గర ఆధారాలు లేవు. నువ్వు ఆ ప్రాంతానికి వెళ్ళు. ఆ రాకెట్‌ను సాక్ష్యాధారాలతో సహా పట్టుకో. నీకు అక్కడ బి.ఎస్.ఎఫ్. అన్ని విధాలా సాయపడుతుంది___"

రమేష్ భుజాలెగరేశాడు.. అంతలోనే కళ్ళు మూసుకుని బాధగా "అబ్బా" అన్నాడు.

"ఏమయింది - రమేష్?" ఆత్రుతగా అడిగింది మీనా.

రమేష్ టండన్ - కళ్ళు నులుపుకుంటూ "కంట్లో ఏదో పడింది. చుర చురలాడుతోంది" అన్నాడు.

మీనా చటుక్కున అతని చేతిని పట్టుకుంది. "కళ్ళు నులపకు" అని అతని కను రెప్పల్ని సుతారంగా విడదీసింది. అతని మీదకు వాలి మొహం మీద మొహం పెట్టి కళ్ళల్లోకి గట్టిగా వూదింది.

రమేష్‌కు కళ్ళ మంట తగ్గింది. నెమ్మదిగా సీటు వెనక్కు జారగిల బడ్డాడు. అతనితోటే మీనా అతనిమీదకు వంగింది. మీనా ఎద పొంగులు అతనికి తగులుతోన్నాయి. ఆమె మెత్తని స్పర్శ అతడికి గమ్మత్తయిన మత్తును కలిగిస్తూంది. ఏదో అమర సుఖాన్ని పొందుతోన్న తమకానికి గురయ్యాడు.

"పోయిందా?" అడిగింది మీనా.

"ప్చ్!"

మీనా మళ్ళీ తన ప్రయత్నాన్ని కొనసాగించింది. ఎప్పటికీ రమేష్ నుండి సమాధానం రాకపోయేటప్పటికి ఆమెకు అనుమానం వచ్చింది. అతని పరవశాన్ని గ్రహించి ఆమె బుగ్గలు కెంపులయ్యాయి. "యూ నాటీ!" అంటూ చిరుకోపాన్ని నటిస్తూ దూరంగా జరగబోయింది.

రమేష్ ఆమెను కదలకుండా పట్టుకుని "ఐ లవ్ యూ మీనూ! ఐ లవ్ యూ!" అన్నాడు.

మీనా అతని ఎదమీద గువ్వపిట్టలా ఒదిగిపోయింది.

"ఆపరేషన్ సక్సెస్ అయితే మనం చీఫ్ సమక్షంలోనే భార్యాభర్తలం అవుతాం" అన్నాడు రమేష్.

"మనం తప్పక విజయం సాధిస్తాం!" అంటోంది మీనా. అంతలోనే రెండు అగ్నిగోళాలు 'సర్' మంటూ

వారికి వెంట్రుకవాసి దూరం నుండి దూసుకుపోయాయి.

వెంటనే రమేష్ ప్రమాదాన్ని పసిగట్టి "గెట్ డౌన్" అని అరచి స్టెన్ గన్ తీసుకుని జీపులోంచి క్రిందకు దొర్లాడు మీనా కూడా జీప్‌కు అటువయిపు దొర్లింది.

రమేష్ జీప్ వెనక్కు వెళ్ళి నిలబడ్డాడు.

క్షణాలు నిశ్శబ్దంగా దొర్లుతున్నాయి. శత్రువులు దూరంగా తుప్పల వెనుక పొంచి వున్నారు. వాళ్ళు ఎంద రున్నారో తనకు తెలియదు. తను తొందరపడకూడదు. శత్రువులు ముందుగా షూట్ చేస్తే తను అంచనాగా ఆయు ధాన్ని అటు వుపయోగించవచ్చు, కానీ శత్రువుల నుండి ఏ రకమయిన చర్యా లేదు. బహుశ వాళ్ళు కూడా తన లాగానే ఆలోచిస్తూ వుండొచ్చు.

రమేష్ మరో నిముషం మౌనంగా వున్నాడు. తరవాత దగ్గర్లో వున్న రాయిని తీసుకుని ముందుకు దొర్లించాడు. అంతే! ఆ రాయి వయిపుకు నాలుగయిదు బుల్లెట్లు దూసుకు వచ్చాయి.

అవి వచ్చిన ప్రదేశాన్ని అంచనా వేసుకుని రమేష్ స్టెన్ గన్‌కు పని చెప్పాడు. మీనా చేతిలోని గన్ కూడా రెండుసార్లు పేలింది. తుప్పల వెనక నుండి ఒకేసారి నాలుగు ఆర్తనాదాలు వెలువడ్డాయి. వాటి వెనకే దబ్ మన్న చప్పుడు కూడా వినపడింది.

రమేష్ మళ్ళా యింకో రౌండు కాల్పులు జరిపాడు. అటువయిపు నుండి ఏ రకమైన రెస్పాన్సూ లేదు. తనున్న చోటు నుండి తుప్పల దగ్గిరకు పరుగెత్తాడు. మీనా అత డిని అనుసరించింది. అక్కడ ముగ్గురు శ్రీవులయి పడి వున్నారు. ఒక్కడు మాత్రం దేక్కుంటూ ముందుకు పాకుతున్నాడు.

రమేష్ రెండంగల్లో అతడిని చేరుకున్నాడు. అతడిని పట్టుకుని "ఎవరు నువ్వు?" అన్నాడు.

అతడు రమేష్‌ను నిర్లక్ష్యంగా చూశాడు. వెంటనే తల ప్రక్కకు వేలాడేశాడు. అతని మొహం నల్లగా వికృతంగా మారిపోయింది. నోటిలోంచి వచ్చిన తెల్లని నురుగ ఆ మొహాన్ని యింకా బీభత్సంగా మారుస్తూంది.

రమేష్ "షిట్!" అంటూ నిస్పృహతో లేచి నిల బడ్డాడు.

"మై గుడ్‌నెస్! శత్రువులు ఇంత త్వరగా రంగంలో దిగుతారనుకోలేదు" అంది మీనా.

"యస్! మనం చాలా జాగ్రత్తగా వుండాలి. ముందు మనం పాంచకాతలా చేరుకోవాలి. అప్పుడు భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్ణయించుకుందాం" అన్నాడు రమేష్.

2

పాంచకాతలా గ్రామం.

రాజస్థాన్‌లోని ఎడారి దాటాక కనుపించే మొట్టమొదటి కుగ్రామం-అది. ఆ గ్రామం పాకిస్తాన్‌కూ యిండియాకూ వున్న సరిహద్దు సమీపంలో వుండటంచేత దానికి ఎంతో ప్రాముఖ్యత వుంది. గ్రామ జనాభా తక్కువయినా - అక్కడ మిలటరీ బెటాలియన్లు ఎప్పుడూ బైఠాయించి వుండటంవలన - ఆ గ్రామం ఎప్పుడూ వచ్చేపోయే జనంతో చాలా రద్దీగా వుంటుంది.

ఆ గ్రామం మాదకద్రవ్యాల రవాణాకు కేంద్రస్థానం. భారత దేశంకు వచ్చే మత్తుపదార్థాలు అరవై శాతం పైచిలుకు ఆ గ్రామం ద్వారానే వస్తూ వుంటాయి. భారత దేశ సైనిక రహస్యాలూ, ఆయుధ కర్మాగారాల బ్లూ

ప్రింట్లూ పాక్ ప్రభుత్వానికి ఆ గ్రామం నుండే చేరు తున్నాయి. దీనికి బలమైన సాక్ష్యాలు లభ్యమయ్యాయి.

కానీ ఈ గూడుపుఠాణీకి నాయకుడు ఎవరో తెలియదు. దీంట్లో ఎందరు భాగస్వాము లున్నారో అసలే తెలియదు. ఏది ఎలా వున్నా ఆ వూళ్ళో కొందరికి దీంట్లో సంబంధ ముందనటం మాత్రం నిర్వివాదాంశం. ఆ వూళ్ళో చాలా మంది - పాక్ గూఢచార్లకూ స్మగ్లర్లకూ ఆశ్రయం కల్పిస్తూ వుంటారు. కొందరు డబ్బుకు ఆశపడి, మరి కొందరు భయపడీ.

ఆ వూళ్ళో అందరూ ఒక ఎత్తయితే ఆ గ్రామం సర్పంచ్ వాలీబ్ ఖాన్ ఒక్కడూ ఒక ఎత్తు. అతడే గనక లేకపోతే ఆ గ్రామం ఎప్పుడో మంటగల్సిపోయేది-అని చెప్పుకుంటూ వుంటారు. అంత మంచివాడు కాబట్టే అతడు ఆ గ్రామానికి అయిదోసారి పోటీ లేకుండా నాయ కుడిగా ఎన్నికయ్యాడు. అతనికి వున్న పలుకుబడి అంతా యింతా కాదు. కావాలంటే ప్రధానిని కూడా ఫోన్‌లో కాంటాక్టు చేయగల సమర్థుడు. అతడి వుపకారం పొందని మనిషంటూ ఆ గ్రామంలో లేడు.

అసలు ఆ గ్రామం మీద ప్రభుత్వానికి మొదట్లో అంత అనుమానం లేదు. కానీ గతనెల ఎక్సైజ్‌వారి దాడు లలో 472 కిలోల హెరాయిన్, 1040 కిలోల హషీష్, యింకా అనేక రకాల మాదక ద్రవ్యాలూ దొరికాయి. వాటిని తీసుకు వస్తున్న లారీలు పి.యి.వి. 5432' పి.పి.ఎ. 2437. ఈ రెండూ ఛోటియా, రామ్‌గర్‌లకు చెందినవి. వీరిద్దరూ పాంచకాతలా గ్రామానికి చెందిన మోతుబర్లు. లారీ డ్రయివర్లు సైనేడ్ మాత్రలు మింగి చనిపోయారు.

ఘోటియా, రామ్‌గర్గ్‌లకు అనేకమంది పెద్దవారితో సంబంధ బాంధవ్యాలున్నాయి. వారిద్దరి మీదా, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు కూడా అనుమానం వుంది. ఇది వరకు వారిపై రెండు మూడు కేసులు నమోదు కూడా అయ్యాయి. కానీ సాక్ష్యాధారాలు లేక కేసులు నిలవలేదు.

మొన్న ప్రముఖ స్మగ్లర్ గాజాఫకీర్ అరెస్టయ్యాడు. కానీ తప్పించుకు పారిపోయాడు. దాంట్లో కూడా వీళ్ళిద్దరికీ పాత్ర వుందన్న అనుమానంచేత రమేష్, మీనాలను పాంచకాతలా పంపారు.

సాయంత్రం ఆరు కావస్తోంది—

అప్పుడే ఆ గ్రామమంతట్టూ చీకట్లు ముసురుకుంటున్నాయి.

గుల్‌షేర్ రెస్టారెంట్ విద్యుద్దీపాలతో కళకళలాడిపోతోంది. లోపల చాలా కోలాహలంగా వుంది. ఆ రెస్టారెంట్ ఓనర్ గుల్‌షేర్ చిద్విలాసంగా నవ్వుతూ, అందర్నీ పలుకరిస్తూ రెస్టారెంట్ బయటకు వచ్చేడు. సరిగ్గా అప్పుడే ఆ రెస్టారెంట్ ముందు ఓ జీపు ఆగింది.

దాంట్లోంచి దిగుతున్న రమేష్ టండన్, మీనా మధుకర్‌లను చూసి గుడ్లు తేలవేశాడు గుల్‌షేర్. లోపలకు వెళ్ళి హడావుడిగా ఫోన్‌ను ముందుకు లాక్కున్నాడు.

రమేష్, మీనాలు జీప్‌లోంచి క్రిందకు దిగారు. బ్యాగ్‌లు భుజాన వేసుకుని లోపలకు నడిచారు. గుమ్మం ప్రక్కగా కేష్ కౌంటర్ కమ్ రిసెప్షన్ వుంది. అక్కడో బుర్ర మీసాల వ్యక్తి నిలబడివున్నాడు. అతని వెనుకేవున్న రేక్‌లలో బ్రాందీ సీసాలు వరుసగా పేర్చివున్నాయి.

రమేష్ కౌంటర్ దగ్గరకు వెళ్ళాడు. "మాకు నాలుగు రోజులకు డబుల్ రూమ్ కావాలి" అన్నాడు.

కౌంటర్లోని వ్యక్తి రమేష్‌నూ, అతని వెనుకనున్న మీనానూ అనుమానంగా చూశాడు.

అది గమనించి "మాకు క్రొత్తగా పెళ్ళయింది. హనీమూన్‌కు వచ్చాం" అన్నాడు రమేష్.

అతడు పకపకా నవ్వాడు. "హనీమూన్‌కా! ఏ కాశ్మీరో ఊటీయో వెళ్ళాల్సింది, హనీమూన్‌కు ఈ ఎడారికా!" అన్నాడు. హాల్లోని కొందరు అతని నవ్వుతో శృతులు కలిపారు.

"ఎవరి సరదా వారిది!" అన్నాడు రమేష్.

బుర్రమీసాల వ్యక్తి లెడ్జర్ తిరగేసి "మామూలు రూమ్‌లు ఖాళీలేవు. డీలక్సు స్పెషల్ వుంది. అదీ ఒకటే. కావాలంటే తీసుకోండి" అన్నాడు.

రమేష్‌కి తెలుసు - అతను తనని ఎక్స్‌ప్లాయిట్ చేస్తాడని, అయినా తమాయించుకుని "పర్వాలేదు యివ్వండి!" అన్నాడు జేబులోంచి వేలట్ తీసి.

"రోజుకు వెయ్యి రూపాయిలు సర్వీసింగ్ ఎక్స్‌ట్రా."

రమేష్ - ఏభై వంద కాగితాల్ని తీసి అతడికి అందించాడు.

అతడు వాటిని అందుకుని బాయ్‌ని పిలిచాడు. లెడ్జర్ను రమేష్ ముందరకు తోశాడు. రమేష్ సంతకం చేశాడు.

"సాబ్‌కో అండర్ లీ జావ్! రూమ్‌కా నంబర్ సాత్ సౌ ఏక్!" అంటూ బాయ్‌కి తాళాలు అందించాడు.

బాయ్ తాళాలు తీసుకుని ముందుకు కదిలాడు.

రమేష్, మీనాలు అతడిని అనుసరించారు.

హాలు మధ్యనున్న చెక్క మెట్లు ఎక్కారు. పెద్ద నడవా. నడవాకు యిరువైపులా గదులు. ఏడువందల ఒకటి గది బాగానే వుంది. డబుల్ కాట్ బెడ్. డ్రస్సింగ్

టేబిల్ ఎటాచ్‌డ్ బాత్.

మంచం చూసేటప్పటికి రమేష్‌కు ప్రాణం లేచి వచ్చింది. వెంటనే బట్టలయినా మార్చుకోకుండా మంచం మీదకు దూకాడు.

మీనా నవ్వుకుంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది.

3

"చెప్పు ఎవర్నువ్వు?"

ఆ వ్యక్తి మాట్లాడలేదు.

అతడిని గ్రామస్తులు స్తంభానికి కట్టి అరగంటనుండి చితక బాదుతున్నారు. అతడు ఎంత బాధనయినా ఓర్చుకొన్నాడు గానీ పెదవి విప్పి మాట్లాడలేదు. క్రిందకు వాల్చిన తల పైకి ఎత్తటంలేదు.

"ఇలా కాదు! వీడిని ముక్కలిరగదన్ని బ్రతికి వుండగానే యిసుకలో పాతేద్దాం! అప్పుడు దిగుద్ది రెమ్మ తెగులు" అంటున్నా రెవరో.

ఆ వ్యక్తిలో చలనంలేదు. కోపం తట్టుకోలేని ప్రజలు అతనిమీద తలో చెయ్యి చేసుకుంటున్నారు. అదే కొనసాగితే మరో కొన్ని నిముషాల్లో అతడు పరలోకయాత్ర చెయ్యడం ఖాయం.

సరిగ్గా అదే సమయంలో—గ్రామ సర్పంచ్ వాలీబ్ ఖాన్ పరుగు పరుగున అక్కడకు వచ్చాడు. "ఒరేయ్! ఒరేయ్! పరాయి దేశస్థుడని చంపేస్తారేంట్రా!" అంటూ అక్కడున్న మనుషులను వారించాడు....వాలీబ్ ఖాన్‌ను చూసి అక్కడున్న వారంతా దూరంగా జరిగారు. కొందరు యువకులు మాత్రం "వీడు పాకిస్తాన్ గూఢచారి. రక్తం కళ్ళచూడాల్సిందే!" అని అరిచారు.

"అయితే మాత్రం! చట్టాన్ని మన చేతుల్లోకే తీసు

కుంటామా? పోలీసులకు అప్పజెబుదాం!" అన్నాడు ఖాన్.

కాసేపు యువకులకూ సర్పంచ్‌కీ మధ్య ఘర్షణ జరిగింది. చివరకు సర్పంచే జయించాడు. అందరూ అతన్నే బలపరిచారు. వెంటనే సర్పంచ్ గ్రామస్థులలో యిద్దర్ని పిలిచాడు.

వాళ్ళిద్దరూ గూఢచారిని స్తంభంనుంచి విడదీశారు. చేతులను వెనక్కి విరచి కట్టేశారు. అతడిని ముందుకు తోసి నడిపించుకు పోయారు.

దూరాన్నుంచి ఆ తతంగాన్ని చూస్తున్న రమేష్, మీనాలు ఆశ్చర్యపోయారు.

వారు ఆవూరు వచ్చిన రెండురోజులలోనూ, యిలాంటి సంఘటనలు నాలుగు జరిగాయి. ప్రతిసారీ గ్రామస్థులు గూఢచార్లను పట్టుకోవటం - వాళ్ళను చంపకుండా దేశం అపఖ్యాతి పాలుగాకుండా - సర్పంచ్ వాలేబ్ ఖాన్ అడ్డుకోవటం - పోలీసులకు అప్పగించమని చెప్పి వెళ్ళిపోవటం జరుగుతూ వుంది.

అన్నిటికన్నా విచిత్రం - ఎప్పుడూ గూఢచార్లను పోలీసులకు అప్పజెప్పటానికి ముందుకు వచ్చేది - ఆ యిద్దరు మనుషులే. కానీ నలుగురిలో ఒక్కరు కూడా పోలీసులదాకా వెళ్ళలేదు. ఆ మిస్టరీని భేదించటానికి రమేష్ మీనాలు చాలా ప్రయత్నాలు చేశారు. చివరకు గూఢచార్లను తీసుకుని వెళ్ళే యిద్దరు మనుషులూ రామ్ గర్గ్ ఆప్తులని తెలుసుకున్నారు.

ఈ విషయాన్ని విపులీకరించి సర్పంచ్ వాలేబ్ ఖాన్‌కు వివరించి చెప్పాడు రమేష్. విషయం తెలిసి ఖాన్ వుగ్రుడై పోయాడు. పళ్ళు పటపట నూరాడు. "ఇప్పుడే ఆ

రామ్‌గర్గ్‌ను పోలీసులకు అప్పచెబుతాను” అంటూ ఫోన్ దగ్గరకు వెళ్ళి రిసీవర్ తియ్యబోయాడు.

రమేష్ అతడిని వారించాడు. “వద్దు ఖాన్‌గారూ! మనం అతడిని పట్టిచ్చినా, కేసు నిలవదు. మన దగ్గర సరయిన సాక్ష్యంలేదు” అన్నాడు.

ఖాన్ వుసూరంటూ కుర్చీలో కూలబడ్డాడు. “మరయితే! ఆ దుర్మార్గుడిని వదిలెయ్యటమేనా!” అన్నాడు బాధ పడుతూ.

“అవసరం లేదు, మీరు కంగారు పడకండి. మరో సారి యిటువంటిది జరగనివ్వండి. నేను సాక్ష్యాలు సంపాదిస్తాను” అన్నాడు.

అతని సలహా మేరకు సర్పంచ్ ఈ రోజు కూడా మామూలుగానే ప్రవర్తించాడు.

రమేష్ సర్పంచ్‌ని చూసి చెయ్యి వూపాడు.

సర్పంచ్ తల పంకించి ముందుకు వెళ్ళిపోయాడు.

రమేష్ గబగబా అడుగులు వేసుకుంటూ ఓ గుడిశ ముందుకు వెళ్ళాడు. “ఉద్దీన్ దాదా!” అంటూ పిలిచాడు.

“క్యాహూ ఆ! బేటా!” అంటూ గుడిసెలోనుండి ఓ ముదుసలి బయటకు వచ్చాడు.

రమేష్ అతనితో ఓ అయిదు నిముషాలు చేయవలసిన పనిని గురించి వివరించి చెప్పాడు. అతడు సంతోషంగా తలవూపి “దేశం గురించి నేను ఈ మాత్రం చెయ్యలేనా? నువ్వెళ్ళు బాబూ! ఆ అమ్మాయి ఒక్కతే వాళ్ళను అనుసరిస్తూన్నట్లుంది” అన్నాడు.

రమేష్ అతనికి కృతజ్ఞతలు చెప్పి పరుగులాంటి నడకతో మీనా దగ్గరకు వెళ్ళాడు. “ఏమయినా విశేషమా?” అన్నాడు.

"ఏమీ లేదు! మామూలే!"

ఇద్దరూ నెమ్మదిగా నడుస్తూ గూఢచారిని తీసుకు వెళు తున్న వారిని అనుసరించారు.

వూరు చివరకు వచ్చారు.

సరిగ్గా అక్కడే ప్రతీసారీ వాళ్ళు తప్పించుకుపోతు న్నారు. 'ఈసారి అలా జరగటానికి వీల్లేదు!' అన్న పట్టుదలతో వున్నాడు రమేష్.

కొద్దిగా గుబురుగా వున్న ప్రదేశం.

ముందు నడుస్తున్న ముగ్గురూ ఒక్కసారి ఆగారు. రమేష్. మీనాలు కూడా ఆగారు. ఏం చెయ్యాలో ఆలో చించేలోగా వాళ్ళ తలలమీద పిడుగులాంటి దెబ్బలు పడ్డాయి. ఇద్దరూ స్పృహతప్పి క్రిందపడిపోయారు.

రామ్‌గర్గ్ అనుచరులు వెనక్కు తిరిగారు. వారిచేతుల్లో పదునైన చురకత్తులు ప్రత్యక్షమయ్యాయి. "వీళ్ళ మొహాలు చెక్కిపారేద్దాం" అంటూ ముందుకు వంగారు.

జరగబోయే ఘోరాన్ని చూడలేక సూర్యుడు మబ్బులి చాటుకు తప్పుకున్నాడు.

4

సాయంత్రం నాలుగు గంటలయింది.

పాంచకాతలా గ్రామంలో వూరుచివర దారుణం జరిగిన దన్న వార్త దావానలంలా వ్యాపించింది. ప్రజలు తండోప తండాలుగా తరలివెళుతున్నారు.

సర్పంచ్ వాలేబ్‌ఖాన్ చేతుండుతో కళ్ళు తుడుచు కున్నాడు.

అతని ఎదురుగా రెండు శవాలున్నాయి. గుర్తుపట్టడానికి వీలులేకుండా వారి మొహాల్ని ఎవరో కసిగా చెక్కిపడే

శారు. కానీ వాళ్ళు వేసుకున్న బట్టలూ, వారిదగ్గరున్న సామానులు ఆధారంగా ఆ శవాలు రమేష్, మీనాలవని అందరూ గుర్తించారు.

విషయాన్ని పోలీసులకు తెలియబర్చి, శవాల్ని స్మశానానికి తరలింపజేశాడు ఖాన్. ఎవరూ అతడిని పలుకరించే ధైర్యం చెయ్యలేక పోతున్నారు. ఆ మాటకొస్తే అతనే కాదు — ఆ వూళ్ళోని ప్రతి ఒక్కర్నీ రమేష్ మీనాల చావు కుదిపేసింది.

ఇటు గ్రామం గ్రామం విషాదంలో వుంటే—

అక్కడ గుల్‌షేర్ రెస్టారెంట్ చాలా సందడిగా వుంది. రమేష్, మీనాల చావే ఆ హుషారుకి కారణం. రెస్టారెంట్ నంతటినీ దేదీప్యమానంగా అలంకరించారు. లోపల హాల్లో జనం - త్రాగుతున్నారు; తుళ్ళుతున్నారు, తింటున్నారు - కేరింతలు కొడుతున్నారు.

స్టేజ్ మీద హిషిమా గెంతుతోంది. ఆమె నాట్యం చూపర్లకు గిలిగింతలు పెడుతోంది. అందరూ ఆమెను లొట్టలు వేస్తూ చూస్తున్నారు. ఆమె ఉద్దీన్‌దాదా మనుమరాలు. ఆమే - ఆమె భర్తా సరిగ్గా ఓ గంట క్రితమే పాకిస్తాన్ నుండి ఆ వూరు వచ్చారు. వాళ్ళను దాదా, గుల్‌షేర్‌కు పరిచయం చేశారు. హిషిమా మాంచి కేబరే డాన్సర్ అని తెలిసి తన క్లబ్‌లో ఆమె ప్రోగ్రాంను ఏర్పాటు చేశాడు గులేషేర్. ఆమెకు కొద్ది దూరంలో ఆమె భర్త - జావేద్ - గిటార్ వాయిస్తున్నాడు.

గులేషేర్ నెమ్మదిగా నడుస్తూ జావేద్ దగ్గరకు వచ్చాడు. "పిలిచావట?" అన్నాడు.

జావేద్ అతన్ని కనీసం చూడనైనా చూడలేదు. జేబు

లోంచి చిన్న ప్లాస్టిక్ పొట్లాం తీసి యిచ్చాడు. దాంట్లో తెల్లటి పౌడరువుంది.

"ఏమిటిది?"

"హాషీస్!"

"నాకు దేనికి?"

"నా దగ్గిర ఆరొందల కెజీల సరుకుంది. నాకు డబ్బు అర్జంటుగా కావాలి" అన్నాడు జావేద్.

జావేద్‌ను ఆశ్చర్యంగా చూశాడు గుల్‌షేర్. ఇంత దాకా వచ్చాక యింక దాగుడు మూతలు అనవసరం అను కున్నట్లున్నాడు. "బాస్‌ను అడగాలి" అన్నాడు.

"అడుగు! వ్యవహారం సెటిల్ అయితే నీకు టెన్ పర్సెంట్!" అన్నాడు జావేద్.

గుల్‌షేర్ గుటకవెయ్యటం మర్చిపోయాడు. లొట్టలు వేశాడు. టెన్‌పర్సెంట్ - అంటే - లక్షల్లో వుంటుంది. అందుకే వెంటనే అతడిని బాస్ దగ్గిరకు తీసుకు వెళ్ళ టానికి ఒప్పుకున్నాడు.

డాన్సు ప్రోగ్రాం పూర్తయ్యేటప్పటికి రాత్రిపదిదాటింది.

జావేద్ హిషిమాల కళ్ళకు నల్లపట్టీలు కట్టి, వాళ్ళను జీపెక్కించాడు గుల్‌షేర్. తను తీసుకుని వెళ్ళే త్రోవ తెలియకుండా వాళ్ళని త్రోవలో మాటల్లో దింపాడు.

జావేద్ - అతని ప్రశ్నలకు సమాధానం చెపుతూనే చేతి వాచీని సవరించుకున్నాడు.

పావుగంటలో జీప్ ఒకచోట ఆగింది.

జావేద్ దంపతులను క్రిందకు దిగమని లోపలకు తీసుకువెళ్ళి, కళ్ళకు కట్టిన పట్టీలను విప్పి, బాస్ ఎదురుగా నిలబడ్డాడు గుల్‌షేర్.

బాస్ మొహం కనపడ్డంలేదు. నల్లటి ముసుగులో

వున్నాడు.

"మీ దగ్గిర హాషీస్ వుందా!" అతని మాటలలో హేళనవుంది. అతడు గొంతు మార్చి మాట్లాడుతున్నాడు.

"జీ! సాబ్!" అంటూ ముందుకు వంగి అభివాదం చేశాడు జావేద్.

బాస్ పకపకా నవ్వాడు. అతనితో పాటే, గ్రామంలో తన్నులు తిన్న పాక్ గూఢచారులు కూడా ఆ ప్రాంతం అదిరిపోయేలా నవ్వారు.

"ఛప్‌బే! నువ్వెవరవో తెలియదనుకున్నావా? మా వాళ్ళు నిన్ను చంపుదామనేసరికి ఆ ముసిలోడు ఉద్దీన్ గాడు రంగంలో దిగాడు. వాడిని చూసి మావాళ్ళు పారిపోయారు. మీరు బోర్డర్లో దచ్చిన అనామకులను తీసుకుని వచ్చి మొహాలు చెక్కేసి అక్కడపడేసి నాటకం ఆడారు.

ఆ దాదాగాడి తాలూకంటూ మీరు క్లబ్‌లో ప్రవేశించారు. పడమటినుండి ఎవరు వచ్చినా మాకు తెలియకుండా పోదు. కాబట్టి మీరు పాకిస్తాన్ నుండి రాలేదని గ్రహించాను. అదీ కాకుండా నువ్వు గుల్‌షేర్‌తో సరాసరి చేరానికి దిగేవని తెలిసి నేను మిమ్మల్ని అనుమానించాను. ఆ ఎద్దు మొహంగాడు కమీషన్‌కు ఆశపడి మిమ్మల్ని యిక్కడకు తెచ్చాడు" అంటూ తెరలు తెరలుగా నవ్వి "చూడు రమేష్! మీ గురించి నేను అంతా తెలుసుకున్నా, కానీ నీకు నా గురించి కొంచెం కూడా తెలియదు" అన్నాడు బాస్.

జావేద్ రూపంలో వున్న రమేష్ చిన్నగా నవ్వాడు. "నువ్వు నిజంగా గొప్పవాడివే వాలేబ్ ఖాన్! లేకపోతే అన్నిసార్లు ఈ గ్రామానికి నాయకుడివి ఎలా గవుతావు" అన్నాడు.

సర్పంచ్ వాలేబ్‌ఖాన్ తుళ్ళిపడ్డాడు. ముసుగును పీకేసి

చేతిలోనికి రివాల్వర్ తీసుకున్నాడు. "నీకు సహాయం చేసిన దాదాగాడిని చూడు!" అన్నాడు.

రమేష్ గది మూలకు చూశాడు. దాదాను కుర్చీకి దిగంబరంగా బంధించారు. అతని వంటినిండా రక్తపు చారికలు వున్నాయి. మొహం వ్రేలాడేసివుంది. ప్రాణం వుందో లేదో తెలియదు. రమేష్ గుండె కదిలిపోయింది. కోపంతో పిడికిళ్ళు బిగుసుకున్నాయి. పళ్ళు పటపటలాడాయి.

"రిలాక్స్ మై బాయ్! రిలాక్స్! చచ్చేటప్పుడయినా రిలాక్స్డ్‌గా చావు" అంటూ రివాల్వర్‌ను రమేష్ గుండెకు గురిపెట్టి ట్రిగర్ మీద వ్రేలును వుంచాడు.

ఒకటి....రెండు....మూడు క్షణాలు దొర్లిపోతున్నాయి ఖాన్ వ్రేలు ట్రిగర్ మీద బిగుసుకుంటోంది. మరోక్షణం.... రివాల్వర్ పేలటం - రమేష్ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోవటం....క్షణంలో నూరోవంతు....

అంతలో—ఎక్కడినుండో గన్ పేలింది. ఖాన్ చేతిలోని పిస్టల్ వదలేసి చేతిని పట్టుకున్నాడు బాధగా— గుమ్మంల్లోంచి బి.ఎస్.ఎఫ్ చీఫ్ పరియప్పన్ చిద్విలాసంగా నవ్వుతూ లోపలకువచ్చాడు. అతడి సిబ్బంది ఖాన్ మనుషుల్నందర్నీ బంధించారు.

"వెల్‌డన్ మిస్టర్ రమేష్! పెద్దమనుషుల్లా చెలామణీ అవుతున్నవాళ్ళని సాక్ష్యాలతో సహా పట్టుకున్నావ్. నువ్వు పంపుతున్న సిగ్నల్ ఆధారంగా సరయిన టయిమ్‌కు మేము యిక్కడకు రాగలిగాం!" అంటూ పరియప్పన్ చేతిని ముందుకు చాపాడు.

"థాంక్యూ సార్!" అంటూ రమేష్ అతని చేతిని అందుకున్నాడు. దీపపుకాంతిపడి అతని చేతికున్న వాచీ తళుక్కుమని మెరిసింది. □

అన్యాయ శాస్త్రము

వి. పద్మలత

అతని పేరు రథాంగపాణి. వయసు నలభయి ఐదు లోపుంటుంది. మా ఆఫీసుకి సిటీలోనే వున్న ఇంకో బ్రాంచి నుండి ట్రాన్స్‌ఫరయి వచ్చాడు. అతను వచ్చి రెండు రోజులయింది. మొట్టమొదటి రోజునే అతడు నన్నో ఆపదనుండి కాపాడాడు.

ఆరోజు నేను పరధ్యానంగా ఆఫీసు మెట్లు ఎక్కివస్తూ రెయిలింగుమీద చెయ్యి ఆనించి పక్కకి మలుపు తిరగ బోయేసరికి ఉన్నట్టుండి ఆ గోడ ధపేలున వూడి పడి పోయింది. కొద్దిగా వుంటే అక్కణ్ణించి పడి తల విర గ్గొట్టుకునేవాణ్ని. కానీ వెనకనుండి ఒక బలమయిన హస్తం నన్ను చప్పున ఆదుకుని యివతలకి లాగింది.

నేను షాక్ నుండి తేరుకుని వెనక్కి తిరిగిచూశాను.

బంగారం పోతపోసినట్లున్న ఆరడుగుల భారీ విగ్రహం, మెడలో ఆంజనేయస్వామి వున్న బంగారు గొలుసు, పంచె, లాల్చీ, కండువా, నుదుటన విభూతి బొట్టు చాలా గంభీరమయిన ఆకారం ఎదురుగా కనిపించింది.

కళ్ళు విప్పార్చి ఆయనవంక చూస్తూ,

"థేంక్సండి" అన్నాను, యింకేమీ అనటానికి మాటలు పెగలక.

ఆయన అందంగా చిరునవ్వు నవ్వి, "అంతా దైవ లీల" అని క్లుప్తంగా పలికి, చరచరా, మెట్లెక్కి లోపలికి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత రెండుగంటలసేపు మా ఆఫీసు సిబ్బందంతా రావటం, కూలిపోయిన ఆ రెయిలింగు గురించి చర్చించు కోవటం అంతా హడావిడి జరిగింది. అక్కడ యింకో గోడ కట్టేవరకూ ప్రమాదం మరెవరికీ జరక్కుండా వుండేందుకు ఆఫీసు ఆవరణలోనే వున్న పాత బల్ల చెక్క ఒకటి రెయిలింగు స్థానంలో ఏర్పాటు చేశాక, అంతా సీట్లలోకి వచ్చి కూర్చున్నాం.

నా ఎదుటి సీటులో కూర్చుని ఫైలు చూస్తూన్న ఆయన్ని చూసి ఆశ్చర్యపోయాను.

"చిక్కడపల్లి బ్రాంచి నుంచి కొత్తగా ఎవరో వస్తున్నా రన్నారు మీరేనా?" అన్నాను దగ్గరికెళ్ళి.

ఆయన తలెత్తిచూసి, నవ్వి, "అవును. నాపేరు రథాంగపాణి. మీపేరు?" అన్నాడు.

"మహేష్. మీకు మరోసారి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నానండి. పెద్ద ప్రమాదం నుండి కాపాడారు" అన్నాను ఆయన చెయ్యి పట్టుకుంటూ చొరవగా, ఆప్యాయతగా.

"ఇందాకే చెప్పాకదా బాబూ. నాదేం లేదు. అంతా దేవునిలీల. నువ్వు మెట్లెక్కుతున్నప్పుడే నాకు అనిపించింది ప్రమాదం సంభవించనున్నదని. అందుకే మెల్లగా వస్తున్నవాణ్ణల్లా నీ వెనుకే వేగంగా వచ్చాను. అంతా నీ అదృష్టం" అన్నాడు.

"నాకు ప్రమాదం వస్తుందని మీకు ముందే తెలిసిందా అదెలా?" అన్నాను ఆశ్చర్యపోతూ.

ఆయన దానికి జవాబు చెప్పకుండా నవ్వి వూరుకున్నాడు.

మా ఆఫీసు ఆవరణలో అందరూ చందాలువేసి కట్టించుకున్న చిన్న గుడి వుంది. విఘ్నేశ్వరుడిది. ప్రతిరోజూ ఉదయం ఆఫీసుకి రాగానే మావాళ్ళంతా ఆ గుడిలోకి వెళ్ళి తీర్థం తీసుకోందే యింకేపనీ మొదలెట్టరు. ఇది చాలా రోజుల్నించీ జరుగుతున్నదే.

రథాంగపాణిగారు వచ్చిన మరుసటి రోజు అందరితో పాటు ఆయన కూడా గుడిలోకి వెళ్ళాడు. విభూది బొట్టుపైన కుంకుమబొట్టు కూడా తోడయి ఆయన ముఖానికి మరింత తేజస్సు నిచ్చింది. సీటులో వచ్చి కూర్చుంటూ ఆయన నావంక వింతగా చూసి,

"మీరు రాలేదేం గుడికి?" అన్నాడు.

"నాకు దేవుడిపైన నమ్మకం లేదండి" అన్నాడు చాలా మామూలుగా.

ఆయన ముఖంలో విభ్రాంతి లాంటిది కనిపించింది.

"చాలా అపరాధకరమయిన భావన మీది" అన్నాడు కొద్దిగా హార్ష్‌గా.

"నా నమ్మకం నాది" అన్నాను నవ్వుతూ.

"భగవంతుతున్నాడు. అతీంద్రియ శక్తులున్నాయి. మన ఊహకందని ఎన్నో అద్భుతాలు ఈ సృష్టి అంతటా నిండివున్నాయి. చిన్నతనం. మీకిప్పుడు తెలియదు. తర్వాత భగవంతుని పైన మీకే గురి కుదురుతుంది" అన్నాడాయన నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

ఆయన పలుకుల్లో కత్తి మొనకుండే పదునుంది.

నేను వినయంగా "అవునండి....నాది చిన్నతనం. ఒప్పుకుంటున్నాను. మీరు పెద్దవారు. అందుకే నన్ను మీరు అని గౌరవించక్కరలేదు. నిన్న పిలిచినట్లుగానే ఏకవచనంలో పిలవండి" అన్నాను.

ఆయన ఒక్క క్షణం అదోలా చూసి అంతలోనే తన సహజమయిన చిరునవ్వు నవ్వి, "గట్టివాడివే పర్వా లేదు" అన్నాడు.

ఆ తర్వాత ఆయన నా వంక ప్రత్యేక శ్రద్ధతో, ఆసక్తితో చూస్తూండటం చాలాసార్లు గమనించాను.

నిన్న మొన్న రావటంవల్ల ఈయనకి నా గురించి యిలా కొత్తగా వుందిగానీ, మా ఆఫీసులో వాళ్ళు నా వైఖరితో ఎప్పుడో విసుగెత్తిపోయారు. దేవుడున్నాడని ఒప్పించాలనీ, నన్ను గుళ్ళోకి తీసుకెళ్ళాలని ఎందరో

ఎన్నోవిధాల ప్రయత్నించారు. మా ఆవిడకి జ్వరం వచ్చి రెండు రోజులు మంచం ఎక్కినా, మా చంటాడికి అన్నం అరక్క రెండు వాంతులయినా కూడా అవన్నీ నా నాస్తికత్వంవల్లే జరుగుతున్నాయన్నట్టుగా అందరూ భావించేవారు.

జాతకాలు చూపించుకోటాలు, చిలక జోస్యాలు, హస్తసాముద్రికాలు, ప్రశ్నలడగటాలు యివన్నీ చూస్తుంటే నాకు ఒళ్ళు మండిపోతూ వుంటుంది.

బయట ఆకలికి అంగలార్చుకుపోతూ ముష్టివాళ్ళు "అమ్మా బాబూ" అని వెంటబడుతుంటే వాళ్ళకి పైసా కూడా విదిలించకుండా చీదరించుకుని, గుళ్ళోకెళ్ళి ఆ రాతి బొమ్మకి మాత్రం వేలకి వేలు సమర్పించుకునే ఎందరో మహానుభావులు! తోటి మనిషి ఛస్తున్నా పట్టించుకోరు గానీ దేవుడి పేరు చెబితే మాత్రం కనకాభిషేకాలు! పూజలు! వ్రతాలు! మానవత్వం కన్నా దైవత్వంమీద అత్యంత శ్రద్ధాసక్తులు! ఏళ్ళతరబడి అహోరాత్రాలు శ్రమించి కనిపెట్టిన శాస్త్రజ్ఞుల కృషిఫలితం మీదకన్నా, పిడకలు కాలిస్తే వచ్చే కచ్చికల బూడిద మీద నమ్మకాలు! ఛీఛీ ఏం ప్రపంచం మనది!

అసలయిన నిజమయిన భక్తుల మీద నా కెప్పుడూ చిన్న చూపు లేదు. వాళ్ళని నే నెప్పుడూ విమర్శించను. ఎందుకంటే నా భావాలు నా కులాగే వాళ్ళ భావాలు వాళ్ళకలాగ. మంచో చెడో ఏదో ఒక నమ్మకానికి హిపోక్రసీ లేకుండా కట్టుబడి వుండటం అనేది ఎప్పుడూ గొప్ప సంగతే. ఇకపోతే అటూ యిటూ కానీ భక్తపరమాణువు లతోనే వస్తుంది చిక్కంతా.

ఇలాంటివాళ్ళు దేవుడంటే మాకెంతో నమ్మకం వుందన్నట్టు ప్రవర్తిస్తారు. కానీ ఏదయినా అనుకున్నది జరక్కపోతే ఏడుస్తూ "ఛీ ఛీ దేవుడు లేడు" అని ఆర్త నాదాలు చేస్తారు. మళ్ళీ అంతలోనే దేవుడికి ఎక్కడ కోపం వస్తుందో అన్నట్టు "తప్పయింది క్షమించుతండ్రీ" అని వేడికోళ్లు.

ఏమిటిదంతా? వీళ్ళ కసలు భక్తికన్నా దేవుడిపయిన భయమే ఎక్కువ. ఎప్పుడూ ఎవరో ఒక దేవుడికి భయ పడుతూ బ్రతకటమే. ఇలాంటివాళ్ళని చూస్తే నాకు జాలి. వాళ్ళకి నన్ను చూస్తే జాలి.

ఎప్పుడో నాకేవో మహా ప్రమాదాలు చుట్టుముట్టినప్పుడు దిక్కు తోచక అల్లాడిపోతున్నప్పుడు, అప్పుడుగానీ నాకు నాస్తికత్వం నశించదని, దివ్యజ్ఞాన కాంతులు నాలో వెలు గొందవనీ, ఆరోజు తప్పక వస్తుందనీ వాళ్ళ విశ్వాసం.

2

రథాంగపాణిగారి మీద నాకు కొద్ది రోజుల్లోనే మంచి అభిప్రాయం ఏర్పడింది. ఆయన మితభాషి. తన పనేదో తను చూసుకునే రకం. వర్కులో సిన్సియర్. ఆయన నాకు నచ్చాడు.

దానికి తోడు గంభీరంగా, హుందాగా వుండే చక్కటి పర్సనాలిటీ ఆయన మీద అభిమానాన్ని పెంపొందింప జేసేదిగా వుంటుంది.

రథాంగపాణిగారి యిల్లు నారాయణగూడాలో వుందనీ, ఆయనకు నలుగురు సంతానమనీ, ఆయన ఆంజనేయో పాసకుడనీ మాత్రమే వివరాలు తెలుసు నాకు. కానీ మా ఆఫీసులోవాళ్ళు యింకా బోలెడన్ని వివరాలు సేకరిం

చారు.

నాకు వినటానికి యింట్రస్టు వుండదని తెలిసినా నా కొలీగ్ ఆ సేకరణ ఫలితాన్ని నాకు చెప్పాడు.

"రథాంగపాణిగారికి గొప్ప అతీంద్రియ శక్తులున్నా యిట గురూ! భవిష్యత్తులో జరగబోయేవి కొన్ని కళ్ళకు కట్టినట్టు ఆయనకు ముందే కనపడతాయట. ఇన్ని గొప్ప శక్తులున్నా ఆయన పైకి ఏమీ తేలడు చూశావా! ఆయన కోసం వచ్చిన ఒకతనివల్ల తెలిశాయి ఈ విశేషాలన్నీ. అన్నట్టు ఆ రోజు నువ్వు రెయిలింగు కూలి పడబోతే ఆయన కాపాడాడు చూడు. ఆ విషయం ఆయనకు ముందే తెలుసుట. అందుకే త్వర త్వరగా మెట్లెక్కి నిన్ను రక్షించాడు. ఇప్పటికయినా నమ్ముతావా యిలాంటి అద్భుతా లుంటాయని?"

"అద్భుతాల మాటెలా వున్నా నీలాంటి మనుషులు వున్నంతవరకు మన ఆఫీసు, ఈ దేశం బాగుపడదని మాత్రం ఖచ్చితంగా నమ్ముతాను" అన్నాను. వాడు మొహం మాడ్చుకుని వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత మావాళ్ళు చాలామంది తమ తమ జాతక చక్రాలు చూడమని ఆయన చుట్టూ మూగి వేధించటం, చేతులు చూడమని కోరటం, తమ భవిష్యత్తు చెప్పమని పీడించటం యివన్నీ చూస్తూనే వున్నాను నేను. కానీ ఆయన మాత్రం వీళ్ళందర్నీ మర్యాదగానే తిరస్కరించి, ఒకళ్ళిద్దరికి మాత్రం కొంచెం ప్రత్యేక శ్రద్ధతో జాతకాలు పరిశీలించటం, చేతులు చూడటం లాంటివి చేశాడు. అందుకు ఆ ఒకళ్ళిద్దరూ సంతోషంతో ఉప్పొంగి పోయారు.

మిగిలినవాళ్ళు కూడా తమపైన ఆయన కరుణాకటాక్ష

వీక్షణాలు ఎప్పటికయినా ప్రసరింపకపోతాయా అన్న ఆశతో పాపం రోజూ ఎదురు చూస్తూనేవున్నారు. మొత్తానికి రథాంగపాణిగారు మా బ్రాంచికి వచ్చిన పది పదిహేను రోజుల్లోనే చాలా పాపులర్ అయిపోయాడు.

ఒకరోజు ఆఫీసు అయిపోయాక నేను బయటకొచ్చి స్కూటర్ తీస్తుండగా, ఆయన నా వెనకేవచ్చి,

"మహేష్! నా వెహికల్ పాడయి ఈ రోజు తీసుకు రాలేదు. ఏమీ అనుకోక మా యింటిదాకా లిఫ్టు యివ్వగలవా?" అని అడిగాడు.

"తప్పకుండా రండిసార్!" అన్నాను ఆదరంగా.

నారాయణగూడాలో ఆయన ఇంటిముందు స్కూటర్ ఆగగానే ఆయన దిగి, "చాలా థెంక్స్, ఓసారి లోపలికి రా. కాఫీ తీసుకుని వెళుదువుగాని" అన్నాడు.

"అబ్బే వద్దండీ నేను కాఫీ తాగను" అన్నాను వెళ్ళిపోవటానికి రెడీ అవుతూ.

"పోనీలే. నీతో మాట్లాడాల్సింది కొంతవుంది. అందుకోసమయినా నువ్వు లోపలికి రాక తప్పదు" అన్నాడు.

నేను ఆశ్చర్యపడుతూ ఆయనవెంట లోపలికి నడిచాను.

ఆయన యింటి వాతావరణం కూడా ఆయనలాగే గంభీరంగావుంది. భార్యా పిల్లలూ ఎక్కడికో వెళ్ళినట్టున్నారు. ఇల్లంతా ప్రశాంతంగావుంది. ముందుగదిలో గోడలమీద గజం కూడా ఖాళీ లేకుండా అన్నీ దేవుడి పటాలు.

అవన్నీ పరిశీలనగా చూస్తూ కూర్చున్నాను కాసేపు. ఇంతలో ఆయన లోపల్నుంచి ఒక గ్లాసుతో నిమ్మకాయ షర్బత్ తీసుకొచ్చాడు. అది తాగి గ్లాసు కిందపెట్టి

"ఏమిటి సార్ నాతో మాట్లాడాల్సింది?" అనడిగాను.

"నీకు బ్యాంకులో ఎంత డబ్బుంది ప్రస్తుతం?" హఠాత్తుగా అడిగాడు.

నేను తెల్లబోయి, "ఎందుకండీ? ఓ రెండొందలుంటుందేమో" అన్నాను.

ఆయన ఒక్కక్షణం మౌనంగావుండి ఎందుకో నిట్టూర్చి,

"అవునులే నేనూహించినదే నిజం. సర్వీసులో చేరి ఎక్కువకాలం అయినట్టులేదు. ఎకౌంటులో వేలకు వేలు ఎలా వుంటాయి? వుండు యిప్పుడే వస్తాను" అని లోపలికి వెళ్ళి ఐదు నిముషాల్లో బయటకు వచ్చాడు. ఆయన చేతిలో ఒక బరువైన నోట్లకట్ట!

దాన్ని నా ముందున్న టేబిల్ మీద పడేస్తూ,

"ఇది ఐదు వేలు! తీసుకెళ్ళు! నీ అవసరానికి పనికొస్తుంది" అన్నాడు.

నేను నిర్ఘాంతపోయి, "ఇదేమిటండీ? ఇంత డబ్బిస్తున్నారేమిటి? అయినా నాకేం అవసరం వస్తుంది?" అన్నాను అయోమయంగా.

విశాలంగా వున్న ఆయన ఫాలభాగంలో రెండు ముడతలు అలవోకగా కలుసుకున్నాయి. ఒక్కక్షణం కళ్ళు మూసుకుని తెరిచి,

"మహేష్! నువ్వు నా మిత్రుడివి! నా మాటలు నీకు హాస్యాస్పదంగా వుంటాయని తెలుసు. కానీ నిజం చెబుతున్నాను. నెలరోజుల లోపు నీ కుటుంబంలో ఘోర ప్రమాదం ఒకటి జరగనున్నది. దాని కోసం ఐదువేల దాకా నీకు అప్పటికప్పుడు అవసరం అవుతుంది. మామూలు ఉద్యోగివి, ఉన్నట్టుండి అంత డబ్బు నువ్వు తేలేవు. ఆ పరిస్థితిలో ఒక్కరూపాయి కూడా నీ కెవ్వరూ

ఇవ్వరు. ఇదంతా నా దృష్టికి స్పష్టంగా గోచరిస్తూంది. అందుకే యిస్తున్నాను యీ ఐదువేలు తీసుకెళ్ళు. ఈ అనుభవం వల్లనయినా నీ నాస్తికత్వం నశిస్తే నేను ఎంతో సంతోషిస్తాను" అన్నాడు.

నేను వ్యంగ్యంగా నవ్వి "బాగుందిసార్! ఇంటికి పిల్చి యింతా చేస్తే ఈ కాకమ్మకథా మీరు చెప్పేది?"అన్నాను.

ఆయన కళ్ళల్లో ప్రశాంతత ఏ మాత్రం తగ్గలేదు. పసిపిల్లాడికేసి చూసినట్టు నాకేసి చూసి:

"వితండవాదం పెట్టుకోకు మహేష్! కనీసం అతీంద్రియ శక్తులు లేవని ఋజువు చేయటానికయినా నువ్వు దీనికి ఒప్పుకోవచ్చుగా!" అన్నాడు.

నేను ఒక్క క్షణం సాలోచనగా చూసి,

"సరే. ఋజువులు, పందేలు అంటున్నారు కాబట్టి నేను దీన్నో ఛాలెంజ్‌గా తీసుకుంటాను. ఇంతకీ మీరనేదేమిటి? నెలరోజులలోపు నాకేదో ఆపద వస్తుందని మీరిచ్చిన ఈ డబ్బు తప్ప అప్పుడు నాకు యింకో దిక్కుండదనీ దీన్ని ఖర్చుచేసి ప్రమాదం తప్పించుకుంటాననీ అంటున్నారు. అంతేగా?

అయితే వినండి. సరిగ్గా నెలరోజుల తర్వాత మీరిచ్చిన ఈ కట్ట కట్ట యిలాగే మళ్ళీ మీకిస్తాను. ఇందులో ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయను. ఈలోపు ఏమయినా ఆపదలు వచ్చినా అవి యాదృచ్ఛికమేగానీ మీరన్నట్టు విధి లీలలని నేనెన్నడూ నమ్మబోను. ఆ ఆపద సమయాల్లో తల తాకట్టు పెట్టయినా యింకెక్కణ్నించయినా డబ్బు తెచ్చుకుంటాను గానీ మీరు దయతో యిచ్చిన ఈ డబ్బు మాత్రం ససేమిరా ముట్టుకోను.

సరేనా?" పట్టుదలగా అన్నాను.

రథాంగపాణి నవ్వి, "మంచిదే అదీ చూద్దాం. ఎందు కయినా మంచిదని నేను నీ కిచ్చిన నోట్ల నెంబర్లన్నీ నోట్ చేశాను. ఈ డబ్బు వాడుకుని ఆ తర్వాత నువ్వు ఏమీ తెలియనట్టు వేరే డబ్బు తెచ్చిస్తే నాకు తెలిసి పోతుంది" అన్నాడు.

"మోసాన్ని, మాయని ఛేదించటమే నా నాస్తికత్వపు ఉద్దేశ్యం. అలాంటిది నేనే మోసం చేస్తానని మీరను కోవటం నాకు చాలా అవమానంగా వుంది. ఎనీ వే, థేంక్ యూ! మళ్ళీ నెలతర్వాత మీయింటికి వస్తాను యిదే డబ్బుతో. అందాకా మన పందెం గురించి మీ రెవరి తోనూ అనకండి. వాళ్ళకి లేని పోని కుతూహలాలు రేకెత్తించటం నా కిష్టంలేదు" అని బయటకు నడిచాను.

3

పందెం అన్నా, పరీక్ష అన్నా మొదట్నించీ నాకు పట్టు దల ఎక్కువ. వాటిని ఆషామాషీగా కాక, చాలా తీవ్రంగా తీసుకుంటాను. ఇప్పుడొచ్చిన పరీక్ష నా నాస్తికత్వానికి. దీంట్లో నేను గెలిచి తీరాలి. ఇంటికి రాగానే మా ఆవిడకి నోట్ల కట్ట చూపించి,

"చూడు ఇది ఆఫీసు డబ్బు. లాకర్‌లో పెడుతున్నాను. ఎటి పరిస్థితుల్లోనూ నువ్వు దీంట్లోంచి వాడటానికి వీల్లేదు జాగ్రత్త" అని హెచ్చరించాను.

ఆమె సాధారణంగా ఎన్నడూ నామాట జవదాటదు. సరేనన్నట్టు తలూపింది.

ఆరాత్రి భోంచేశాకా మంచంమీద పడుకుని, మా యింట్లోవాళ్ళకి రాబోయే ప్రమాదాలు సామాన్యంగా ఎటు వంటివయి వుంటాయో మనసులోనే ఓ లిస్టు తయారు

చేసుకున్నాను.

మా ఆవిడ తరపునుంచయితే; గాస్ స్టవ్ అంటు కోవటం, నీళ్ళు తెస్తుంటే కాలుజారి పడటం, లేదా నీళ్ళు తోడుతుంటే నూతిలో పడటం యిలాంటివి.

ఇక మా అబ్బాయి తరఫునుంచయితే; బడి కెళ్ళి వస్తుంటే ఎవరయినా కిడ్నాప్ చేయటం, లేదా యాక్సిడెం టవ్వటం. ఉన్నట్టుండి హైఫీవర్ రావటం యిలాంటివి.

ఇక నేను స్కూటర్ యాక్సిడెంటు, హఠాత్తుగా రోడ్డుమీద కళ్ళు తిరిగి పడిపోవటం, ఏమయినా ప్రయా ణాలు తగిలి, మధ్యలో ప్రమాదాలు రావటం! లేదా సిటీలో ఏ మతకలహాలో జరిగి హఠాత్తుగా ఏ గొడవలో చెలరేగి ఎవరయినా కత్తితో పొడిచినా పొడవచ్చు,

ఇవన్నీ ఆలోచించుకున్న మీదట వీ టన్నిటికి రెమిడీస్ ఏమిటో కూడా లిస్టు తయారు చేసుకున్నాను.

మా ఆవిడ విషయంలోను మా అబ్బాయి విషయం లోను, నా విషయంలోను అన్నీ కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేసేసాను. ఒకవేళ హఠాత్తుగా ఏదయినా ప్రమాదం జరిగి డబ్బవసరం వస్తేగనుక పనికొస్తుందని, మా ఆవిడ గొలుసు తాకట్టుపెట్టి కొంత డబ్బు తీసుకొచ్చి దాచాను.

ఇవన్నీ నేను చేస్తున్నది రథాంగపాణి చెప్పింది జరుగుతుందేమోనన్న భయంతో కాదు. యాదృచ్ఛికంగా జరిగే వాటికోసం ముందే జాగ్రత్తపడటంకోసం, రథాంగ పాణి డబ్బు వాడుకునే పరిస్థితి తెచ్చుకోకుండా వుండటం కోసమూనూ.

రోజులు గడుస్తున్నాయి. రథాంగపాణి రోజూ ఆఫీ సులో నావైపు చిరునవ్వుతో చూసి 'అంతా ఓకేనా?' అన్నట్లు కళ్లెగరేస్తున్నాడు. నేను రెట్టింపు చిరునవ్వుతో

జవా బిస్తున్నాను. ఆయన మొహంలో తన జోస్యం తప్పుతుందేమోనన్న కలవరం మాత్రం యిసుమంత కూడా కనిపించటం లేదు.

ఒకరోజు తెల్లవారగట్ల పని మనిషి "అమ్మా తలుపు" అని తలుపు బాదగానే మాకు మెలుకువ వచ్చింది. మామూలుగా అయితే మా ఆవిడే లేచి తలుపు తీస్తుంది. కానీ అప్పుడు ఎందుకో బద్ధకించి, "ఏమండీ కాస్త లేచి తలుపు తీయకూడదూ" అంది.

నేను లేచి వంటగదిలోకి వెళ్ళి లైటు వేయబోతూ చటుక్కున ఆగిపోయాను. గ్యాస్ వాసన! అవును. గ్యాస్ లీక్ అవుతోంది.

నేను చప్పున కిటికీ రెక్కలు, వంటింటి తలుపు బార్లా తెరిచేశాను. మా ఆవిణ్ణికూడా లేపి మొత్తం యింటి తలుపులన్నీ తీసాను. పనిమనిషి చోద్యంగా చూస్తూ నుంచుంది.

క్షణంలో ప్రమాదం తప్పింది! లేకపోతే నేను లైటు వేసేసివుంటే ఏమయ్యేది? రాత్రినుంచీ లీక్ అవుతున్న గ్యాస్ ఏమాత్రం కరంట్ స్పార్క్ తగిలినా ఇల్లంతా మంటలతో....సిలిండర్ పేలిపోయి....

మా ఆవిడ నాకేసి భయంగా చూస్తూ "రాత్రి పాలు కాచినప్పుడు పొంగిపోయి ఆరిపోయినట్టుందండీ చూసుకో లేదు" అంది.

"ఇంకా నయం. రోజూలాగా నువ్వే లేచివుంటే తెలివి తక్కువగా వెంటనే లైటువేసేసి వుండేదానివి. పోనీలే అదృష్టం బాగుంది" అన్నాను.

ఎప్పుడూ 'అదృష్టం' 'దురదృష్టం' అనే మాటలు వాడని నేను అలా అనేసరికి అంత టెన్షన్‌లోనూ ఆమె

నావైపు విచిత్రంగా చూసింది.

ఆరోజునుంచీ గ్యాస్ సిలిండర్, స్టవ్ గురించి బాగా జాగ్రత్తలు వహిస్తున్నాము. మరో రోజు నేను ఆఫీసు నుంచి యింటికొచ్చేసరికి మా ఆవిడ మంచంమీద పడుకున్న మా అబ్బాయి పక్కన కూర్చుని ఏడుస్తూంది. వాడు "అమ్మో... అమ్మో" అంటూ కడుపు పట్టుకుని మూలుగుతున్నాడు.

ఎప్పుడూ చూసే మా ఫ్యామిలీ డాక్టరు రెండు రోజుల్నుండీ వూళ్ళో లేడట. అందుకే ఏం చెయ్యాలో తోచక మా ఆవిడ ఏడుస్తూ కూర్చుంది.

నేను వెంటనే నాలుగు చీవాట్లుపెట్టి చప్పున పిల్లాణ్ని ఆటోలో వేసుకుని, హాస్పటల్ కి తీసుకుపోయాను.

అపెండి సైటిస్ట! వెంటనే ఆపరేషనన్నారు. మా ఆవిడ గొలుసు తాకట్టు తాలూకు డబ్బు తీసికొచ్చి వాడి ప్రాణాలు కాపాడుకున్నాను.

ఆ తర్వాత రెండు మూడు రోజులు నాకు మనశ్శాంతి లేదు. రథాంగపాణి మాటలు పదే పదే మనసులో మెదులుతున్నాయి.

ఇంకా ఏం రానున్నాయి ముందు ముందు ప్రమాదాలు? ఇదివరకులేని టెన్షనేదో కొత్తగా ప్రవేశించింది నాలో.

4

ఆపరేషనయి యింటికి తీసుకొచ్చాక యిదివరకులా తిట్టకుండా కొట్టకుండా కొంచెం గారాబం చెయ్యటంతో మా అబ్బాయి పేట్రేగిపోయి, యిదివరకు మేము తీర్చని కోరికలన్ని యిప్పుడు తీర్చమని పేచీలు మొదలెట్టాడు. అందులో ముఖ్యమయిన కోరిక మూడు చక్రాల సైకిలు.

"ఇప్పుడు డబ్బులేదు. తర్వాత కొంటాలేరా" అన్నాను.

"అన్నీ అబద్ధాలే. బీరువాలో లాకర్‌లో పెట్టావుగా బోలెడంత డబ్బు ఆరోజు నేను చూశాలే" అన్నాడు.

నేను ఉలిక్కిపడి, "నోర్ముయ్! ఆ డబ్బు మనది కాదు. దాన్ని ముట్టుకుంటే కాళ్ళు విరగ్గొడతాను జాగ్రత్త" అన్నాను.

కానీ అనుకున్నంతా అయింది. ఎలా సంపాదించాడో, వెధవ లాకరు తాళాలు సంపాదించి ఒకరోజు రథాంగ పాణి డబ్బులోంచి రెండు వందల కాగితాలు బయటకు తీసాడు. అనుకోకుండా అది నాకంట పడగానే, భయపడి పోయి, "ఊరికే తీశాను నాన్నా" అని బెరుకు బెరుగ్గా వెనక్కి వెనక్కి నడిచి, కాలు స్లిప్పయి కిందపడ్డాడు. వాడి చేతిలోవున్న కాగితాలు ఎగిరి పక్కనేవున్న నీళ్ళ తొట్టెలో పడిపోయాయి.

నేను ఆత్రుతగా ఆ కాగితాలు బైటకు తీసి వెంటనే వాటిని ఎండలో పెట్టి, క్రిందపడ్డ మావాణ్ణి లేపి కసితీరా ఎడా పెడా రెండు అంటించాను. వాడు ఏడుస్తూ వాళ్ళ అమ్మ దగ్గరికి వెళ్లాడు.

నేను ఎండలో ఆ కాగితాల దగ్గరే కూర్చుని అవి చప్పున ఎండేలా ప్రయత్నించ సాగాను.

చాలా విచిత్రమయిన దృశ్యం ఒకటి గమనించాను. ఆ సందర్భంలో వంద నోట్లు ఎండుతున్నకొద్ది వాటి ల్లోంచి ఒక విధమయిన తెల్లటిపొడి నేలమీద రాలు తోంది. రెండు నోట్లలోంచి రాలిన పొడి ఓ రెండు చెంచాలనిండా వస్తుంది.

నా మనసులో ఏదో అపశృతి, అనుమానం కద లాడాయి.

వెంటనే లేచి లాకరులోంచి మిగతా డబ్బు కూడా తీసుకొచ్చి మరికొన్ని నోట్లు తడిపి ఎండబెట్టి చూశాను. వాటిల్లోంచి కూడా అలాంటి పొడే రాలింది!

నా అనుమానం దృఢమయింది. ఇది మామూలు విషయం కాదు. దీనికి సమాధానం చెప్పగలిగినవాడు నా స్నేహితుడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ వున్నాడు. ఇప్పుడు అతని దగ్గరకు వెళ్ళటం అత్యవసరం.

5

కృష్ణమోహన్, నేను చాలా తెలివిగా నాటకీయంగా ప్రవర్తించటంవల్ల రథాంగపాణిని సాక్ష్యాధారాలతో సహా అరెస్టు చేయటం ఏమంత కష్టం కాలేదు.

రథాంగపాణి దగ్గర దొరికిన మరికొన్ని బలమయిన ఆధారాలవల్ల దీనికంతటికీ మూలకారణం అయిన ఆయన సహచరుడు: చాలా రోజుల్నుండీ పోలీసుల దృష్టిలో అనుమానాస్పదుడుగా వున్న వెంకటనాయుడు కూడా అరెస్టయ్యాడు.

రథాంగపాణి పోలీసులకి ఇలా స్టేట్‌మెంట్ ఇచ్చాడు:

"వెంకటనాయుడు చేసేది దొంగ వ్యాపారం, అవినీతి పనులు అని తెలిసికూడా డబ్బాశతో వాడితో చేతులు కలిపాను. అయితే నాది ఉడత సహాయంలాంటిది మాత్రమే. వాడికి యింకా పెద్ద పెద్ద వ్యవహారాలు, అనుచరులు వున్నారు.

హిరాయిన్, గంజాయి లాంటి వాటికన్నా పవర్‌ఫుల్ మత్తుమందు ఈమధ్య విదేశాల్లో కొత్తగా సృష్టించబడింది. దాన్ని మన దేశానికి చేరెయ్యటానికి స్మగ్లర్లు ఎన్నో అతి తెలివితేటలు ప్రదర్శించారు. వాటిలో ఈ నోట్ల పథకం ఒకటి. ఆ పదార్థాన్ని ద్రవరూపంగా మార్చి నోట్లకి

రాసేస్తే ఏమీ తెలియదు. తిరిగి దాన్ని పదార్థంగా మార్చు కోవాలంటే ఆ నోట్లని తడిపి, ఎండబెట్టాలి.

ఈ కొత్త పథకం గురించి తెలుసుకున్న వెంకట నాయుడు ఐదువేల రూపాయల రూపంలో ఆ మందుని మనదేశానికి తెప్పించాడు. అయితే ఈ మధ్య యిలాంటి పథకాలకి కూడా క్రైమ్ డిపార్టుమెంటువారు విరుగుళ్ళు కనిపెట్టటంతో వాడు భయపడి కొన్నాళ్ళు ఆ డబ్బు నా దగ్గరుంచమని యిచ్చాడు.

కానీ సి.ఐ.డి. ల అనుమాన దృక్కులు నామీదకూడా ప్రసరించాయని చూచాయగా తెలుసుకుని ఒణికిపోయాను. ఆ డబ్బుని నా దగ్గర్నుంచి కూడా కొన్నాళ్ళు వదిలించుకోవా లనుకున్నాను. మహేష్ అందుకు అనుకూలుడుగా కన పడ్డాడు. అతని వాస్తవిక వాదాన్ని రెచ్చగొట్టి డబ్బు అత నికి అప్పగించాను. ఇంకెవరికి యిచ్చినా దాన్ని వాళ్ళు వాడుకునే ప్రమాదం వుందికదా. అందుకే మహేష్ని చాలా రోజులు గమనించిన మీదటే కావాలని అతన్నే ఈ పనికి ఎన్నుకున్నాను.

కానీ నా పథకం బెడిసికొట్టింది. నేను అవటానికి నిజం గానే దైవభక్తుణ్ణి. కానీ నా కేమీ శక్తులు లేవు. కేవలం ధనవంతుణ్ణవ్వాలన్న ఆశ తప్ప."

రథాంగపాణి నిజస్వరూపం బయటపడిన తర్వాత నాకు యిదివరకటి నమ్మకాలు కొన్ని మారాయి. దైవం మీద నమ్మకం మాట ఎలా వున్నా అతీంద్రియశక్తులమీద మాత్రం నాకు బాగా నమ్మకం ఏర్పడింది.

ఆ అతీంద్రియ శక్తు లేమిటో తెలుసా? దురాశ, దుర్మార్గం? అవి మనిషిని ఎంతకయినా దిగజార్చగలవు! కదూ?

□

బ్యాంకు దోపిడీ

సుంకరి రాంప్రసాద్

నిశ్శబ్దం!

సూది క్రింద పడితే చాలు ఖంగుమనేంతటి నిశ్శబ్దం ఆ గదినిండా అలుముకొని ఉంది.

ఒక్కసారి తన అనుచరుల వంక సాలోచనగా చూసి, చిన్నగా గొంతు సవరించుకున్నాడు జోగిందర్.

ఆ గదిలో కూర్చున్న అతడి ఎనిమిదిమంది అనుచరులూ ఊపిరి బిగబట్టి మరీ తమ బాస్ ఏం చెబుతాడా అని ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

"డియర్ ఫ్రెండ్స్!

"ఈ రోజుకు సరిగ్గా మూడవరోజున అంటే ఈ నెల 31 వ తేదీన చండీగఢ్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంకును మనం దోచుకోబోతున్నాం."

ఆ గదిలోని వారంతా ఒక్కసారిగా అతనివంక నమ్మ లేనట్లుగా చూసారు.

జోగిందర్ చిన్నగా నవ్వేడు.

"నిజం....ఫ్రెండ్స్!

సరిగ్గా 31 వ తేదీన ఈ దోపిడీ జరగబోతూంది. ఈ దోపిడీకి ముహూర్తం సరిగ్గా ఆ రోజునే ఎందుకు నిశ్చ యించానా అని మీకు అనుమానం రావచ్చు.

చెబుతాను.

చండీగఢ్‌లోని ఆయిదు పెద్ద పరిశ్రమలు తమ కార్మికు లకు వేతనాలు చెల్లించడానికి ఆరోజే కాష్‌ను విత్‌డ్రా చేస్తుంటాయి. ప్రతినెలా సరిగ్గా చివరి తేదీన అన్నమాట.

ఒక్కొక్క పరిశ్రమ విత్‌డ్రా చేసే మొత్తం....సుమా రుగా ఎనభై లక్షలు అనుకుంటే, అయిదు పరిశ్రమలు కలిసి. ఆ ఒక్కరోజు బ్యాంకునుండి విత్‌డ్రా చేసే మొత్తం నాలుగు కోట్లు.

ఫోర్ క్రోర్స్ ఎట్ ఎ టైమ్!

ఈ నాలుగు కోట్ల రూపాయలు కూడా డిఫరెంట్ డినా మినేషన్స్‌తో విత్‌డ్రా చేయబడతాయి. అంటే నూర్లు, ఏభయిలూ, ఇరవైలూ, పదులూ. అయిదులూ, రెండ్లు, ఆఖరిరికి ఒకట్లుకూడా.

అంటే....ఇన్నివేల చిల్లర నోట్లయొక్క నెంబర్లను బ్యాంక్ నోట్ చేసుకోదన్న మాట!

సో! దోపిడీ చేయబడే నోట్ల నెంబర్లను బ్యాంకుకూడా చెప్పలేని, నాలుగు కోట్ల రూపాయల మొత్తాన్ని ఒకేసారి దోచుకొనే గొప్ప అవకాశాన్ని పంజాబ్ నేషనల్ బ్యాంక్ మనకు కల్పిస్తూంది.

యూ నో!

ఆ నోట్ల నెంబర్లు ఎక్కడా నోట్ చేయబడి ఉండవు కాబట్టి, మనం వాటిని స్వేచ్ఛగా, నిర్భయంగా పబ్లిక్‌గా చెలామణి చేయవచ్చు."

"కానీ....బాస్!"

ఒక అనుచరుడు మెల్లగా లేచి నిలబడ్డాడు.

"చండీగఢ్‌లో దోపిడీ అంటే....యింకోసారి ఆలోచిస్తే మంచిదేమో?

చండీగఢ్ అసలే కల్లోలిత ప్రాంతంగా డిక్లేర్ చేయబడింది. ఓ వంక టెర్రరిస్ట్‌లను ఏరి వేయడానికి, పోలీసులూ, సి.ఐ.డి.లూ నగరమంతా ఉచ్చులు బిగించి సిద్ధంగా ఉన్నారు.

వీరందరి కళ్ళు కప్పి, మనం ఈ దోపిడీ చేయాలంటే...."

"కష్టమే ఫ్రెండ్! కాని. అసాధ్య మేమీ కాదు."

తన అనుచరుడి మాటలను మధ్యలోనే కట్‌చేస్తూ అన్నాడు జోగిందర్.

"పోలీసుల దృష్టంతా టెర్రరిస్టులపయినే ఉంటుంది. ఈ దోపిడీని మనం మన ప్లాన్ ప్రకారం పూర్తిచేయగలిగితే ఈ దోపిడీని చేసింది టెర్రరిస్ట్‌లే అనుకుంటారు తప్ప, పోలీసులు మనల్ని అనుమానించరు.

అది మనకు ఎడ్వాంటేజ్ కదా?

ఇక....

టెర్రరిస్టులను అణచడానికి, పోలీసులు ఏ ప్రత్యేక మైన జాగ్రత్తలు తీసుకుంటున్నారో, వాటినే అవకాశంగా తీసుకొని మనం ఈ దోపిడీ చేయబోతున్నాం!"

"ఎలా....?" ఆత్రంగా అడిగాడొక అనుచరుడు.

"ఇలా...." అంటూ లో గొంతుతో తన ప్లాన్‌ను వివరించసాగాడు జోగిందర్.

2

"నమస్తే!"

చొరవగా తలుపు తోసుకుంటూ డ్రాయింగ్ రూమ్ లోనికి ప్రవేశించిన ఆ అపరిచితుని వంక చిరాకుగా చూసాడు బసంత్ కుమార్.

అతడు నిదానంగా నడుచుకుంటూ వచ్చి బసంత్ కుమార్ ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు.

తన అనుమతి లేకుండా తన గదిలోనికి వచ్చి కనీసం తను సీటైనా ఆఫర్ చేయకుండానే చొరవగా తన ఎదురుగా తన సోఫాలో కాలుమీద కాలు వేసుకొని విలాసంగా కూర్చున్న అతన్ని చూసేసరికి అరికాలి మంట నెత్తి కెక్కింది బసంత్‌కుమార్‌కు.

"ఎవరు నీవు?"

పట్టలేని కోపంతో గుర్రుగా చూస్తూ అడిగాడు బసంత్ కుమార్.

చిన్నగా నవ్వాడతడు.

"మీతో రెండు నిముషాలు ఏకాంతంగా మాట్లాడాలి బసంత్‌కుమార్ జీ...."

"ముక్కూ, ముఖమూ తెలియని నీతో నాకు ఏకాం

తమూ, రహస్యాలేమిటి మిస్టర్!

ఇంతకూ ఎవరు నీవు?"

కటువుగా అన్నాడు బసంత్‌కుమార్.

మరోసారి చిన్నగా నవ్వా డతడు.

"నా మాటకేం బసంత్‌కుమార్‌జీ! మీ అమ్మాయి రూప...." అంటూ అర్ధోక్తిలో ఆపి బసంత్‌కుమార్ వంక ఓరగా చూసాడతడు.

రూప పేరు వినిపించేసరికి నిప్పులమీద నీళ్ళు క్రుమ్మరించినట్లు బసంత్‌కుమార్ కోపం చప్పున చల్లారిపోయింది.

"రూప ఏమైనా కబురు పంపించిందా?" అతని వంక ప్రసన్నంగా చూస్తూ అడిగా డతడు.

"మిస్ రూప ఢిల్లీనుంచి బయలుదేరింది మీ దగ్గరికే. మిమ్మల్ని చూడాలని ఉందట!"

"ఎప్పుడు?" ఆత్రంగా అడిగా డతడు.

"మిస్ రూపా నేనూ ఢిల్లీనుండి చండీగఢ్ వరకూ కలసే వచ్చాం."

"రూప వచ్చిందా! మరి చెప్పవేం?"

ఆనందంగా సోఫా నుండి ఒక్క ఉదుటున లేచాడు బసంత్‌కుమార్.

"సారీ....బసంత్‌కుమార్‌జీ!

మిస్ రూప....చండీగఢ్ వచ్చిందని చెప్పాను గాని, మీ యింటికి వచ్చిందని చెప్పలేదే?"

అతని వంక ఆశ్చర్యంగా చూసాడు బసంత్‌కుమార్.

"చండీగఢ్ వచ్చిన మా అమ్మాయి మా ఇంటికి రాకుండా ఎక్కడికి వెళ్తుంది?"

"నిజమే బసంత్‌కుమార్‌జీ!

మిస్ రూపకు కూడా ఎంత వేగంగా ఈ ఇంటికి వచ్చే ద్దామా అని ఉంది. మిమ్మల్నందర్నీ చూడాలని అనుక్షణం తహ తహలాడి పోతోంది ఆమె "

"ఏమయింది? వాట్ హేపెంద్ టు మై డాటర్?" ఆత్రంగా అడిగాడు బసంత్‌కుమార్.

"మిస్ రూప క్షేమంగా ఉంది ఇప్పటి వరకూ. యస్! అప్ టు దిస్ మొమెంట్.

ఈ క్షణం నుండీ ఆమె క్షేమం గూర్చి నిర్ణయం తీసుకోవాల్సింది మీరు."

అతని మాటలు వింటుంటే బసంత్‌కుమార్ మనసు ఏదో కీడును శంకించసాగింది.

అతని మాటల్లో ఏదో మర్మం.

అంతవరకూ సరిగ్గా గమనించలేదుగాని, నవ్వుతున్న అతని పెదవుల్లో ఏదో వక్రత్వం, అతని కళ్ళల్లో ఏదో క్రూరత్వం:

"మిస్ రూప ఇప్పుడు మా ఆధీనంలో ఉంది బసంత్ కుమార్ జీ! ఇంకా మీకు అర్థమయ్యే భాషలో చెప్పాలంటే మీ అమ్మాయిని మేము కిడ్నాప్ చేశాం."

అంతే!

ఆ మాట విన్నంతనే హతాశుడై పోయాడు బసంత్ కుమార్.

"ఎందుకు? వై ——?"

ఆవేశంతో అరిచా డతడు.

మరోసారి చిన్నగా నవ్వా డా అపరిచితుడు.

"ఏమిటో మీరు ప్రశ్నలను తప్పుగా వేస్తున్నారు బసంత్‌కుమార్ జీ!

ఇప్పుడు మీరు మమ్మల్ని అడగాల్సింది 'ఎందుకు' అని

కాదు. 'ఏం కావాలి?' అని.

మా కోసం మీరు ఒక చిన్న పని చేసిపెట్టాలి. పని అంటే పెద్దకష్టమయినదేమీ కాదు. మీరు సులువుగా చేయగల్గేది, మీ చేతుల్లో ఉన్నదీను.

ఆ పని పూర్తయిన మరుక్షణం మీ అమ్మాయిని పువ్వుల్లో పెట్టి మరీ మీకు అందజేస్తాం.

లేకుంటే...."

"లేకుంటే....ఏం చేస్తారు? నా రూపను చంపేస్తారా?" వణుకుతున్న గొంతుతో అన్నాడు బసంత్‌కుమార్.

చిన్నగా నవ్వాడతడు.

"ఛ....ఛ....! చంపడమా! నో....నెవ్వర్!

బంగారు గ్రుడ్లను పెట్టే బాతును ఎవ్వరూ చంపాలను కోరు బసంత్‌కుమార్‌జీ!"

—అంటూ కోటు జేబులో నుండి కొన్ని ఫోటోలను తీసి బసంత్‌కుమార్‌కు యిచ్చాడతడు.

వణుకుతున్న చేతులతో వాటిని అందుకొని చూసాడు బసంత్‌కుమార్.

అవి ఎవరో అమ్మాయిల నగ్నచిత్రాలు అతి జుగుప్సాకరమైన భంగిమలతో అత్యంత శృంగార భూయిష్టంగా ఉన్నాయి ఆ ఫోటోలు.

"బజార్లో సీక్రెట్‌గా అమ్మే సెక్స్ ఫోటోలవి బసంత్ కుమార్‌జీ!

అన్నట్లు మిస్ రూప....అదే మీ అమ్మాయి చాలా అందంగా ఉంటుంది సుమా!

మిస్ రూపను యిలాంటి భంగిమలతో నగ్నంగా ఫోటోలు తీసి మార్కెట్‌నికి విడుదల చేశామనుకోండి....హాట్ కేక్స్‌లా అమ్ముడుపోతాయవి."

"స్టాపిట్ ....! ప్లీజ్ యింక చెప్పవద్దు!"

ఆ మాటలను వినలేక రెండు చెవులను అరచేతులతో మూసుకున్నాడు బసంత్‌కుమార్.

"ఈ మాత్రం దానికే మీరింత వర్రీ అయిపోతే ఎలా బసంత్‌కుమార్‌జీ!

ఇద్దరు యువకులు ఒకసారి మిస్ రూపను రేప్ చేస్తుండగా ఒక బ్లూ ఫిల్మ్ తీసి దానిని గల్ఫ్ కంట్రీస్‌కు అమ్మామనుకోండి....ఎంత డిమాండ్ ఉంటుందంటారు?"

"యూ....రాస్కెల్! ఎంత ధైర్యంరా నీకు. నా ఎదురుగా నా కూతురునే...."

పట్టలేని ఆవేశంతో ఆ అపరిచితుని పైకి దూకి రెండు చేతులతోనూ అతని పీకను పట్టి నొక్కసాగాడు బసంత్‌కుమార్.

ఆ హటాత్ సంఘటనకు క్షణంసేపు దిగ్భ్రమచెందాడు ఆ అపరిచితుడు.

అయితే, అది కేవలం క్షణంసేపు మాత్రమే!

మరుక్షణం బసంత్‌కుమార్‌ను విసురుగా లాగి, ఎదురుగా వున్న సోఫాలో కూలవేసాడు.

ఆవేశంతో బసంత్‌కుమార్ వగరుస్తున్నాడు.

ఫిజికల్‌గా ఆ అపరిచితుడు తనకన్నా ఎన్నోరెట్లు బలాఢ్యుడన్న నిజం అతనికి స్పష్టంగా తెలుస్తూంది.

"బసంత్ కుమార్‌జీ!

మీరు నన్నేమీ చేయాలేరు.

అతితెలివికి పోయి. నన్ను గురించి పోలీసులకు చెప్పడానికి ప్రయత్నిస్తే....మిస్ రూప గతి ఏమౌతుందో మీకు చెప్పానుగా.

మీ అమ్మాయి మాన, ప్రాణాలతో క్షేమంగా మీ

ఇంటికి రావాలంటే....ఆ వేగం మాని సావధానంగా ఆలోచించండి."

నిస్సహాయంగా అతని వంక చూసాడు బసంత్ కుమార్. అతని ముఖం అత్యంత దీనంగా ఉంది.

"ఏంకావాలి మీకు?"

"దట్స్ ఎ గుడ్ క్వొశ్చెన్. ఇప్పుడు మీరు సక్రమంగా ఆలోచిస్తున్నారు.

ఏంలేదు బసంత్‌కుమార్ జీ!

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో మాకు కొంచెం పని పడింది. మీరు ఆ బ్యాంకు హెడ్ కాషియర్ కదా. మీరు కాస్త సహకరిస్తే మా పని సులువు అవుతుంది"

"ఏం చేయాలి నేను?"

"ఈరోజు ముప్పయి ఒకటి. అంటే!

అయిదు పరిశ్రమలకు చెందిన వేతనాల మొత్తం సుమారు నాలుగు కోట్ల రూపాయలు ఈ రోజే మీ బ్యాంక్ నుండి విత్‌డ్రా చేయబడతాయి. అవునా?"

"అది మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు బసంత్‌కుమార్.

"ప్రశ్నలు వద్దు. చెప్పింది వినండి....ఆ అయిదు పరిశ్రమల వేతనాల మొత్తం మీరు లాకర్‌నుండి ఒకేసారి బయటకు తీస్తారా?"

"ఊహుఁ. ముందుగా ఒక ఫ్యాక్టరీ ఎమౌంట్ క్లియర్ చేసాకే, రెండవ ఫ్యాక్టరీ ఎమౌంట్ లాకర్‌లో నుండి బయటకు తీయబడుతుంది.

నాలుగు కోట్ల రూపాయలను ఒకేసారి కౌంటర్‌లో ఉంచుకోలేం కదా!

జస్ట్ ఎ సేఫ్టీ ప్రికాషన్."

"వెల్! బసంత్‌జీ....! మరో ప్రశ్న!

ఆ పరిశ్రమల వారు తమ వేతనాలకు ఏ డినామినేషన్స్‌లో క్యాష్ కావాల్సి ఉంటుందో....మీకు ముందురోజే చెబుతారనుకుంటాను."

"అఫ్‌కోర్స్!"

"అయితే! అంత పెద్ద మొత్తాన్ని వారికి కావాల్సిన డినామినేషన్స్‌లో ఏర్పాటు చేయాలంటే మీకు చాలా టైమ్ పడుతుందనుకుంటాను.

ఆ నగదును డినామినేషన్స్ ప్రకారం ఏర్పాటు చేయడమన్నది ఈరోజే....అంటే 31 నే చేస్తారా?"

"ఉహూఁ....

మాకు ఆ ఫ్యాక్టరీల నుండి ఇండెంట్ ముందురోజే అంటే 30వ తారీఖునే వస్తుంది కాబట్టి. ఆరోజే అంటే 30వ తారీఖునే వారు కోరిన డినామినేషన్స్ ప్రకారం క్యాష్‌ను సిద్ధంచేసి లాకర్‌లో ఉంచుతాం.

31న వారికి క్యాష్‌ను అప్పగించడమే."

"ఆరోజు సుమారుగా ఎన్ని గంటలకు మీరు ఆ క్యాష్‌ను డీల్ చేయడం మొదలుపెడతారు?"

"31న బ్యాంకుకు వెళ్ళిన వెంటనే నేను ముందుగా ఆ పనే చూస్తాను. అంటే సుమారు 10.30 అవుతుందేమో!"

"క్యాష్ ఎక్కడ ఉంటుంది!"

"స్ట్రాంగ్ రూమ్‌లోని లాకర్స్‌లో."

"స్ట్రాంగ్‌రూమ్ ఎక్కడ వుంది?"

"క్యాష్ కౌంటర్స్ వెనుక మేనేజర్ రూమ్. హెడ్ కేషియర్....అంటే నా రూమ్ ఉన్నాయి. వాటి వెనుక ఉంది స్ట్రాంగ్‌రూమ్."

"స్ట్రాంగ్ రూమ్ లోనికి ఎవరైనా క్రొత్తవారు అడుగు పెడితే ఏమౌతుంది?"

బసంత్ కుమార్ సమాధానం చెప్పలేదు.

"అది.... అది టాప్ సీక్రెట్!" అంటూ నీళ్ళు నమిలాడు.

అసహనంగా చూసాడా వ్యక్తి.

"మీ అమ్మాయి బ్రతుకు కుక్కలు చించిన విస్తరి కాకుండా ఉండాలంటే.... మీరు ఏ చిన్న రహస్యాన్నీ దాచడానికి ప్రయత్నించకండి.

మీ అతితెలివి వలన ఇక్కడ మాకు ఏమైనా జరిగితే, అక్కడ మీ అమ్మాయి...."

"నో! ప్లీజ్ మా రూపనేం చెయ్యవద్దు!"

"వెల్! అయితే చెప్పండి బసంత్ కుమార్ జీ!

స్ట్రాంగ్ రూమ్ లోనికి ఎవరైనా క్రొత్తవారు అడుగు పెడితే ఏమౌతుంది?"

ఒక్కసారి బాధగా తల విదిలించి చెప్పడం ప్రారంభించాడు బసంత్ కుమార్:

"చండీగఢ్ మొత్తంమీద అత్యంత ఎక్కువ మొత్తాలలో క్యాష్‌ను డీల్ చేసే బ్యాంక్ మాది.

రోజుకు మా బ్యాంక్ ట్రాన్సాక్షన్స్ లక్షలలోనూ, ఒక్కొక్కసారి కోట్లలో నూ ఉంటాయి.

అంతంత పెద్ద నగదు మొత్తాలను డీల్ చేయాలంటే నగదుకు పటిష్టమైన రక్షణ కావాలి కదా!

అందుకే అత్యంత అధునాతన పద్ధతుల్లో మా బ్యాంక్ కోసం ఆ స్ట్రాంగ్ రూమ్ నిర్మించబడింది.

స్ట్రాంగ్ రూమ్‌లో ఎల్లప్పుడూ లో-వోల్టేజ్‌లో విద్యుత్ ప్రవహిస్తూ ఉంటుంది.

ఒక మనిషిని మూర్ఛపోయేంతలా షాక్ కొట్టే విద్యుత్ వోల్టేజ్ అన్నమాట.

క్రొత్తవారు ఎవరైనా ఆ గదిలోనికి అడుగుపెడితే వారా విద్యుత్ ఘాతానికి బలికాక తప్పదు.

అంతేగాక, ఆ రూమ్‌లో అలారం బెల్స్ ఎరేంజ్ చేయబడ్డాయి. ఆ గదిలోనికి చీమ ప్రవేశించడానికి ప్రయత్నించినా, బ్యాంకు అంతటా ఎరేంజ్ చేయబడ్డ అలారమ్స్ మ్రోగుతాయి. ఎర్రని డేంజర్ బల్బులు వెలుగుతూ, ఆరుతూ ప్రమాదాన్ని సూచిస్తాయి.

వెంటనే బ్యాంకు సెక్యూరిటీ స్టాఫ్ స్ట్రాంగ్ రూమ్‌ను చుట్టుముడుతుంది.

మా బ్యాంకుకు కేవలం ఫర్లాంగు దూరంలో నున్న పోలీసు స్టేషన్‌కు కూడా ఈ అలారమ్స్ యొక్క కనక్షన్ యివ్వబడింది. అలారమ్ మ్రోగిన వెంటనే పోలీసులు కూడా రంగంలోనికి దిగుతారు.

యూనో! ఈ టెర్రరిస్ట్‌ల బెడదనుండి ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ ఒక ఎమర్జన్సీ స్క్వాడ్ సిద్ధంగా ఉంటుంది.

స్ట్రాంగ్ రూమ్‌లో రహస్యంగా అమర్చబడ్డ ఆటోమాటిక్ వీడియో కెమేరాలు ఆ గదిలోనికి అడుగు పెట్టిన వారి ప్రతి కదలికనూ షూట్ చేస్తాయి.

ఇక, స్ట్రాంగ్ రూమ్‌లోని లాకర్స్‌ని తెరవడం ఎవరికైనా అసాధ్యమే అని చెప్పాలి.

లాకర్స్‌కు మామూలు కీ అండ్ లాక్ సిస్టమే కాకుండా, మాష్టర్ నెంబరింగ్ సిస్టమ్ కూడా ఉంది.

ప్రతి లాకర్‌కు రెండేసి నెంబర్లు ఉంటాయి. వాటిలో ఒక్క నెంబరు మాత్రమే నాకు తెలుస్తుంది. రెండవ నెంబరు మా మేనేజర్‌కు తెలుస్తుంది.

మా ఇద్దరిలో ఎవరికికూడా ఆ రెండు నెంబర్లూ తెలియవు. అంటే నేనూ, మేనేజరూ కలసిగాని ఏ ఒక్క లాకర్‌నూ తెరువలేమన్న మాట.

వీటన్నింటినీ మించి....

ఆ గదిలోని ఏ ఒక్క లాకర్‌ను తెరిచినా, స్ట్రాంగ్ రూమ్ తలుపులు ఆటోమాటిక్‌గా మూసుకుంటాయి.

వెంటనే స్ట్రాంగ్‌రూమ్ బయట కాపలా ఉండే ఇద్దరు గార్డ్స్ ఎలర్టు అవుతారు.

స్ట్రాంగ్‌రూమ్ కీ హోల్ గుండా లోపలకు చూస్తారు వారు. అనుమానస్పదంగా ఏమైనా కన్పిస్తే; వెంటనే స్ట్రాంగ్ రూమ్‌ను బయటనుండి లాక్ చేసి, సెక్యూరిటీ చీఫ్‌కు. పోలీసులకు రిపోర్ట్ చేస్తారు.

ఒక్కసారి స్ట్రాంగ్‌రూమ్ బయట లాక్ చేయబడిందంటే, యిక ఆ గదినుండి బయటపడటం అసాధ్యమే!"

స్ట్రాంగ్‌రూమ్ గురించి బసంత్‌కుమార్ చెబుతున్న మాటలను వినేసరికి ఆ అపరిచితుని గొంతులో తడి ఆరిపోయింది.

ఇన్ని అవరోధాలను దాటుకొని, తాము ఆ బ్యాంకును దోపిడీ చేయగలమా అన్న అనుమానం మొదటిసారిగా అతని మనసులో మొలకెత్తింది.

"బసంత్‌కుమార్ జీ!

ఒకవేళ సడన్‌గా పవర్ సప్లై ఫెయిలయితే, మీరు స్ట్రాంగ్‌రూమ్ పట్ల తీసుకున్న ఇన్నిజాగ్రత్తలూ వృధాయే కదా!"

అతనివంక చూసి చిన్నగా నవ్వేడు బసంత్‌కుమార్.

"ఇంత చిన్న విషయాన్ని మేం ఆలోచించ లేదంటావా!" అన్నట్లుంది అతని నవ్వు.

"ఎలక్ట్రిసిటీ సప్లై ఫెయిలయిన మరుక్షణం జనరేటర్ ఆటోమాటిక్‌గా పనిచేయడం ప్రారంభిస్తుంది. ఈ రెండు పవర్ సిస్టమ్స్ కాకుండా స్ట్రాంగ్‌రూమ్‌కు ప్రత్యేకమైన బ్యాటరీ పవర్ సిస్టమ్ కూడా ఆరేంజ్ చేయబడి వుంది.

కాబట్టి స్ట్రాంగ్‌రూమ్‌కు సంబంధించినంత వరకు పవర్ ఫెయిల్ కావడమనే సమస్యే లేదు."

"మరి, స్ట్రాంగ్ రూమ్‌లోనికి మీరు ఎలా వెళ్తారు బసంత్‌కుమార్‌జీ!"

బసంత్‌కుమార్ మౌనంగా కూర్చున్నాడు.

"మీరు లాకర్స్ తెరిచినా, అలారమ్స్ మ్రోగటం, సెక్యూరిటీ గార్డ్స్ రావడం వగైరా....వగైరా ప్రోసెస్ అంతా జరుగుతుందా?"

ఒక్క క్షణం అతనివంక ఇబ్బందిగా చూసాడు బసంత్ కుమార్.

ఎంత కాదన్నా, అతడు నీతి, నిజాయితీలను ప్రాణం కన్నా మిన్నగా భావించే ఉద్యోగి. ఈరోజు తన కూతురును ఈ దుండగులనుండి కాపాడుకోవడం కోసం అత్యంత విలువైన తమ బ్యాంకు రహస్యాలను వారికి చెప్పడం అతనికి చెప్పలేనంత బాధగా ఉంది.

నిజం చెబుదామా, వద్దా అన్న తటపటాయింపుతో క్షణంసేపు ఊగిసలాడా డతడు.

కాని, కన్న కూతురు రూప ముఖం దీనంగా కళ్ళ ముందు కదలాడేసరికి, అతడి మనసు అతని వశం తప్పింది.

అతనికి తెలియకుండానే అతని పెదవులు మెల్లగా విచ్చుకున్నాయి.

3

"మైడియర్ ఆఫీసర్స్!"

తన ఎదురుగా కూర్చున్న పోలీసు ఆఫీసర్ల వంక ఒక్కసారి సాలోచనగా చూసాడు పోలీస్ కమీషనర్ ఆఫ్ ఛండీగడ్.

"మీరంతా జోగీంధర్ పేరు వినే ఉంటారు."

"డాకూ జోగీంధర్?" అప్రయత్నంగా ప్రశ్నించారు కొందరు ఆఫీసర్లు.

అవునన్నట్లు తలాడించాడు కమీషనర్.

"య్యెస్! ద మోస్ట్ నొటోరియస్ డాకూ ఆఫ్ యు.పి. జోగీంధర్ ఈ మధ్య చండీగడ్ ప్రాంతాలలో మూవ్ అవుతున్నట్లు సి.బి.ఐ. నుండి రిపోర్టు వచ్చింది.

ఎక్కడో ఉత్తర ప్రదేశ్‌లో లూటీలు చేసుకొని బ్రతికే ఈ డాకూ జోగీంధర్ చండీగఢ్‌లోనికి ప్రవేశించాడంటే సమ్‌థింగ్ ఈజ్ రాంగ్.

ఏదో జరగబోతూంది.

ఆ దుర్మార్గుడు ఏదో చేయబోతున్నాడు.

"ఓ వంక టెర్రరిస్టులతోనే వేగలేక సతమతమౌతున్న తమ మీదకు పులిమీద పుట్రలా ఈ డాకూ ఎక్కడనుండి దాపురించాడురా!" భగవంతుడా అనుకుంటూ కమీషనర్ వంక కలవరంగా చూసారా ఆఫీసర్లు.

"ఎనీహౌ ....బీ ఎలర్ట్!

నగరంలో ఏ అవాంఛనీయ సంఘటనా జరుగకుండా చూడండి. అనుమానాస్పదంగా కనిపించే ఏ వ్యక్తినైనా క్షుణ్ణంగా పరిశీలించనిదే విడిచిపెట్టవద్దని ఆర్డర్స్ పాస్ చేయండి."

వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి ఏకరవు పెడు తున్నాడు కమీషనర్.

అంతలో....

ట్రింగ్....ట్రింగ్ మంటూ టేబిల్ మీద నున్న టెలి ఫోన్ మ్రోగింది.

చెప్పటం ఆపి విసుగ్గా రిసీవర్‌ను అందుకున్నా డతడు.

కాని, ఆ ఫోన్‌లో ని మాటలను వింటున్నకొద్దీ అతని లోని విసుగు మంత్రం వేసినట్లు మాయమైపోయింది.

ఏదో తెలియని ఎగ్జయిట్‌మెంట్‌తో అతని ముఖం ఎర్రవారింది. రిసీవర్‌ను పట్టుకున్న అతని కుడిచేతి పిడికిలి ఉద్రేకంతో బిగుసుకుంటూంది.

కమీషనర్‌గారిలో ఒక్కసారిగా అన్ని మార్పులను తెచ్చిన ఆ ఫోన్‌కాల్‌లో ని అసలు అంతరార్థ మేమిటో అర్థంగాక, అతని వంక తెల్లబోయి చూస్తున్నా రా పోలీస్ ఆఫీసర్లు.

4

ఉదయం పదీ ఇరవై.

పంజాబ్ నేషనల్ బ్యాంకు తెఱచి యింకా ఇరవై నిముషాలే కావడంచేత, బ్యాంకులో ఆట్టే కస్టమర్స్ లేరు.

బ్యాంకు ఉద్యోగులు మాత్రం హడావుడిగా తమ తమ పనులను చేసుకుంటూ పోతున్నారు. ఆ రోజు ముప్పయి ఒకటి, అంటే నెలాఖరు కావడంచేత, వారికి ఆరోజు పని వత్తిడి కాస్త ఎక్కువే వుంటుంది.

బ్యాంకు ఆవరణలోనూ, మెయిన్‌గేటువద్దా, కస్టమర్స్ లాంజ్‌లోనూ, స్ట్రాంగ్ రూమ్ బయట నిలబడి ఉన్న సెక్యూరిటీ గార్డ్స్ మాత్రం ఎలర్టుగా ఉన్నారు. వారి భుజాలకు పవర్‌ఫుల్ రైఫిల్స్ వ్రేలాడుతున్నాయి.

డైలీ రొటీన్ ప్రకారం లాకర్స్ నుండి క్యాష్‌ను తీయ డానికి బ్యాంకు మేనేజర్, హెడ్ క్యాషియర్ బసంత్ కుమార్ స్ట్రాంగ్ రూమ్‌లోనికి వెళ్ళారు.

అదే సమయంలో—

బ్యాంకు ఆవరణలోనికి సర్....ర్ మంటూ బాణంలా దూసుకుంటూ వచ్చి ఆగిందొక పోలీస్ జీపు.

జీపు ఫ్రంట్ సీటులో నుండి హుందాగా క్రిందకు దిగాడొక పోలీస్ ఇనస్పెక్టర్. అతడి వెనుకే జీపులో నుండి బిలబిలమంటూ క్రిందకు దిగారు ఏడుగురు పోలీస్ కానిస్టేబిల్స్.

"కమాన్....హర్రియప్! ఫస్ట్ టేక్ దెయిర్ ఆర్మ్స్."

గంభీరమైన స్వరంతో ఆర్డర్స్ పాస్ చేసి, హడావుడిగా లోనికి పరుగెత్తాడా ఇన్‌స్పెక్టర్.

ఇద్దరు కానిస్టేబిల్స్ వెంటనే మెయిన్‌గేటువద్ద, ఆవరణలోనూ నిలబడి ఉన్న సెక్యూరిటీ గార్డ్స్ భుజాలకున్న రైఫిల్స్‌ను స్వాధీనపరచుకున్నారు.

ఏం జరిగిందో, ఏమిటో అర్థంగాక తెల్లబోయి నిలుచున్నారు ఆ గార్డ్స్.

ఇద్దరు కానిస్టేబిల్స్ రైఫిల్స్‌తో ఆ గార్డ్స్‌ను కదలకుండా కవర్ చేస్తుంటే, మిగిలిన అయిదుగురు కానిస్టేబిల్స్ తమ ఇనస్పెక్టర్‌ను అనుసరించారు.

అప్పటికి జీపును రివర్స్ చేసి మెయిన్ గేటుకు ఎదురుగా నిలబెట్టాడు జీపును డ్రయివ్ చేస్తున్న ఎనిమిదవ కానిస్టేబిల్.

అతడు జీపు ఇంజన్‌ను ఆఫ్ చేయలేదు. సారించిన నారిపైన ఉన్న బాణంలా ఏ క్షణంలోనైనా బయటకు దూసుకు పోవడానికి సిద్ధంగా ఉంది జీపు.

"క్యా హువా—భాయ్?" మెల్లగా గొంతు పెగలించు కుంటూ అడిగాడొక గార్డు.

"అసలు విషయం మాకు తెలియదు భాయ్. ఈ బ్యాంకు మీద రెయిడ్ చేయమని కమీషనర్ సాబ్ ఆర్డర్స్" అన్నాడొక కానిస్టేబిల్.

"మిమ్మల్ని నేరస్థుల్లా ఇలా నిలబెట్టడం, రైఫిల్స్‌తో మిమ్మల్ని కవర్ చేయడం....మాకూ బాధగానే ఉంది భాయ్! కాని డ్యూటీ ఈజ్ డ్యూటీ కదా!"

బాధగా ముఖం పెట్టాడు రెండవ కానిస్టేబిల్.

"అంటే....మీరు....?"

"స్పెషల్ స్క్వాడ్!" గర్వంగా జవాబు ఇచ్చాడా కానిస్టేబిల్.

అంతే! గార్డ్స్ మరి మాట్లాడలేదు.

ప్రస్తుతం పంజాబులో ఉన్న పరిస్థితుల్లో పోలీస్ స్పెషల్ స్క్వాడ్‌కున్న అధికారాలేమిటో వారికి బాగా తెలుసు.

అప్టరాల్ తమను బందీలుగా నిలబెట్టటమేమిటి, కావాలంటే టెర్రరిస్టులన్న అనుమానంతో అరెస్ట్ చేయవచ్చు. తాము ఎదురుతిరిగితే అక్కడికక్కడే కాల్చి చంపవచ్చు కూడా వారు.

అంతటి అధికారాలున్నాయి వారికి.

నిజమే! అలాంటి అధికారాలు ఉండబట్టే పోలీసులు ఈమాత్రమైనా టెర్రరిస్టుల దుండగాలను అరికట్టగలుగుతున్నారు అనుకున్నారా గార్డ్స్.

అక్కడ బ్యాంకు లోపల ...

బ్యాంకులో ప్రవేశించిన వెంటనే గార్డ్సను చుట్టుముట్టి

వారి చేతులలోని ఆయుధాలను స్వాధీనం చేసుకోసాగారు ఆ పోలీస్ కానిస్టేబిల్స్.

'స్పెషల్ స్క్వాడ్స్' అన్నమాట వినడంతోనే ఆ గార్డ్స్ మారు మాట్లాడలేక పోతున్నారు.

బ్యాంకు సిబ్బందీ, ఉన్న కొద్దిపాటి కస్టమర్లూ.... రైఫిల్స్‌తో ప్రవేశించిన పోలీసులనూ, వారు చేస్తున్న హడావుడినీ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

అంతా గందరగోళంగా ఉంది.

ఏం జరిగిందో ఏమిటో ఎవరికీ అర్థం కావటం లేదు. కాని పోలీసులు రంగంలోకి దిగారూ అంటే....

ఏదో జరిగింది!

లేదా జరగబోతూంది!

ఏమిటి....? ఏమిటయి ఉంటుంది?

అందరి మనసులు ఉత్కంఠతో ఉడికిపోతున్నాయి.

"ప్లీజ్ డోంట్ ట్రై టు మూవ్!

ఎక్కడున్నవారు అక్కడే అలాగే నిలబడి ఉండండి. మళ్ళీ నేను చెప్పేంతవరకూ ఎవరూ తమ తమ స్థానాల నుండి కదలడానికి సాహసించవద్దు"

కటువుగా అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఇద్దరు కానిస్టేబిల్స్ రైఫిల్స్‌ను బారుచేసి వారికి గురి పెడుతూ నిలుచున్నారు.

బ్యాంకు సిబ్బంది, కస్టమర్లు ఎక్కడి వారక్కడే భయంతో బిగ్గర బిగుసుకుపోయారు.

ఒక్కసారి చుట్టూ కలయజూసిన తరువాత ఎంతో పరిచయం వున్న వాడిలా చక చకా అడుగులు వేసు కుంటూ స్ట్రాంగ్ రూమ్‌ను సమీపించాడు ఆ ఇనస్పెక్టర్. అతడిని అనుసరించారు ఇద్దరు కానిస్టేబిల్స్.

భయం, ఆశ్చర్యం ఒకేసారి మనస్సులు మధిస్తుంటే ఏదో తెలియని అయోమయ స్థితిలో నిశ్చేష్టులయి నిలుచుండిపోయారు ఆ బ్యాంకులో ఉన్నవారంతా.

5

స్ట్రాంగ్ రూమ్ లోపల....

తెరచి ఉన్న సేఫ్టీలాకర్ ముందు నిలుచుని ఉన్నాడు హెడ్ క్యాషియర్ బసంత్‌కుమార్.

నేలమీద అయిదు పెద్ద కరెన్సీ బండిల్స్ పరచి ఉన్నాయి. తన చేతిలోని నామినేషన్స్ లిస్టుతో వాటిని సరిచూసుకుంటున్నాడు బ్యాంకు మేనేజర్.

బసంత్‌కుమార్ అసహనంగా చేతికున్న వాచీ వంక చూసుకున్నాడు.

పదీ ఇరవై తొమ్మిది....

"ఇంకో నిముషం!" సన్నగా మనసులోనే గొణుక్కున్నాడతడు.

ఏదో తెలియని టెన్షన్‌తో అతని గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. చెమట పట్టిన అరచేతులను పాంటుకు రాసుకుంటూ ఓరకంటితో మేనేజర్ వంక చూసాడు అతడు.

మేనేజర్ పూర్తిగా ఆ నామినేషన్స్ లెక్కలలోనే మునిగి ఉన్నాడు.

అతనికి అప్రయత్నంగా ఆ అపరిచితుని మాటలు గుర్తుకు వచ్చాయి.

"బసంత్‌కుమార్‌జీ!

స్ట్రాంగ్ రూమ్‌కు సంబంధించిన రహస్యాలన్నింటినీ మీరు ఏమీ దాచకుండా చెప్పాలనే ఆశిస్తాను.

మీ అతితెలివివలన మాకే ప్రమాదం వాటిల్లినా

ముందుగా బలయిపోయ్యేది మీ కుమార్తే నన్న నిజం మీకు గుర్తుందనుకుంటాను.

వెల్! యిప్పుడు నా ప్లాన్‌ను చెబుతాను....జాగ్రత్తగా వినండి.

మీరూ, మేనేజర్ స్ట్రాంగ్‌రూమ్‌లోనికి వెళ్ళేముందు తాత్కాలికంగా ఆ గదిలో ప్రవహించే పవర్ సప్లయ్‌ని ఆఫ్ చేస్తారు. సో! మీరు ఆ గదిలో ఉంటూండగా ఎవరయినా నిర్భయంగా ఆ గదిలోనికి ప్రవేశించవచ్చు.

అఫ్‌కోర్స్, ఆ గది బయటనున్న సెక్యూరిటీగార్డ్స్‌ను ఏమార్చే అనుకోండి.

అయితే ..

మీరు లోనికి వెళ్ళి సేఫ్టీలాకర్ తెరిచిన వెంటనే స్ట్రాంగ్‌రూమ్ తలుపులు ఆటోమేటిక్‌గా మూసుకుంటాయి బయట నుండి వాటిని తెరవటం అసాధ్యం.

మీరు స్ట్రాంగ్‌రూమ్‌లో ఉంటూండగా ఎవరయినా లోనికి ప్రవేశించాలంటే మీరు లాకర్స్‌ను క్లోజ్ చేయాలి.

లాకర్‌ను క్లోజ్ జేసిన వెంటనే ఆటోమేటిక్‌గా స్ట్రాంగ్ రూమ్ తలుపులు తెరుచుకుంటాయి కాబట్టి మేము సులువుగా ఆ రూమ్‌లోనికి ప్రవేశిస్తాం.

కాని....

ఒక్కసారి ఆ లాకర్ క్లోజ్ అయిందంటే, మళ్ళీ దాన్ని తెరవాలంటే మీతోపాటు మేనేజర్ కూడా తన కోడ్ నెంబర్‌ను వినియోగించాలి.

మీరు మీ అమ్మాయి రూప కోసం మేం చెప్పినట్లు వింటారు. కాని, మేనేజర్ ఎందుకు వింటాడు?

అతడు మనకు సహకరించకపోవచ్చు.

మనకు ఎదురు తిరగవచ్చు.

లాకర్ ప్రక్కనున్న స్విచ్ నొక్కి అలారమ్ బెగ్స్‌ను మ్రోగించి, ప్రమాదసూచనను చేయవచ్చు.

సో! మీ మేనేజర్ ప్రమేయం లేకుండానే ఆ లాకర్‌ను తెరవకుండానే మాకు కావాల్సిన డబ్బును దోచుకోవాలి.

ఈ రోజు ఉదయం మీరు స్ట్రాంగ్ రూమ్‌లోనికి వెళ్ళాక, ఆ అయిదు పరిశ్రమలకు చెందిన వేతనాల మొత్తం, అయిదు బండిల్స్‌ను లాకర్‌లో నుండి బయటకు తీస్తారు.

పదీ పదిహేను, పదీ ఇరవై నిమషాల మధ్య మీరు స్ట్రాంగ్‌రూమ్‌లోకి వెళ్తారు అనుకుంటే సరిగ్గా పదీ ముప్ఫయి సరికి మీరు ఆ నోట్లను బయటకు తీస్తారు.

మేనేజర్ ఆ నోట్లయొక్క డినామినేషన్స్‌ను చెక్ చేస్తుంటారు. అంటే....ఆ సమయంలో మాకు కావాల్సిన నాలుగు కోట్ల రూపాయలు బయటే ఉంటాయన్న మాట!

సో....! సరిగ్గా పదీ....ముప్ఫయికి....మీరు లాకర్‌ను క్లోజ్‌చేసి, స్ట్రాంగ్ రూమ్ తలుపులను తెరుస్తారు. సరిగ్గా పదీ ముప్ఫయికి...."

బసంత్‌కుమార్ మరోసారి వాచీ వంక చూసాడు.

సెకను ముల్లు చకచకా పన్నెండును సమీపిస్తుంది

ఒన్....టూ....త్రీ....ఫోర్....ఫైవ్....

అతని గుండె శబ్దం అతనికే వినిపించసాగింది. మెల్లగా లాకర్‌కు దగ్గిరగా జరిగాడతడు. వణుకుతున్న చేతులతో నెమ్మదిగా లాకర్ తలుపులను క్లోజ్ చేశాడు.

క్లిక్‌మన్న శబ్దంతో లాకర్ మూసుకోవటం, స్ట్రాంగ్ రూమ్ తలుపులు తెరుచుకోవడం ఒకేసారి జరిగాయి.

ఆ చిన్న సవ్వడికే నోట్లకట్టలను చూస్తున్న మేనేజర్ చివాలున తలను పైకెత్తాడు.

ఎదురుగా లాకర్ పక్కనే, తప్పు చేసినవాడిలా తల దించుకొని ఉన్నాడు బసంత్‌కుమార్. అతని వంక ఆశ్చర్యంగా చూసాడు మేనేజర్.

అదే సమయంలో బూట్లను టక టక లాడించుకుంటూ ఆ గదిలోనికి ప్రవేశించాడు పోలీస్ ఇనస్పెక్టర్.

గేటు బయట వున్న గార్డ్స్ చేతిలోని ఆయుధాలమ స్వాధీనం చేసుకొని ఆ గార్డ్స్ కదలకుండా రైఫిల్‌తో కవర్ చేస్తున్నాడు ఒక కానిస్టేబిల్. రెండవ కానిస్టేబిల్, జేబులలో నుండి రెండు పెద్ద గుడ్డ సంచీలను పయికి తీసి పట్టుకొని మెల్లగా లోనికి వచ్చాడు.

"హూ ఆర్ యూ?" వారి వంక కోపంగా చూస్తూ అన్నాడు మేనేజర్.

అతడి ప్రశ్నే విననట్లుగా—

"యూ బోత్ ఆర్ అండర్ అరెస్ట్! కదలడానికిగాని, ఎదురు తిరగడానికిగాని ఏమాత్రం ప్రయత్నించవద్దు" - కటువుగా అన్నాడు ఇన్‌స్పెక్టర్.

అతని వంక నమ్మలేనట్లు చూసాడు మేనేజర్. తాము చేసిన నేరం ఏమిటో, పోలీసులు వచ్చి తమను అరెస్టు చేయడమేమిటో అతనికి అర్థం కాలేదు.

"వై ....?" అన్నాడతడు మెల్లగా గొంతు పెగల్చుకొని.

"టెర్రరిస్ట్‌లతో చేతులు కలిపి, మీరు దొంగ నోట్లను చలామణీ చేస్తున్నారని మాకు రిపోర్టు వచ్చింది. వుయ్ ఆర్ ఫ్రం స్పెషల్ స్క్వాడ్" - అన్నాడు ఇన్‌స్పెక్టర్ దర్పంగా.

'స్పెషల్ స్క్వాడ్' అన్నమాట వినగానే అతని ముఖం వెల వెల బోయింది.

పంజాబ్‌లో టెర్రరిస్టులను అణచడానికి ప్రత్యేకంగా నియమింపబడ్డ ఆ స్పెషల్ స్క్వాడ్ యొక్క అధికారా లేమిటో అతనికి బాగా తెలుసు.

పాలిపోయిన ముఖంతో ఇన్‌స్పెక్టర్‌వంక భయంగా చూసా డతడు.

అతడు షాక్‌తో ఎంతగా అప్‌సెట్ అయ్యాడంటే, క్రిందనున్న అయిదు కరెన్సీ బండిల్స్‌ను తీసి కానిస్టేబిల్ తన చేతిలోని గుడ్డ సంచులలో పెట్టడాన్ని కూడా అతడు గమనించలేదు.

"ప్లీజ్ ఫాలో మీ" - అంటూ ఇనస్పెక్టర్ ఆ గది బయటకు నడిచాడు.

పోలీసులకు వారు స్పెషల్ స్క్వాడ్ అయినా సరే, సుమారు నాలుగుకోట్ల రూపాయలను ఒక బ్యాంకునుండి సీజ్ చేసి, తమతోపాటు తీసుకుని వెళ్ళే అధికారం ఉంటుందా? - అన్న విషయాన్ని కూడా ఆలోచించలేదు అతడు. అంతగా అతని మెదడు మొద్దుబారిపోయింది.

ఇనస్పెక్టర్ వెనుక దోషుల్లా మౌనంగా వెళ్తున్న మేనేజర్‌ను, హెడ్ క్యాషియర్ నలా వింతగా చూడ సాగారు ఆ బ్యాంకులోనివారు.

వచ్చినంత వేగంగానే, ఆ బ్యాంకునుండి హుటా, హుటిని వెళ్ళిపోయారు ఆ పోలీసులు.

6

ఊరు బయటనున్న ఓ పాడుబడ్డ బంగళాలో ఓ మూల....

పెచ్చులూడిపోయిన గచ్చుమీద బ్యాంకు మేనేజర్

స్పృహతప్పి పడి ఉన్నాడు. అతని ప్రక్కనే బసంత్ కుమార్, రూప కాళ్ళూ, చేతులూ బంధింపబడివున్నారు. వారి నోళ్ళలో గుడ్డలు కుక్కబడి వున్నాయి.

వారి వంక చిరునగవుతో చూసాడు ఇన్స్పెక్టర్. అతని వెనుక, ఎనిమిదిమంది కానిస్టేబిల్స్ నిలబడిఉన్నారు.

ఒక గొప్ప విజయాన్ని సాధించామన్న థ్రిల్‌తో, ఆనందంతో వారి ముఖాలు వెలిగిపోతున్నాయి.

"బసంత్ కుమార్ జీ!

బుద్ధిగా మేం చెప్పినట్లుగా విని, మాకు సహకరించి నందుకు థాంక్స్!

మేనేజర్‌కు యింకో రెండు గంటలలో తెలివి వస్తుంది. అతడు మీ కట్లు విప్పుతాడు. హాయిగా యింటికి వెళ్ళి పొండి. ఈలోగా మేము ఈ రాష్ట్రాన్నివిడిచి వెళ్ళిపోతాం.

అంతవరకూ మీరు అరచి గోలచేయకుండా....ఈ కట్లూ. మీ నోళ్ళల్లో ఆ గుడ్డలూ....

సారీ ఫర్ ద ఇన్ కన్వీనియన్స్!"

తీయగా నవ్వుతూ అన్నాడతడు.

అతని వంక నిర్వికారంగా చూస్తున్నాడు బసంత కుమార్. రూప మాత్రం అసహనంగా గింజుకుంటుంది.

వారి వంక చూసి మరోసారి చిన్నగా నవ్వాడతడు.

"గుడ్ బై బసంత్ కుమార్ జీ అండ్ మిస్ రూపా!" అంటూ ముందుకు అడుగువేయబోయాడు.

"డోంట్ ట్రై టు మూవ్ జోగీందర్!

కదలడానికి ప్రయత్నిస్తే నిర్దాక్షిణ్యంగా కాల్చి పారేస్తాం!"

చేతిలోని రివాల్వర్‌ను సూటిగా ఇనస్పెక్టర్ అలియాస్

జోగిందర్ గుండెలకే గురిపెట్టి నిలుచున్న కమీషనర్ ఆఫ్ పోలీస్‌ను చూడగానే వారు కలవరంగా చుట్టూ చూశారు.

రైఫిల్స్‌ను బారుచేసి చక్ర బంధంలా తమను చుట్టు ముడుతున్న పోలీసులను చూసేసరికి, వారిలో తప్పించుకు పారిపోదామన్న కోరిక మటుమాయమైపోయింది.

వారికి తెలుసు తాము అడుగు ముందుకు వేసిన మరుక్షణం తుపాకీ గుళ్ళు తమ గుండెల్లో దూసుకు పోతాయని.

భయంతో వారి ముఖాలు పాలిపోయాయి. పోలీసుల వంక నమ్మలేనట్లుగా చూశాడు జోగిందర్.

అతడిని చూసి చిన్నగా నవ్వారు పోలీస్ కమిషనర్.

"జోగిందర్ యు. పి. ని వదలి, పంజాబ్‌లో నీవు అడుగు పెట్టినప్పటినుండి నీమీద ఒక కన్ను వేసిఉంచాం.

మిస్టర్ బసంత్ కుమార్ నీ బెదిరింపులకు భీరువులా వుండిపోలేదు. తన కుమార్తె ప్రాణాలను రిస్క్ చేసి మరీ, నీ ప్లాన్‌ను మాకు అందజేసాడు.

నిన్ను కావాలంటే, బ్యాంకులోనే అరెస్టు చేయగలం. కాని, నీదగ్గర బందీగా ఉన్న రూప ప్రాణాలకోసం, నిన్ను నీ ప్లాన్ ప్రకారం బ్యాంక్‌ను దోచుకో నిచ్చాం.

నీ ప్లాన్ సక్సెస్ అయిందన్న గ్రుడ్డి నమ్మకంతో నీవు నిర్భయంగా నీ స్థావరానికి వచ్చావు. అందుకే దారిలో కూడా ఎక్కడా మీకు అడ్డుతగలలేదు మేం.

యిక మేం మీ స్థావరానికి ఎలా చేరుకోగల్గామా అని కదూ నీ సందేహం.

బసంత కుమార్ చేతికున్న రిస్టువాచ్‌లో చిన్న మినీ ట్రాన్స్‌మీటర్ అమర్చబడివుంది. అది చాలదూ మీ రెక్కడున్నారో చెప్పడానికి" హేళనగా నవ్వాడు కమీషనర్. □

ప్రాణం తీసిన పోస్ట్ కార్డ్

షణిబాబు

దక్షయజ్ఞం ధ్వంసం చేస్తున్న వీరభద్రుడి హుంకారంలా వినబడింది ఉరుము. తల నరకబడ్డ మొండెం నుండి ధారగా కారుతున్న రక్తంలా పడుతుంది వర్షం. ఎవరో రాక్షసుడు కంఠనాళాలు పెగుల్చుకుని అరుస్తున్నట్లు వినబడుతుంది హోరుగాలి. నిశీధి తిరుగులేని నియంతలా

ప్రపంచాన్ని ఆక్రమించింది.

ఆ గదిలో చిన్న బెడ్ లైట్ వెలుగుతుంది.

బయట ప్రకృతిచేసే బీభత్సాన్ని ఏమాత్రం పట్టించుకోనట్లు, అసలు ఈ ప్రపంచంతో తమకు సంబంధం లేనట్లు ఆ గదిలోని యువతీయువకులు గాఢ నిద్రలో ఉన్నారు. వారి ఊపిరి శబ్దాలు తప్ప ఏమి వినబడనంత నిశ్శబ్దం ఆ గదిలో వ్యాపించివుంది. నిద్రలో కూడా ఆ యువతి చాలా అందంగా కనిపిస్తుంది. ఆమెకు తగ్గట్టుగానే వున్నాడు ఆ యువకుడు.

హఠాత్తుగా ఆ యువకుడి తలప్రక్కగా వున్న ఫోన్ మ్రోగడం మొదలుపెట్టింది.

నిలకడగా వున్న నీటిలో రాయిపడ్డట్టుగా ఆ గదిని ఆవరించి వున్న నిశ్శబ్దంలో ఆ ఫోను మ్రోత అలలు అలలుగా వినిపించసాగింది. ముందుగా ఆ యువతి కదిలింది. నిద్రలో సన్నగా మూలిగి ప్రక్కకు తిరిగి పడుకుంది.

ఆ యువకుడు నిద్ర, మెలకువకాని స్థితిలో ఆ ఫోను ఎత్తాడు.

"హలో! వినోద్ హియర్" అన్నాడు బద్ధకంగా.

వెంటనే అవతలివైపు ఫోన్ పెట్టేసిన శబ్దం వినబడింది. ఏమి అర్థంకాలేదు. రాంగ్ నెంబర్ అనుకుంటూ రిసీవర్ హుక్ మీద పెట్టేసాడు. ప్రక్కనున్న యువతిని దగ్గరకు తీసుకుంటూ తిరిగి పడుకున్నాడు. నాలుగైదు క్షణాలలో నిద్రలో మునిగిపోయాడు.

ఆ చిన్న ఫోన్ కాల్ తన ప్రాణాలమీదకు తెస్తుందని, తనతోపాటు మరో రెండు ప్రాణాలు తీస్తుందని తెలుసుంటే, అంత హాయిగా నిద్రపోయేవాడు కాదేమో!

2

"హలో" అంటూ లోపలికి వచ్చాడతను.

"రండి, ప్లీజ్ సిడౌన్" ఆహ్వానించాడు వినోద్.

అది సిటీలోని పెద్ద ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫీసు. వినోద్ స్వయంగా నడుపుతున్నాడు.

"నా పేరు సదాశివం!" అన్నాడావ్యక్తి.

అతడు పొట్టిగావున్నాడు. కాని బాగా దృఢంగా ఉన్నాడతను. గుబురుగా పెంచిన మీసాలు అతని ఆకృతిని విచిత్రంగా మార్చివేసాయి.

"వాట్ కెన్ అయ్ డూ ఫర్ యూ" అడిగాడు వినోద్.

"నా పేరు సదాశివం" మళ్ళీ చెప్పాడావ్యక్తి, తలపైని టోపీని బల్లమీద పెడుతూ.

"మీరేమైనా రాజీవ్‌గాంధీయా, రోనాల్డ్ రీగనా? పేరు చెప్పగానే తెలియడానికి, మీరొచ్చిన పనేమిటో చెప్పండి."

"కాస్సేపటిలో తెలుస్తుంది. కాని. నీవెవ్వరికి చెప్పలేవు."

"వాడూయు మీన్?" కాస్త కోపం, కొంచెం ఆశ్చర్యం కలగలిపి అడిగాడు.

వినోద్‌కు ఈ కొత్త వ్యక్తిమాటలు వింతగా వున్నాయి. ఆఫీసులో తామిద్దరం తప్ప ఎవ్వరూలేరు. ఇతను చూస్తే పిచ్చివాడిలా వున్నాడు. ఎవరినైనా సహాయానికి పిలిస్తే?

"నీకు అర్థంకాలేదు కదా?" అంటూ ఈ విధంగా వివరించాడు సదాశివం.

"సైనేడ్ తిన్నవ్యక్తికి దాని రుచి తెలుస్తుంది. కాని వాడు ఎవ్వరికి చెప్పలేడు. అలాగే సదాశివం గురించి తెలుసుకున్నవ్యక్తి ఎవ్వరికి చెప్పలేడు."

ఆ మాటలు విన్న వినోద్ కంగారుగా కుర్చిలోనుండి లేవబోయాడు. ఆ ప్రయత్నం పూర్తిగా నెరవేరక ముందే

సదాశివం చేతిలో మాజిక్ చేసినట్లు రివాల్వర్ ప్రత్యక్ష మయ్యింది. సైలెన్సర్ అమర్చబడ్డ దాని బారెల్ చిన్నగా మూలిగింది. వినోద్ నుదిటిపై మూడో నేత్రంలా ప్రత్యక్షం అయ్యింది చిన్నరంధ్రం. కొద్దిగా జర్క్ ఇచ్చి డ్రాయర్ మీద ఒరిగిపోయాడు వినోద్. వచ్చిన వ్యక్తి ఎవరో, తనను ఎందుకు చంపుతున్నాడో తెలియకుండానే చనిపోయాడు.

వినోద్ చనిపోగానే క్షణం ఆలస్యం చెయ్యలేదు సదాశివం. బల్లపైనుంచిన హేట్ అందుకుని అక్కడినుండి కదిలాడు. దారి ప్రక్కగానున్న టెలిఫోన్ బూత్ లోనికి వెళ్ళి ఒక నెంబరు డయల్ చేశాడు. అవతల రెస్పాన్స్ రాగానే ఒక కాయిన్ లోపలకు వేశాడు.

"సగంపని పూర్తిఅయ్యింది. ప్రసాదం సిద్ధంగావుంచు" అన్నాడు.

"మిగిలినపని ఎప్పుడు పూర్తిచేస్తావు" అడిగింది అవతలిగొంతు.

"ఇప్పుడే పూర్తి చేద్దామనుకుంటున్నాను."

"సరిగ్గా అరగంట తర్వాత వెళ్ళు. నీకు రావలసిన డబ్బు రెడీగా వుంది. పనవగానే వచ్చి తీసుకో."

అవతలివైపు ఫోన్ పెట్టెయ్యడంతో అక్కడి నుండి బయటకు కదిలాడు సదాశివం.

సదాశివం సాధారణ మనుష్యులకన్నా పొట్టిగా ఉంటాడు. సాధారణమైన మనిషి కాదతను. చాలా ప్రమాదకరమైన మనిషి. ఒకడికి స్టాంపులు సేకరించడం హాబీ కావచ్చును. మరొకడికి నాణాలు సేకరించడం హాబీ కావచ్చు. ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క హాబీ వుంటుంది.

సదాశివానికి హత్యలు చెయ్యడం హాబీ. ఎన్ని హత్యలు

చేసాడో అతనికే తెలియదు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా మొత్తం దేశం అంతా తిరిగాడు. చిన్న గుండుసూది దొరికినా దానితో ఏదో దుర్మార్గం చెయ్యాలనుకుంటాడు.

సరిగ్గా నాలుగురోజుల క్రిందట తమిళనాడులో వున్న అతనికి కబురు అందింది. భరత్ అనే వ్యక్తి రెండు ఫోటోలు ఇచ్చాడు. ఆ ఇద్దరి ప్రాణాలకు యాభై వేలకు బేరం పెట్టాడు. సగం అడ్వాన్స్ కూడా ఇచ్చాడు.

సదాశివం పచ్చనోట్లు చూపిస్తే ప్రపంచంలో ఎలాంటి పనైనా చేస్తాడు. వెంటనే ఒప్పుకున్నాడు సదాశివం.

అయితే అతడు తొందరపడలేదు. మొదట ఆ ఇద్దరి దినచర్య కూపిలాగాడు. ప్రొద్దుట ఏ టూత్ పేస్ట్‌తో పళ్ళు తోముకుంటారు, అన్నదానినుండి రాత్రి నిద్రపోయే ముందు ఏం తాగుతారు వరకు అన్నీ తెలుసుకున్నాడు.

వృత్తిరీత్యా, ప్రవృత్తిరీత్యా సదాశివానికి ఏర్పడ్డ అలవాటది. అంతేకాదు, తనకు సంబంధించిన ఆధారాలు ఏమి ఉంచడు. ఆఖరికి తను వెలిగించి పారేసిన అగ్గిపుల్ల కూడా శవందగ్గిర దొరకనివ్వడు. కాబట్టే అతను ఇంత వరకు పోలీసులకు దొరకలేదు. భరత్ ఈ ఇద్దరిని ఎందుకు చంపదల్చుకున్నాడో కూడా అతనికి తెలిసింది. అయినా అది అతనికి అనవసరం.

వినోద్ మధ్యాహ్నం ఆఫీసులో ఒంటరిగా దొరుకు తాడు. అతనికి అక్కడ ముహూర్తం పెట్టాడు. ఐతే రేఖను చంపడం అంత తేలికకాదు. ఆమె ఇంటికి వెళ్ళి చుట్టుప్రక్కల వాళ్ళ కళ్ళబడటం అతనికి ఇష్టంలేదు. ఆమె బయటకు వచ్చేది తక్కువ. అందుకే ఇంకో రకంగా ప్లాన్ వేశాడు.

ఆ ఇంటికి ప్రక్కగా మేడపైన టైలరింగ్ షాపు

ష్ఠుంది. సరిగ్గా అక్కడినుండి చూస్తే రేఖ డ్రాయింగ్ రూమ్ కనబడుతుంది. ఒక అద్దాల కిటికి అడ్డం వుంది. అది పెద్ద లెఖ్ఖకాదు.

సమస్య ఏమిటంటే, టైలరింగ్ షాపులో ఓనర్‌తో పాటు ఆరుగురు టైలర్స్ ఉన్నారు. రెండురోజులు గమనించాడు సదాశివం. కరక్టుగా మధ్యాహ్నం ఒంటిగంటకు అందరూ భోజనాలకు వెళుతున్నారు. ఒక చిన్న కుర్రాడు కాజాలు, గుండీలు కుడుతూ షాపులో కూర్చుంటున్నాడు.

రెండు గంటలదాకా సమయం వుంది. ఈ మధ్య కాలంలో పని పూర్తి చెయ్యాలి. అందుకే రెండు హత్యలకు ఈరోజు ముహూర్తం పెట్టుకున్నాడు. సరిగ్గా ప్లాన్ ప్రకారం వినోద్ పని కానిచ్చేశాడు. ఇక మిగిలింది రేఖ.

కాని,భరత్ అరగంట ఆగమంటున్నాడు. అది సదాశివానికి ఎంతమాత్రం ఇష్టంలేదు. ఇప్పటికే సమయం ఒంటి గంట దాటింది. లేటయితే టైలర్‌షాపులో అందరు వచ్చేస్తారు. శరవేగంతో అక్కడికి చేరుకున్నాడు సదాశివం.

ఆ తర్వాత కార్యక్రమం కూడా స్పీడ్‌గా జరిగిపోయింది. గుండీలు కుట్టే కుర్రాడికి నెత్తిన ఒకటి కొట్టే సరికి వాడు రెండు గంటలు లేవనని పడక వేసాడు.

చేతిలోని సూట్‌కేస్‌ నుండి టెలిస్కోప్ రైఫిల్ పార్ట్స్‌తీసి బిగించాడు. రేఖ ఇంటివైపు చూసిఉలిక్కిపడ్డాడు. రేఖతో భరత్ ఏదో మాట్లాడుతున్నాడు.

సదాశివానికి ఏం చెయ్యాలో తోచలేదు. భరత్ ఇక్కడికి ఎందుకు వచ్చినట్లు? ఇప్పుడు రేఖను చంపవచ్చా? కాస్సేపు ఆగాలా?

క్రిందపడున్న కుర్రాడు కొద్దిగా కదలడంతో అటు కదిలాడు సదాశివం. వాడి కాళ్ళు, చేతులు అక్కడేవున్న

గుడ్డపేలికలతో కట్టి పడేసి, టెలిస్కోపిక్ రైఫిల్ సిద్ధం చేసుకున్నాడు సదాశివం.

అద్దాల కిటికీలోనుండి రేఖ క్లియర్‌గా కనిపిస్తుంది. ప్లస్ పాయింట్ ఆమె ఎడమ రొమ్ముపైకి జరిపాడు. ఇప్పుడు ట్రిగ్గర్ నొక్కితే రేఖ గుండె చిన్నాభిన్నమై పోతుంది. దానికన్నా ముందు ఆమె అందమైన వక్షస్థలం నామరూపాలు లేకుండా పోతుంది. ఆమె రొమ్ములను చూస్తూ అతనికి ఆ పనిచెయ్య బుద్ధికాలేదు. "అద్భుతమైన కొలతలు పెంచింది పాపాయి. పాడుచెయ్యొద్దులే" అనుకుంటూ రైఫిల్ కొంచెం పైకి ఎత్తాడు.

ఇప్పుడు ఆమె నుదురు కనిపిస్తుంది. సరిగ్గా ఆమె కనుబొమ్మల మధ్యకు గురిచూసుకున్నాడు. ట్రిగ్గర్ బలంగా ప్రెస్ చేసాడు.

సరిగ్గా అప్పుడే సదాశివం ఏమాత్రం ఊహించని సంఘటన జరిగింది.

3

"వారం రోజులక్రిందట నేను కేంపునుండి వచ్చిన రోజు అర్ధరాత్రి నీకు ఫోన్‌చేశాను. అది ఆ వినోద్‌గాడు ఎత్తాడు. వెంటనే ఇంటికి రాకుండా హోటల్‌లో వుండి పోయాను. మరునటి రోజునుండి నీమీద నిఘా ఏర్పాటు చేశాను. దానితో నీకు, ఆ వినోద్‌గాడికి మధ్య నడుస్తున్న గ్రంథం బయటపడిపోయింది" ఊపిరిపీల్చుకోడానికన్నట్లు ఆగాడు భరత్. రేఖ అలాగే నిలబడి వినసాగింది.

"చెప్పు! నీకు ఏం తక్కువ చేశానని నాకు ద్రోహం చేసావు."

రేఖ మాట్లాడకుండా అలాగే నిలుచుంది. సుడిగాలిలో అరటి చెట్టులా వణికిపోతుందని, తన కాళ్ళపై పడి క్షమా

పణ అడుగుతుందని అనుకున్న భరత్ ఆశ్చర్యపోయాడు.

"ఏం? నీ రంకు బయటపడిందని భయమేస్తుందా?" వెటకారంగా అడిగాడు.

"భయమెందుకు? ఇలాంటి రోజు వస్తుందని ఊహించాను" నిశ్చలమైన స్వరంతో చెప్పసాగింది రేఖ.

"ఏం తక్కువచేశానని అడిగారు కదూ? అసలు నేను అనే మనిషిని ఇంట్లో వున్నట్లు మీరు ప్రవర్తించారా? కేవలం డబ్బు, నగలు, చీరలు ఇస్తే చాలనుకున్నారు. ఎంతసేపు మీ వ్యాపారాలు, మీ పార్టీలు, మీ తాగుడు, పేకాట ఇవేగా....కనీసం నన్ను ప్రేమగా పలకరించేవారు కాదు. అందుకే మీకు విడాకులు ఇచ్చి వినోద్‌ని పెళ్ళి చేసుకోవాలనుకున్నాను."

"చేసుకుందువుగాని, వినోద్‌ని కాదు. వాడి శవాన్ని. వాడు చచ్చి చాలాసేపయ్యింది." కసిగా చెప్పాడు భరత్.

ఒక్కసారి షాక్ తగిలినట్లయ్యింది రేఖ. బాణం తగిలిన పక్షిలా, పాము నోటికి చిక్కిన కప్పలా విలవిల్లాడిపోయింది. వినోద్ చని....పోయాడా? మండువేసవిలో శీతల పవనంలా, మోడువారిన తన జీవితంలోనికి ప్రవేశించిన వినోద్ ఇక లేడా?

రేఖ ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్న బాధ చూసి కసిగా నవ్వాడు భరత్.

"మీ ఇద్దరిని చంపడానికి ఒక కిరాయి హంతకుడిని కుదిర్చాను. కాస్సేపటిలో నువ్వుకూడా చస్తావు."

"అలాగే కానివ్వండి. చావైనా మా ఇద్దరిని కలుపుతుంది. మీలాంటి నికృష్టుడితో బతకడంకన్నా వినోద్‌తో కలసి చనిపోవడమే సుఖం" ఏడుపుగొంతుతో చెప్పింది రేఖ.

అంతే! భరత్‌లో ఆవేశం కట్టలు తెంచుకుంది.

"యు డర్టి బీచ్! నేను అంత హీనంగా కనపడు తున్నానా?" అంటూ ఆమె దగ్గిరికి పరిగెత్తి రేఖ గొంతు రెండు చేతులతో బిగించాడు. ఆ ప్రయత్నంలో రేఖకు కిటికీకి మధ్యగా వచ్చాడు.

అదే అతడు తన జీవితంలో చేసిన ఆఖరి పొరపాటు. మరుక్షణం కిటికీ అద్దాన్ని బ్రద్దలుచేస్తూ దూసుకొచ్చిన బుల్లెట్ అతని వెన్నులో దిగిపోయింది.

అప్రయత్నంగా రేఖ మెడమీద అతని చేతులు విడి పోయాయి. బాధగా క్రిందికి జారిపోయాడు భరత్. తను సంధించి వదలిన బాణం తనకే తగిలిందని పాపం భరత్‌కు తెలియదు.

గబగబ పరిగెత్తి ప్రక్క గదిలోనికి వెళ్ళి తలుపేసు కుంది రేఖ.

సదాశివానికి జరిగింది అర్థమైంది. వెంటనే రేఖ ఇంటికి పరిగెత్తాడు.

హాలులోవుంది భరత్ శవం. చుట్టూ చూశాడు, గదు లన్ని తలుపులు తెరిచే వున్నాయి, ఒక్కటి తప్ప. నవ్వు కున్నాడు సదాశివం. అ రూము తలుపు గెంటాడు రాలేదు. లోపలి ప్రక్క గడియ వేసుకుందన్నమాట.

తలుపుకుపైన చిన్న అద్దంవుంది. అందులోనుండి చూస్తే గది లోపలివైపు కనబడుతుంది. అందంకోసం చేసిన ఏర్పాటది, సమానమైన ఎత్తులోనే వుంది ఆ అద్దం. కాని సదాశివానికి అందే ఎత్తులోలేదు. ప్రక్కనేవున్న టీపాయ్‌వైపు కదిలాడు సదాశివం.

రేఖకు గది బయట అడుగుల చప్పుడు వినబడుతూనే వుంది. భరత్ చెప్పిన మర్డరర్ వీడే అయివుంటాడు. తనకు తగలవలసిన బుల్లెట్ భరత్‌కు తగిలి వుంటుంది.

ఇప్పుడు తను ఎలా తప్పుకోవాలి.

ఆ గదికి ఎటాచ్‌డ్ బాత్‌రూమ్ వుంది. దాని వెంటి లేటర్ నుండి బయటకు వెళితే? లాభంలేదు. తల విదిలిం చింది రేఖ. వెళ్ళితే ప్రక్కనున్న చిన్నగదిలోనికి వెడు తుంది. అక్కడినుండి మళ్ళీ హాలులోనికి రావాలి. వాడు తనను బ్రతకనివ్వడు. హఠాత్తుగా జ్ఞాపకం వచ్చిందిరేఖకు, హాలులో గోడకు రైఫిల్ వున్నదన్న సంగతి. కాని అది లోడ్‌చేసి లేదుగా? వుంది. మొన్న వినోద్ చూస్తానని లోడ్ చేశాడు. వెరీగుడ్!

బాత్‌రూమ్ వైపు కదలబోయింది రేఖ.

ఇంతలో—తలుపుకున్న అద్దం భళ్ళున బ్రద్దలైంది.

గాబరాగా వెనకకు తిరిగిందిరేఖ.

ఆ ఖాళీనుండి మనిషి పట్టడు, మరి ఎందుకు బ్రద్దలు కొట్టినట్లో అర్థంకాలేదు రేఖకు....ఆమెకు ఒళ్ళంతా చెమటలు పట్టాయి. తన గుండె చప్పుడు తనకే వినిపించ సాగింది. గట్టిగా ఊపిరి తీయడానికి కూడా ఆమెకు భయమేసింది.

అద్దం బ్రద్దలైన చోటునుండి ఒక చెయ్యి లోపలికి వచ్చి తలుపు గడియకోసం వెదకసాగింది.

కంగారుగా చుట్టూ చూసింది రేఖ, ఫ్రూట్స్ పళ్ళెంలో పళ్ళు కోసుకునే కత్తి కనబడింది. అది తీసుకుని తలుపు మీది చేతిపై బలంగా దించింది. ఆ చేతిని చీల్చుకుంటూ తలుపులో దిగబడిపోయింది కత్తి. చివ్వున రక్తం చిమ్మింది. దిగంతాలు దద్దరిల్లేలా అరిచాడు సదాశివం.

అయితే అంతకు రెట్టింపు కేకవేసింది రేఖ. ఆమెకు తలుపుకు పిన్‌చేయబడ్డ చేతిని చూస్తే భయంగాను

అసహ్యంగాను వుంది. ఆ చేతినుండి కారినరక్తం తలుపు దగ్గర మడుగులా అవుతుంది. వెంటనే అక్కడి నుండి బాత్ రూమ్ వైపు పరిగెత్తింది.

సదాశివానికి నరకం అంటే ఏమిటో తెలిసి వస్తుంది. బిగ్గరగా అరుస్తూ తలుపు పగలగొట్ట సాగాడు. కాని ఒంటి చేత్తో ఆ పని అతనికి సాధ్యంకాలేదు.

సడన్‌గా ప్రక్కగదిలో నుండి రేఖ పరిగెత్తుకొని వచ్చింది. ఆమెను చూసి జేబులోనుండి రివాల్వర్ తీయ బోయాడు సదాశివం. కాని ఎడంచేతితో అది కాస్త ఆలస్యం అయ్యింది.

ఆ క్షణాన్ని రేఖ బాగా వుపయోగించుకుంది. సుడి గాలిలా గోడకున్న రైఫిల్ తీసింది. మెరుపులా వెనక్కి తిరిగి పేల్చింది.

ప్రొఫెషనల్ ఐన సదాశివానికి కూడా ఆమె కదలిక పట్టుకోవడం అసాధ్యం అయ్యింది. బహుశ బ్రతుకుమీద తీపి, వినోద్‌ను చంపిన వాడిపైపగ, ఆమెలో ఆ వేగాన్ని తెచ్చి వుంటాయి.

"ధన్! "ధన్!"

సదాశివానికి ఎర్రగా కాల్చిన వూస తన శరీరంలోనికి దిగబడినట్లు అనిపించింది. తను చంపిన ఎందరో మను ష్యుల రూపాలు లీలగా కనిపించ సాగాయి. మృత్యుదేవత నగ్నంగా కరాళ నృత్యం చేస్తున్నట్లు అనిపించ సాగింది.

రెండు శవాల మధ్య ఒంటరిగా నిలబడింది రేఖ. గదిలో నేల అంతా రక్తంతో తడిసిపోతుంది. వినోద్ ఆత్మకు రక్తతర్పణ చేసినట్లు వుంది.

హఠాత్తుగా క్రింద కూర్చుండిపోయి మోకాళ్ళ మధ్య తలపెట్టుకుని ఏడవసాగింది రేఖ. □

రెండు దయ్యాలు

వి.యస్.పి. తెన్నేటి

లోపల గదిలోంచి కుట్టుమిషన్ చప్పుడు వినిపిస్తోంది, అప్పుడే స్నానంచేసి గదిలోకొచ్చిన హనితకి. ఈ ప్రపంచంలో తనకి సర్వస్వం అయిన అమ్మ నిరంతరం సాగించే జీవన పోరాటానికి నిదర్శనంగా వినిపించే ఆ చప్పుడు, త్వరలో, అతిత్వరలో ఆగిపోవాలి. అంటే,

అమ్మ ఇంక ఈ వయసులో అలా శ్రమపడకూడదు. హాయిగా కాలుమీద కాలువేసుకుని దర్జాగా కూర్చుని తనకి కావలసినవి చెయ్యించుకుని, సుఖంగా బ్రతకాలి.

ఆ రోజెంతో దూరంలో లేదని హనితకి తెలుసు. అమ్మకి మాత్రం అప్పుడే తెలియకూడదని చెప్పటంలేదు.

రణధీర్‌లాంటి వ్యక్తి....తన అల్లుడు కాబోతున్నాడని అమ్మకి తెలిసిన క్షణం ఆమె కళ్ళల్లో ప్రతిఫలించే ఆ సంతోషం....

హుషారుగా ఆలోచిస్తూ అందంగా అలంకరించుకుంటోంది హసిత.

రణధీర్ కోరిన విధంగానే ఎర్రచీర కట్టుకుంది. అదే రంగు స్లీవ్‌లెస్ లోనెక్ జాకట్ వేసుకుంది. నెలరోజుల క్రితం తన పుట్టినరోజుకి అతను ప్రెజెంట్ చేసిన ఎర్ర క్రిస్టల్ గొలుసు వేసుకుంది. గోళ్ళకి ఎర్రని పాలిష్, నుదుట ఎర్రని బిందియా, పెదాలకి ఎరుపురంగు...., జడలో ఎర్రగులాబీ....

రణధీర్‌కి ఎంతో ఇష్టమైన కాంబినేషన్. ఆఖరిసారిగా తనని తాను నిలువుటద్దంలో పరికించుకుని, ఒక స్వీట్ స్మయిల్‌తో అక్కడినుంచి ప్రక్క గదిలోకి నడిచింది.

అంజనాదేవి కుట్టుకుంటూనే తలెత్తి చూసింది కూతురు వంక.

"ఈరోజు ఆఫీసుకి టిఫిన్‌బాక్స్ ఎందుకు తీసుకెళ్ళటం లేదమ్మా....?" అడిగింది.

"అబ్బ! ఎన్నిసార్లు చెప్పాలి మమ్మీ .... రానురాను నీకు మతిమరుపు మరీ ఎక్కువైపోతోంది. ఫ్రెండ్ మారేజ్‌కి వెళ్తున్నాం స్టాఫ్ అంతా. టిఫిన్లు, భోజనాలు అన్నీ అక్కడే...." అంది హనిత.

"ఐతే ఆఫీసుకి వెళ్ళవా?"

"ఖర్మ. అక్కడినుంచే అందరం కలిసి వెళ్ళేది. పొద్దున్నే చెప్పానుగా...."

"ఔనుకదూ? నిజమే. మతిమరుపు కొద్దిగా వస్తూంది?"

"కొద్దిగా ఏమిటి? కావలసినంత వుంది. రాత్రికి అన్నం వండకు. నేను నైట్ అక్కడే వుండిపోతాను. రేపు మార్నింగ్ కే వచ్చేది! ఇదికూడా మర్చిపోతావా?" అంది హనిత.

అంజనాదేవి నవ్వి—"ఆమాత్రం గుర్తుంటుందిలేవే తల్లీ. నువ్వు మరీనూ" అంది.

తను వెళ్ళేది ఆఫీసుకి కాదని, ఫ్రెండూ లేదూ పెళ్ళీ లేదు అంతా అబద్ధం అని, తను వెళ్ళేది రణధీర్ దగ్గర కని అమ్మకి తెలిస్తే....! అమ్మో....!

"వస్తాను మమ్మీ...." అని చెప్పి, హాండ్ బ్యాగ్ అందుకుని ఇంట్లోంచి బయటకు వచ్చింది హనిత.

2

"ఇడియట్. ఏమిటలా చూస్తాడు? నిన్నా? నన్నా?" అని కోపంగా అడిగింది హనిత, రెండు నెలల క్రితం, రణధీర్ ఆమెను తదేకంగా చూస్తూండటం గమనించి.

"అతనెవరనుకుంటున్నావ్? గొప్ప బిజినెస్ మాగ్నెట్. మన బాస్ అంతటివాడే. అతని దగ్గిర అప్పుడప్పుడు అప్పు తీసుకుంటూ వుంటాడు మన బాస్!" అంది హనిత పక్కనే కూర్చుని కాఫీ సిప్ చేస్తూన్న సంధ్య.

లంచ్ అవర్ లో టిఫిన్ బాక్సులు ఖాళీచేసి, టీ తీసుకో డానికి రోజూ ఆ క్యాంటీన్ కి వస్తూ వుంటారు సంధ్య, హనిత. ఇద్దరికీ ఒకే ఆఫీసులో ఉద్యోగం. ప్రయివేటు కంపెనీ అయినా యజమాని రంగనాథం చాలా మంచి

మనిషి అని అంతకంటే కాస్త మంచి ఉద్యోగం వచ్చినా ఆ ఆఫీసు వదిలిపెట్టలేదు హనిత. దొరికితే గవర్నమెంట్ ఉద్యోగం చెయ్యాలి, లేదా ఇక్కడే సెటిల్ అయిపోవాలని ఆమె నిశ్చయం.

రంగనాథంగారి కోసం వచ్చేడా అతను? మరెందుకు తన వంక ఆవిధంగా చూసాడు? అదోలా ఎందుకు నవ్వేడు? అంత గొప్ప బిజినెస్ మాగ్నెట్‌కి తనలో ఏం కనిపించింది?

"హనిత మీపేరేనా? రంగనాథం చెబుతూ వుంటాడు, చాలా సిన్సియర్ ఎంప్లాయీ అని!" అన్నాడు మూడు రోజుల తర్వాత. అప్పుడే చెప్పాడు తనపేరు రణధీర్ అని.

అతనిది దూసుకుపోయే మెంటాలిటీ. పదిరోజుల్లో గమ్మత్తుగా ఎంతో సన్నిహితుడై పోయాడు.

"మీరేమీ అనుకోనంటే ఓమాట చెప్పనా?" అన్నాడు రణధీర్.

"చెప్పండి—"

"దేశంలో మిమ్మల్ని మించిన అందగత్తెలు లేరంటారా?" అన్నాడు సూటిగా.

"ఇప్పుడు నేను అందగత్తెనని ఎవరన్నారు?" అంది హనిత కాజువల్‌గా.

"డామిట్! అంత ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ వుండకూడదు మనిషికి.

మిమల్ని మించిన అందగత్తెలు లేరా అన్నానుగానీ మీరు అందగత్తె కారు అని నేననలేదు. అనలేనుకూడా! అంటే మహాపాపం! చూడండి హనితగారూ! అందం

అంటే మీరేమనుకుంటున్నారో గానీ, నా దృష్టిలో ఆడ దానికి అందం కళ్ళల్లోనూ, పెదవుల్లోనూ వుంటాయి! అంతేగానీ టింగు టింగుమని ఊపుకుంటూ తిరిగే ప్రతి ఒంపులాడి అందగత్తె అనిపించుకోదు!" అని రణధీర్ గుక్కతిప్పుకోకుండా అన్నమాటలకి ఊపిరి పీల్చుకోవడం మర్చిపోయింది.

వెంటనే తేరుకుని, "మీరు చెప్పదల్చుకున్నదేమిటి?" అనడిగింది.

"మిమ్మల్ని మించిన అందగత్తెలు కనిపించారు నాకు. ఒకసారి వాళ్ళని చూసి అందంగా వుంది అని అనుకుని తల తిప్పేసుకున్నాను. కానీ నా లైఫ్‌లో నన్ను స్థాణువుని చేసి అలా మంత్రముగ్ధునిలా చూస్తూ వుండిపోయేలా శాసించిన అందం మీదే మిస్ హనిత!" గుండెను గురిచూసి వదిలిన యారోలా గుచ్చుకుంది ఆ అభినందన.

మరో రెండ్రోజుల తర్వాత, "మీరు కట్టుకుని వచ్చే చీరలన్నిటిలో కీ నాకు ఎర్రచీర ఎంతో నచ్చింది. నన్ను ప్రేమించడానికి, అభ్యంతరం లేకపోతే రేపు ఆఫీసుకి ఆ చీరే కట్టుకుని రండి. అలా కట్టుకుని రాలేదనుకోండి. నేను మీతో శృతిమించి ప్రవర్తించినందుకు క్షమాపణాలు చెప్పుకుని వెళ్ళిపోతాను. మళ్ళీ లైఫ్‌లో మీకు కనిపించను...." అనేసి వెళ్ళిపోయాడు రణధీర్.

మెదడులో కొన్ని బటన్స్ ఆఫ్‌చేసి వెళ్ళిపోయాడు. ఒకరాత్రి జాగరణ చెయ్యించాడు. మర్నాడు ఆఫీసుకి వచ్చేసరికి....కోరుకున్న ప్రియురాలి అంగీకారం ఎర్ర చీరలో కనిపించింది రణధీర్‌కి.

ఆ తర్వాత నెలరోజుల్లో ఒకరికొకరు ఎంత సన్నిహితులైపోయారంటే, నువ్వులేక నేను లేను, నేనులేక నువ్వు

లేవు అని ఊసులాడుకున్నారు! ఆలింగనలు, చుంబనలు ఒకరినొకరికి చేరువచేసాయి. అంతకంటే ముందంజ వెయ్యబోయాడు రణధీర్—

"అమ్మో. ఆశ! ఇప్పుడప్పుడే కాదు దొరగారూ! మూడు ముళ్ళు పడ్డాకే!" గోముగా అంది హనిత, సుతారంగా అతన్ని దూరంగా నెట్టేస్తూ.

మొన్న ఒకసారి అన్నాడు రణధీర్ .... "విజయవాడ వెళ్ళాలి నువ్వూ నేనూ!" అని.

"ఎందుకు?"

"గ్రీన్ సిగ్నల్ కోసం!"

"అంటే?"

"మా పెదనాన్నకి నిన్ను చూపించాలి. ఆయనకి నువ్వు ఖచ్చితంగా నచ్చుతావ్! ఆయన మాటంటే వేద వాక్కు మా నాన్నకి. అందుకే ఎప్పుడైనా ముందు మా పెదనాన్ననే కాకా పట్టేస్తుంటాను! ఆయనుండేది విజయవాడ?" అన్నాడు రణధీర్.

"అమ్మో ... నేను .... నేనెలా వచ్చేదీ!" అంది హనిత కంగారుగా.

"ఎలా వచ్చేదేమిటి? నా కార్లో నాతోపాటూ వస్తావ్!" సింపుల్‌గా అన్నాడు.

"మా అమ్మ ఒప్పుకోదు!" భయంగా అంది.

"ముందు గ్రీన్‌సిగ్నల్ సంపాదించి తర్వాత మీ అమ్మని, వాళ్ళ అమ్మని, వాళ్ళ తలలో జేజమ్మనీ ఒప్పించొచ్చుగానీ, ఏదో కథ చెప్పి ....వచ్చేసేయ్ ....అంతే!" అన్నాడు రణధీర్.

ఆలోచనలో మునిగిపోయింది హనిత.

"పిచ్చిపిల్లా! నీకేం ....ఎన్నేళ్ళయినా మెదలకుండా

కూర్చుంటావ్. నేను ఆగలేకపోతున్నాను. తక్షణం అందర్నీ ఒప్పించి, నిన్ను ఎక్కడికైనా ఎత్తుకుపోయి, ఇలా నిన్ను గట్టిగా పట్టుకుని—" అంటూ నడిరోడ్డు మీదే తుఫానులా చుట్టేస్తుంటే, సిగ్గుపడిపోయి, విదిలించుకుని, "అంత ఆత్రం పనికిరాదు మగధీరుడా....నువ్వు చెప్పి నట్లే చేస్తాను....ఎప్పుడు ప్రయాణం?" అంది.

"రేపే. నీకు మధ్యాహ్నం రెండుగంటల నుంచి ఆఫీసు కదూ?"

"ఔను. రేపు శుక్రవారం కదా!"

"నాకు తెలుసు లేవోయ్. అందుకే, రేపు నీకు సెలవు సాంక్షన్ చెయ్యమని మీ బాస్‌కి నేను చెప్తాను. నువ్వు ఇంటిలో ఏదో కథచెప్పి స్టార్ట్ అయిపో!" అన్నాడు రణ ధీర్.

వారానికి రెండురోజులు మధ్యాహ్నం నుంచి, సాయం త్రము ఏడున్నరవరకు స్పెషల్ డ్యూటీ వుంటుంది ఆఫీ సులో. ఆరోజే విజయవాడ ప్రయాణం.

"రెడ్ కాంబినేషన్ మర్చిపోకు సుమా!" అని మరీ చెప్పాడు.

అందుకే హనిత అంత ప్రత్యేకంగా ఎరుపుమయమైన అలంకరణతో ఇంటిలోంచి బైటపడి, ఆటో ఎక్కి, ఆనందభవన్ హోటల్ దగ్గరికి చేరుకుంది.

అక్కడ రెడీగా వున్నాడు రణధీర్.

"బ్యూటిఫుల్?" అన్నాడు హనితని చూడగానే.

ఒకరి వయిపు ఒకరు చూసుకుంటూ నిల్చున్న ఆ క్షణంలో ఎవరో అక్షింతలు వేసినట్లు టపటప రాలి పడ్డాయి వర్షపు చినుకులు.

ఇద్దరూ హోటల్‌లోనికి వెళ్ళి మీల్స్‌చేసి బయిట కొచ్చేసిరికి....వర్షం ఆగిపోయింది గానీ, ఎండ అదృశ్య మైపోయి వాతావరణం చల్లగా మారిపోయింది. ఆకా శంలో మేఘాలు కమ్ముకుంటున్నాయి.

హనిత, రణధీర్ ....కారులో కి ఎక్కి కూర్చున్నారు.

సిగరెట్ వెలిగించుకుని కారు స్టార్టు చేసాడు.

తొలిసారిగా అమ్మతో అబద్ధం చెప్పి, పరాయి మగా డితో, మరో ఊరికి వెళ్ళబోతున్నాననే ఆలోచన హనిత గుండె ఆ క్షణంలో వేగంగా కొట్టుకోడానికి కారణం అయ్యింది.

అరగంట ప్రయాణం చేసిన తర్వాత హనితవైపు తిరిగి అన్నాడు రణధీర్ ....

"ఏమిటోయ్ అంతదూరంగా జరిగి కూర్చుంటున్నావ్! కాస్త కారు కుదుపులకేనా ఒళ్ళు ఒళ్ళు తగలనీ! ఆ మాత్రం దానికే నువ్వేమీ అరిగిపోవు, తరిగిపోవు!" అని.

నవ్వు వచ్చింది ఆమెకి. వెంటనే అతనికి దగ్గరగా జరిగి, అతని భుజంమీద వాలిపోయి "ఐ లవ్‌యు రణ ధీర్" అంది.

జిగేల్ జిగేల్‌మని మెరుపులు. ఫెటిల్ ఫెటిల్‌మని ఉరుములు. చిటపట చినుకులు ప్రారంభమై, చూస్తుండగా విజృంభించింది!

కారు విండో పేన్స్ పైకెత్తి, ఫ్రంట్‌గ్లాస్‌మీద వైప ర్స్‌ని ఆపరేట్ చేసాడు. ఈలవేస్తూ హుషారుగా కారు డ్రయివ్ చేస్తున్నాడు.

"ఇదేమిటి? వర్షం ఇలా పట్టుకుంది...." అంది

హనిత.

"కాబోతున్న దంపతులం కదా! దారిలో దిగిపోయి వానా వానా వందనం అని డ్యూయెట్లు పాడుకోమని...." అన్నాడు రణధీర్ చిలిపిగా.

"ఛీ....ఫో!" అంది మురిపెంగా.

వర్షం మరీ ఎక్కువగా చూపించటం ప్రారంభించింది తన ప్రతాపం!

కుంభవృష్టి!

"లాభంలేదు. ఇక్కడెక్కడైనా ఆగుదాం" అన్నాడు రణధీర్.

సరేనంది హనిత.

ఓ చెట్టుదగ్గర కారాపి, తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. వాళ్ళ మధ్య సాగిన సంభాషణ టేప్ రికార్డ్ చేసి, ఎవరికైనా వినిపిస్తే "వీరు గారెంటీగా ప్రేమ పిచ్చోళ్ళు" అని సర్టిఫికేట్ ఇస్తారు.

మరో గంట తర్వాత హనిత అంది, "ఈ వర్షం తగ్గేటట్లు లేదుబాబూ! పద! ఏదైతే అయ్యిందని ముందుకేనా వెళ్ళిపోదాం! లేదా తిరుగుముఖం పడ్దాం!" అని.

ఉరుములు, మెరుపులు....పిడుగు పడిన చప్పుళ్ళు....

చీకటి ముసురుకుంటోంది....

"ఓ పన్జేద్దాం! అక్కడేవో లైట్లు కనిపిస్తున్నాయి. రాత్రికి మకాం అక్కడవేసి, వీలుంటే ఏదైనా హోటల్ రూం అయినా బుక్ చేసి...." అంటున్నాడు రణధీర్.

"ఏదో ఒకటి. లెటజ్‌గో...." అంది హనిత మధ్యలోనే.

మళ్ళీ కారు కదిలింది.

3

దారిపొడుగునా బురదగుంటలు, రాళ్ళు, రప్పలు....
ఎత్తుపల్లాలు....పరమకష్టమైన ప్రయాణం.

"అసలు మనం దారితప్పిపోయామేమో. విజయవాడ
రూట్ ఇంత దారుణంగా వుండదుకదూ?" అంది హనిత.

పకపక నవ్వేడు రణధీర్. ఆమె చెంపమీద ఆప్యా
యంగా నిమురుతూ అన్నాడు—

"ఆంధ్రప్రదేశ్‌లో ఆ చివర నుంచి ఈ చివరవరకు
అన్ని రూట్‌లూ నాకు బాగా తెలుసు డియర్! షార్ట్‌కట్‌లో
వెళ్తున్నాం....అంతే...." అని....

చీకట్లో ఒక మేడ కనిపిస్తూంది. వెంటనే కారాపాడు.
చుట్టూ చూసాడు. దూరంగా అక్కడొకటి అక్కడొకటి
విసిరేసినట్లున్నాయి యిళ్ళు.

అదిమాత్రం ఒక పెద్ద పాతకాలంనాటి మేడ.

"కమాన్. కారు దిగగానే స్పీడుగా ఆ ఇంటిదగ్గరకే
వెళ్దాం?" అన్నాడు రణధీర్.

"ఎందుకు?"

"ఏదో దండకారణ్యంలో వున్నట్లు ఫీలవుతున్నావ్‌గా,
అందుకు! వర్షం తగ్గాక—అప్పుడు కదులుదాం! ఏం....
నీకిష్టంలేదా?"

"ఎందు కిష్టంలేదు, పద!"

ఇద్దరూ కారుదిగారు. వర్షం ఏకధాటిగా కురుస్తూనే
వుంది. ఒకరిచెయ్యి ఒకరు పట్టుకుని రివ్వుమని పరు
గెత్తారు ఆ మేడవైపు.

గేటు వేసివుంది. ప్రక్కనే ఓ పెద్ద చింతచెట్టు కని
పించగానే, అక్కడికి వెళ్ళి నిల్చున్నారు.

గేటుకి తాళంలేదు. రణధీర్ వెంటనే గేటుదగ్గిరకి వెళ్ళి

మెల్లిగా తోసాడు. చప్పుడుచేస్తూ తెరుచుకోవటం గమ నించి హనిత కూడా అటు పరుగెత్తింది.

కాంపౌండు లోపల దట్టంగా పెరిగి ఉంది గడ్డి. ఇష్టం వచ్చినట్లు పెరిగివున్నాయి—పిచ్చిమొక్కలు....

పెద్దపెద్ద మెట్లున్నాయి—సింహద్వారానికి. వర్షంలో అప్పటికే తడిసి ముద్దయిపోయా రిద్దరూ. వేగంగా మెట్లెక్కి తలుపువంక చూసి నిర్ఘాంతపోయారు. పెద్ద తాళం కప్పు వ్రేలాడుతోంది.

"ఛ....ఎవ్వరూ లేరే!!" డిసప్పాయింట్‌మెంటుతో అంది హనిత.

అదే క్షణంలో సన్నటి దగ్గుతెర వినిపించింది.

చెవులు రిక్కించి విన్నారిద్దరూ. ఈసారి స్పష్టంగా వినిపించింది దగ్గిరలోనే. ఎవరో ముసలివ్యక్తి దగ్గినట్లు అనిపించింది. కళ్ళు చిట్లించి చుట్టూ పరీక్షగా చూసారు.

ఖంగుఖంగున వినిపించింది అదే దగ్గు.

అప్పుడు పడింది వాళ్ళ చూపు....మెట్లకి నాలుగడుగుల దూరంలో మొక్కల గుబురులో నిండుగా నల్లటి కంబళి కప్పుకుని నిల్చున్న ఒక ఆకారం! జాగ్రత్తగా చూస్తే.... ఎవరో వృద్ధుడు.

"ఒరసం బాగా పడ్తోంది కదు బాబూ....తుఫానుగానీ ఒచ్చిందేమో....ఈ ఇంట్లో మడుసులెవరూ లేరు. తాళం పెవులు కావాలా బాబూ....?" చాలా బలహీనంగా విని పిస్తూంది ఆ వృద్ధుడి కంఠం.

"ఈ ఇంట్లో వాళ్ళెక్కడికెళ్ళారు తాతా...." అంది హనిత.

తాత జవాబివ్వలేదు....

"తాళంపెవులు కావాలా బాబూ?" మళ్ళీ అడిగాడు,

చెయ్యిముందుకి చాచి. రణధీర్ ఆలోచించకుండా తాళం చెవులు అందుకున్నాడు.

"పెద్దయ్యగోరు ఇదేసాలకి ఎల్లిపోయేరు....అల్ల గదిలో కెళ్ళి... పడుకోండి...." అన్నాడు వృద్ధుడు .... వెళ్ళిపోతూ.

"రణధీర్! లోపలకెందుకులే....కార్లోనే కదలకుండా కూర్చుందాం...." మెల్లిగా అంది.

"నీకేమైనా పిచ్చా....వెర్రా....? చక్కటి ఛాన్స్ దొరికినందుకు సంతోషించాలి! బయట చలిగా వుంటుంది. లోపలైతే వెచ్చవెచ్చగా...." అన్నాడు రణధీర్ ఆమె నడుము చుట్టూ చెయ్యివేసి లోపలకి కదులుతూ.

"అబ్బ. లైట్లు లేవు. అంతా చీకటే—" అంది హనిత.

"ఐతేనేం. మన కళ్ళు చీకటికి అలవాటు పడిపోయాయిగా. ఇదిగో....నీ బుగ్గలు ఇక్కడున్నాయ్....నీముక్కు ఇక్కడుంది....సీ...."

"చాల్లే...."

ఒకరినొకరు పెనవేసుకున్నారు.

"పెద్దయ్యగారి పడకగదికి వెళ్ళమన్నాడుగా. అక్కడేమైనా లైటుందేమో...." అన్నాడు ముందుకి నడుస్తూ.

మేడమీదకి మెట్లు కనిపించాయి.

మెట్లపక్కనే బాత్‌రూం కనిపించింది.

హనిత లోపలకి వెళ్ళింది. రెండు నిముషాల తర్వాత బైటికొచ్చింది. ఇద్దరూ మెట్లు ఎక్కారు మెల్లిగా. పైన బెడ్‌రూం వుంది....

మంచం కనిపించగానే రణధీర్ మణికట్టుమీద ఆమె చెయ్యి గట్టిగా బిగుసుకుంది....! ఆమెను గట్టిగా కౌగ

లించుకున్నాడు. ఆమె చల్లగా ఐస్‌ముక్కలా తగిలింది.

రణధీర్ అదిరిపడ్డాడు.

గాలి ఉధృతంగా వీస్తూంది!

* * *

బాత్‌రూంలోంచి బైటికొచ్చిన హనిత చుట్టూ చూసింది రణధీర్‌కోసం.... ఎక్కడా కనిపించలేదు.

ఆమె గుండె దడదడలాడింది.

మెట్లు కనిపించాయి....

రణధీర్ ....ఆఁ ....అదిగో .... మెట్లెక్కుతున్నాడు.... మరి ఆ పక్కన ఎవరు ....?

వేగంగా మెట్లు ఎక్కిందది హనిత. బెడ్‌రూం తలుపులు మూసుకున్నాయి.

"రణధీర్ ...." అరిచింది ....కానీ ....పిడుగు పడిం దెక్కడో! ఆమె అరుపు వినిపించలేదు ....

తలుపుమీద పిడికిలి బిగించి గుద్దుతోంది హనిత ....

గాలికి జుత్తు, చీర ఎగురుతున్నాయి ....ఎక్కడనుం చొస్తోందో ఇంత గాలి!

* * *

రణధీర్ ఆమె కౌగిలిలోనుంచి తప్పించుకో లేక పోయాడు. ఆమె ఒళ్ళంతా చల్లగా ఐసుముక్కలా వుంది.

"ఇదేమిటి? ఇంత చల్లగా వున్నావ్?" అని కూడా అన్నాడు....

కానీ ఆమె పలకలేదు. మంచంమీదికి తోసింది రణధీర్‌ని....

"వాటీజ్ దిస్!" అన్నాడు ఆశ్చర్యంగా.

ఆమె అతన్ని ముద్దుపెట్టుకోడానికి మీదికి ఒరిగింది.

పళ్ళు దిగబడ్డాయి అతని పెదవిమీద. రక్తం ఉప్పగా తగిలింది.

"మైగాడ్!" అరిచాడు. అతన్ని తుఫానులా కమ్ముకుపోతూ వుంటే....తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు. ఆమెను అంతకంటే వేగంగా అల్లుకునిపోతూ, మంచం మీదినుంచి కిందికి జారిపడ్డాడు. అయినా లెక్కచెయ్యలేదు....

నాగుపాముల పోరాటం....

రణధీర్‌కి ఏమీ అర్థం కావటంలేదు. ఒళ్ళంతా కొరికేస్తూందామె. వీపుమీద గోళ్ళు దిగబడుతున్నాయి....! ఆమె తాకిన ప్రదేశమంతా నెత్తురుమయం!

హనితకి అంతపెద్ద గోళ్ళున్నాయా....లేవు!....మరి! అదిరిపడి....ఆమె కౌగిలినుంచి విడిపించుకోవాలని ప్రయత్నించాడు....కానీ....ఆమె....అంత సులభంగా వదిలిపెట్టలేదు....అతన్ని నిమిత్తమాత్రుడిగా, ఆటవస్తువుగా మార్చేస్తూంది....

భయంకరమైన ఆర్తనాదం వెలువడింది రణధీర్ నోటినుంచి.

4

హనిత.... పిచ్చిదానిలా తలుపులు బాదుతోంది....గాలి ఆమెను నిలబడనివ్వటం లేదు. తూలిపడింది....మళ్ళీలేచి నిల్చుంది....

కిటికి దగ్గిరకొచ్చింది. కిటికి రెక్కలు సులభంగా తెరుచుకున్నాయి....

మంచంమీద కనిపించిన దృశ్యం చూసి ఆమె కెవ్వుమని అరిచింది....కాదు....అరిచానని అనుకుంది....కానీ చిన్న మూల్గులా వెలువడింది అంతే....

కళ్ళుతిరిగి.... జారిపడింది....

మొదటి మెట్టుమీదే ఆగిపోయింది.... లేచి నిలబడుతూ, వేగంగా.... కంగారుగా, భయంభయంగా.... కిందికి పరుగెత్తింది....

ఎవరో తరుముకొస్తున్నట్లు.... వేగంగా....!

తలుపు తెరిచింది.... శరవేగంతో మెట్లు దిగుతోంది... ఆఖరిమెట్టుమీద మళ్ళీ కాలుజారింది. అప్పుడు వినిపించింది ఖంగుఖంగుమని అదే దగ్గుతెర.

"ఎల్లిపోతున్నావా తల్లీ.... ఎల్లిపో.... తోడేలు బారినుంచి తప్పించుకు పోతున్నావా.... ఎల్లిపో.... తాళం నేనేస్కుంటాలే! నువ్వెల్లు...." అన్నాడు వృద్ధుడు....

అయోమయంగా భయంభయంగా చూసింది హనిత...

గొల్లుమని నవ్వేడు ఆ వృద్ధుడు! హనిత గుండె గుభిల్లుమంది! కెవ్వుమని అరుస్తూ పరుగుతీసింది.... వేగంగా... మహా వేగంగా....

పరుగెత్తుతూనే వుంది....! వర్షం ఇప్పుడు తుంపర్లుగా పడుతోంది!

ఆయాసంతో రొప్పుతూ.... పరుగుతీస్తున్న హనిత కాలు బురదలో జారింది.... తలకి బలంగా ఏదో తగిలింది! స్పృహ కోల్పోయింది....

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి.... తనెక్కడుందో అర్థం కాలేదు....

పూర్తిగా తెల్లారిపోయింది.... వర్షం వెలసిపోయింది! ఓ గుడిసెలో వుంది తను....

"ఏ ఊరమ్మా మనది?" ఓ స్త్రీ అడిగింది....

"అర్ధరాత్రేల నడిరోడ్డుమీద ఎట్టా పడిపోయున్నావమ్మా...." మరో వ్యక్తి....

హనిత లేచి కూర్చుంది....జరిగినది అంతా సింహావలోకనం చేసుకుంటూ గుడిపెలోంచి బయటకొచ్చి చూస్తే దూరంగా....కనిపించింది ఆ మేడ!

"ఆమేడ ఎవరిది!"అడిగిందామె....అటువైపు చూపిస్తూ.

"గజపతిబాబు గారిది...." అన్నాడొక బక్కపల్చని వ్యక్తి.

"ఇప్పుడెవరుంటున్నారందులో....?"

"ఎవరుంటారమ్మా ఆ కొంపలో....దెయ్యాలు తిరుగుతున్నాయంటారు...." అంది ఒక వయసుమళ్ళిన స్త్రీ....

"దెయ్యాలా? ఎందుకు?"ఆశ్చర్యంగాఅడిగింది హనిత.

"గజపతిబాబుగారికి ఒక అందమైన బిడ్డుండేదమ్మ. పేరు రుక్మిణి. చక్కదనాల బొమ్మ. సిన్నతనంలోనే అమ్మ కన్నుమూసినా గజపతి బాబు రెండోపెళ్లి సేస్కోకుండా, అమ్మ అయ్య అన్నీ తనే అయ్యి పెంచాడాయమ్మని! కానీ అదేం కర్మనో....ఓ మాయదారి వెధవ వలలో సిక్కుకుని పేమ పేమ అని ఆడి ఎంట ఎర్ర కారులో తిరిగి సిట్టసివరకి ఆడు మరెవరికో పిల్లని అప్పజెప్పాలని సూస్తే....ఏడ్సి ...ఆ ఇంట్లోనే ఉరోసుకుని సచ్చిపోయిందమ్మా! ఒక్కగానొక్క కూతురు అట్టా అన్నాయం అయిపోయిందనే బెంగతో మంచంపట్టి పది రోజులు కాకుండా గజపతిబాబు సచ్చిపోయేడు....అదమ్మా ఆ ఇంటి కత...." అని చెప్పారు వాళ్ళు.

హనితకి అంతా అర్థం ఔతోంది.

"మరి ఆ ఇంటికి కాపలావుందే తాత ఎవరు?"అడిగింది.

అక్కడందరూ ఆనందంగా చూసారు.

"ఆ తాతని సూసేవా అమ్మ....? కిట్టయ్యతాత! దేవుడమ్మా....ఆడు! ఆ ఇంటికి ఇస్వాసం వున్న కుక్కలా

కాపలా వుండేవాడు. ఆ ఇల్లు ఎవరికీ అద్దెకివ్వద్దని పెద్దయ్య చెప్పి చచ్చిపోయేరంట....! ఆయాలిటి నుంచి మూడేళ్ళ వరకు ఆ ఇంటికి కాపలా వున్నాడు కిట్టయ్యతాత....! ఎప్పుడైనా ఎవరైనా రుక్మిణి సంగతి అడిగితే 'ఆయమ్మ సచ్చిపోలేదు....! ఆ దొంగసచ్చినోడు లేడూ ఆడి అంతు సూసేవరకు....బతికే వుంటాది! ఆడెప్పుడో ఇటు రాక పోతాడా....నా బంగారు తల్లికి దొరక్కపోతాడా....? అని బాధపడేవాడు....ఆ తర్వాత సచ్చిపోయేడు కిట్టయ్య...." అని చెప్పాడు ఒక పొడుగాటి మనిషి.

హనిత వెన్నులోంచి చలి పుట్టుకొచ్చింది. రణధీర్‌ను ఆ గదిలో చంపిన అమ్మాయి రుక్మిణి అని, తాళంచెవు లిచ్చి లోనికి పంపించిన వృద్ధుడే కిట్టయ్యతాతని తెల్సుకుంటేనే గుండె ఝల్లుమంటోంది....

దెయ్యం వస్తది!

శిరచ్ఛేదం

బొమ్మిడి అచ్చారావు

"సారీ మిస్ లతా, నేను నీ ప్రేమ సంగీకరించలేను."

అన్నాడు మధుకర్ ఖచ్చితంగా.

దెబ్బతిన్న పాములా తలెత్తి అతనివంక సీరియస్‌గా చూసింది లత.

"ఏం, నాలో ఏం లోటు కనిపించింది నీకు?"

"నీలో ఏ లోటులేదు మిస్ లతా! ఉన్న లోటల్లా నాదే! నే నతి సామాన్యుడ్ని. నువ్వు అగర్భ శ్రీమంతురాలివి. నీ ప్రేమ నందుకోగల స్తోమత నాకు లేదు."

"నేను నా అంతట నేను నీ స్థాయికి దిగి నీప్రేమ నర్థిస్తున్నాను కదా! నీ స్తోమత గురించి ఇక్కడా అప్రస్తుతం."

"ఆకర్షణ ప్రేమనిపించుకోదు."

"అంటే....!? నాది ప్రేమ కాదు. కేవలం ఆకర్షణే నంటావా?"

"ఎగ్జాట్లీ! ప్రేమ శాశ్వతమైంది. ఆకర్షణ ప్రభావం చాలా కొద్దికాలం మాత్రమే ఉంటుంది. తర్వాత మంచులా కరిగిపోయి, ప్రేమ స్థానంలో ద్వేషం, అసహ్యం పేరుకుపోయి ఒకరి నొకరు శత్రువుల్లా భావించుకోవటం, ఒకరి నాశనం మరొకరు కోరుకోవటం—జరుగుతుంది."

"ఛీ. నువ్వింత గుండెలేనివాడ వనుకోలేదు. అయినా నిన్ను కావాలని కోరుకోవటం నాదే తప్పు. ఆడది తనంతట తాను వలచి వస్తే గడ్డిపోచకన్న హీనమైపోతుంది. అది నువ్వు రుజువు చేశావు."

"డోంట్ బి ఎక్సయిటెడ్ లతా! నా క్లాస్ మేట్‌గా నువ్వంటే నా కభిమానముంది. స్నేహపూర్వకంగా మన్నించగల సంస్కారముంది. అంతేగాని నీమీద ఎలాంటి చులకన భావం లేదు."

ఛర్రున పైకిలేచి నిల్చుంది లత.

"చూడు, నన్ను తీవ్రంగా అవమానించావు, నా ప్రేమను నిరసించి నా అభిమానాన్ని దెబ్బతీశావు. ఇంతకింత నువ్వనుభవిస్తావు, నాది పాము పగ. నీ అంతు

చూడనిదే వదలను."

మధుకర్ చలించలేదు. కూచున్న చోటునుంచి లేవలేదు. చేతులు రెండు సుతారంగా నేలకి ఆన్చుకుని ఆ చేతుల బలంమీద వెనక్కివాలి ఆమెవంక చిరునవ్వుతో చూశాడు.

"కూల్ డౌన్ మిస్ లతా! ఇంటికివెళ్ళి తీరిగ్గా ఆలోచించుకుంటే నీకే బోధపడుతుంది—నా మాటల అంతరార్థం, తొందరపడి తీసుకున్న నిర్ణయం చాలా తొందరగా వీగిపోతుంది."

"నీ సలహాలు, నీతి బోధలు ఎవడికీ అక్కర్లేదు" విసవిస నడుచుకుంటూ వెళ్ళి బయట ఆగిన కారెక్కి బలంగా, తలుపును విసురుగా మూసుకుంది లత.

కొత్త కంటెస్సా కారు మెత్తగా దూసుకుపోతుంటే అటే చూస్తూ చాలాసేపు కూచుండిపోయాడు మధుకర్.

2

"ఏమిటి నువ్వంటున్నది? ఆఫ్టరాల్ ఓ అడ్రస్‌లేని రాస్కెల్ నిన్ను ఆటపట్టించటమా? వాడి అంతుచూస్తాను" అన్నాడు వీరావేశంతో సుధాకర్.

"అవున్నా అన్నయ్యా. వాడు చాలా పొగరుబోతు. నా ఫ్రెండ్సుముందు నన్నవమానించాడు. మన ప్రెస్టేజి ఏమిటి, ఓ అణా కానీగాడు మనల్ని సవాల్ చెయ్యటమేమిటి? నీకు నాకు కూడా ఎంత షేమ్!?"

"కరెక్టు! వాడి పేరు వివరాలు చెప్పు. రేపీపాటికి వాడ్ని పైలోకానికి పంపేస్తాను. నాచేతిలో మెరికల్లాంటి గూండా లున్నారు. పులుసులోకి ఎముక లేకుండా దంచేస్తారు అయిదు నిముషాల్లో."

"ప్రాణం తీసేస్తారా?"

"ఆఁ! శాల్తీ గుర్తుతెలియకుండా ఏ పార్టు కాపార్టు తీసేసి అక్కడొకటి అక్కడొకటి పారేస్తారు. మొహం చెక్కేస్తారు....అవన్నీ నీ కెందుగ్గాని వాడి పేరు అడ్రసు చెప్పు!"

"ప్రాణం తీసెయ్యకుండా పార్టులు తీసెయ్యటం కుదరదా?"

"కుదుర్తుందిగాని, వాడు మనవాళ్ళని గుర్తుపట్టి పోలీసులకి వివరాలు చెప్పేస్తారు కదా! అందుకని మొత్తానికి వాడ్నే పైకి పంపేస్తే శాశ్వతంగా వాడి నోరు మూతపడిపోతుంది....నీ కవన్నీ ఎందుగ్గానీ రేపు సాయంత్రానికల్లా వాడ్ని ఫినిష్ చేసేస్తాను. నిశ్చింతగా ఉండు" అభయమిచ్చాడు సుధాకర్.

వెళుతున్న అన్నను చూస్తూ గర్వంగా తలెగరేసింది లత. లేకపోతే ఆ మధుకర్ కెందుకంత మిడిసిపాటు? తనకి దక్కని మనిషి ఇంకెవరికీ దక్కకూడదు - అసలు బతికి బట్టకట్టకూడదు. ఆ అహంకారానికి తగిన శిక్ష శిరచ్ఛేదమే! బస్.

3

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కి కేసు ఓ పట్టాన అంతుపట్ట లేదు.

శవం ముఖం రూపు తెలీకుండా చెక్కేశాడు హంతకుడు. కాళ్ళు ఓచోట, చేతులు మరో చోట తలొకచోట మొండెం ఇంకోచోట అస్తవ్యస్తంగా పడున్నాయి.

హంతకుడికి హతుడిమీద చాలా కసి ద్వేషము ఉంటే తప్ప అంత క్రూరంగా చంపడు.

శ్రీనివాస్ శవం ఒంటిమీది దుస్తులు పరిశీలించాడు.

పాంటు జేబులో కర్చీప్, చిల్లర నాణాలూ, ఉన్నాయి. షర్టు జేబులో బస్ పాస్ ఉన్నది. దానిమీద హతుడి పాస్ పోర్టుసైజు ఫోటో, దానికింద అతని పేరు, అడ్రసు ఉన్నాయి.

అతనిపేరు మధుకర్.

నారాయణగూడా నుంచి ఆర్ట్సుకాలేజికి తీసుకున్న బస్ పాస్ అది.

శ్రీనివాస్‌కి లింక్ అందింది.

పాథాలజిస్ట్, వేలిముద్రల నిపుణుడు, ఫోటోగ్రాఫర్ తమ విధుల్ని చకచక నిర్వర్తిస్తున్నారు.

సార్జంట్ రాజు, శివం జనాన్ని కంట్రోల్ చేస్తూ స్పాట్‌లోనికి ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

శివాన్ని పిలిచి చెయ్యవలసిన విధుల్ని అప్పగించి సార్జంటు రాజును తీసుకుని మధుకర్ ఇంటికి బయలుదేరాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్.

నారాయణ గూడాలోని మధుకర్ ఇల్లు తేలికగానే కనుక్కొన్నాడు శ్రీనివాస్.

ఉదయం పదకొండు గంటల సమయం.

మధుకర్ వాళ్ళుంటున్నది రెండు పోర్షన్‌ల చిన్న డాబా ఇంట్లో. మధుకర్ పాస్ మీదున్న ఇంటి నెంబర్ ఓమారు సరిచూసుకుని, ఆ ఇంటిమెట్లెక్కాడు శ్రీనివాస్. రాజు అతన్ని అనుసరించాడు.

పోలీసుల్ని చూసి లోపల్నుంచి గుమ్మంలోకి రాబోయిన ఓ నడివయసు స్త్రీ భయంతో, టెన్షన్‌తో కదలకుండా అక్కడే నిల్చుండి పోయింది.

శ్రీనివాస్ గుమ్మందగ్గిరే ఆగిపోయి "లోపలికి

రావచ్చునా అమ్మా?" అన్నాడు మర్యాదగా.

"రండి, రండి." అన్నదామె తొందరగా.

శ్రీనివాస్, రాజు లోనికి అడుగుపెట్టారు.

మధ్య తరగతి కుటుంబానికి ప్రతిబింబంలా ఉంది ఆ గది. ఆ గదిలోని వస్తువుల్నిబట్టి ఆ ఇంటి ఆర్థిక పరిస్థితిని అంచనా వెయ్యవచ్చును. అయితే గది పొందికగా సర్దివున్నది.

శ్రీనివాస్ జేబునించి మధుకర్ బస్‌పాస్‌ని పైకి తీసి ఆమెకు చూపించి "ఇందులోని అబ్బాయిని గుర్తుపట్ట గలరా?" అనడిగాడు.

ఆమె ఆ ఫోటోను చూస్తూనే "ఇది మధుకర్ బస్ పాస్. మీ దగ్గర కెలా వచ్చింది?" అన్నది సంభ్రమంగా.

"మధుకర్ మీ కేమవుతాడు?"

"మధుకర్ మా అబ్బాయే. మా కిద్దరు పిల్లలు. అబ్బాయి అమ్మాయి. అమ్మాయి యింటర్ చదువుతోంది. అబ్బాయి ఆర్ట్సు కాలేజిలో డిగ్రీ చదువుతున్నాడు. అబ్బాయి గురించి ఏమయినా తెలిసిందా?"

"అబ్బాయి గురించి తెలిసిందా అంటున్నారు. మధుకర్ ఎక్కడికయినా వెళ్ళాడా?"

"అదే తెలియదు ఇన్‌స్పెక్టర్‌గారూ! రాత్రి వాళ్ళ స్నేహితుడి ఇంటికి వెళతానని చెప్పి వెళ్ళాడు. మళ్ళీ తిరిగి రాలేదు. ఉదయం వస్తాడేమోలే అనుకున్నాం. కాని ఉదయం కూడా రాకపోవటంతో వీళ్ళ నాన్నగారు ఆ స్నేహితు డింటికి వెళ్ళి కనుక్కొని వచ్చారు. రాత్రి మధు వాళ్ళింటికే రాలేదని చెప్పాడా స్నేహితుడు" ఆమె ఒక్క క్షణం ఆగింది ఊపిరి పీల్చుకోవటానికి.

మళ్ళీ కొనసాగించింది.

"ఒకవేళ కాలేజీకి సరాసరి వెళ్ళిపోయాడేమోననుకుం దామా అంటే అసలు రాత్రి ఆ స్నేహితు డింటికే వెళ్ళ లేదు. వీళ్ళ నాన్నగారు మధు స్నేహితులందర్నీ ఎంక్వ యిరీ చేశారు తెలిసినంతవరకు. కాని మధు జాడ ఎవరూ చెప్పలేకపోయారు. ఓ అరగంట క్రితమే పోలీస్ రిపో ర్టివ్వటానికి వెళ్ళారీయన. ఇంతలో మీ రొచ్చారు. ఏమ యినా బాబు జాడ తెలిసిందేమోనని అడిగాను."

శ్రీనివాస్ దీర్ఘంగా నిట్టూర్చి "మీ మధుకర్‌కి శత్రువు లెవరయినా వున్నారా?" అనడిగాడు.

ఆమె తెల్లబోయి, "ఎందుకలా అడిగారు? మా మధు బాబు చీమకూడా అపకారం చెయ్యని ఉత్తముడు. వాడిని ఆత్మీయంగా, ప్రాణప్రదంగా చూసుకునేవాళ్ళే గాని శత్రుత్వం వహించే వాళ్ళెవ్వరూ లేరు....అయినా బాబూ, ఇవన్నీ మీ రెందు కడుగుతున్నారో నా కర్థం కావటం లేదు" అన్నది.

శ్రీనివాస్ వెంటనే మాట్లాడలేదు. ఒక్కగా నొక్క కొడుకు నెవరో ఘోరంగా హత్య చేశారని చెపితే విని ఆమె తట్టుకోగలదా? అలా అని తన ఉద్యోగ బాధ్యతల్ని ఎలా విస్మరించగలడు?

గొంతు సవరించుకుని అడిగాడు శ్రీనివాస్ "ఓ సారి మీ మధుకర్ గదిని చూడవచ్చునా?"

"అలాగే....వాడికంటూ ప్రత్యేకమైన గది ఏదీ లేదు. పిల్లలిద్దరు ఈ ముందు గదిలో చదువుకుంటారు. ఒక్కో సారి ఇక్కడే చదువుకుంటూ నిద్రపోతారు కూడా. మధ్య గదిలో వాళ్ళకి సంబంధించిన వస్తువులు, గుడ్డలు, పుస్త కాలు ఉంటాయి. ఒక్కోసారి అక్కడ నిద్రపోతుంటాడు మధుకర్. మీ రీ రెండు గదులు చూడవచ్చు" అన్నదామె.

శ్రీనివాస్ ఆ రెండు గదుల్ని ఆమూలాగ్రం పరిశీలిం చాడు. మధుకర్‌కి సంబంధించిన ప్రతి వస్తువునీ, పుస్త కాలనీ, అతను రాసుకునే డైరీల్ని అన్నిటినీ - ఆధారా లేమైనా దొరుకుతాయేమోనని వెతికాడు. కాని అతని ప్రయత్నం ఫలించలేదు.

డైరీల్లో ఏవో కవితలు. మహాపురుషుల సూక్తులు నోట్ చేసుకున్నాడే తప్ప వ్యక్తిగతమైన సమాచారమేమీ రాసుకోలేదు మధుకర్.

అంతా అయాక కూల్‌గా చెప్పాడు శ్రీనివాస్. "అమ్మా, మీరు గుండె చిక్కబట్టుకుని వినండి. మీ మధుకర్ నెవరో హత్య చేశారు. మార్చ్యురీకి వచ్చి శవాన్ని తీసుకు వెళ్ళండి."

మొదలు నరికిన చెట్టులా కూలిపోయింది మధుకర్ తల్లి.

4

"నీ ప్రతిన చెల్లించాను లతా! నిన్ను అవమానించి నందుకు అన్నగా ప్రతీకారం తీర్చుకున్నాను" సుధాకర్ మాటలు లతలో సంతోషాన్ని కలిగించటానికి బదులు ఆమె గుండెలో గునపాల్లా నాటుకున్నాయి.

తను చెప్పిన కబురు విని చెల్లెలు ఎగిరి గంతేస్తుం దనుకున్న సుధాకర్ ఆమె ఉదాసీనంగా, విచారంగా కని పించటంతో హతాశుడయ్యాడు.

"ఏమిటి లతా, అలా వున్నావు? నీ శత్రువుని ఏపార్టు కాపార్టు తీసేసి వీధిలో పారేశారు నా మనుషులు. నువ్వు చాలా సంతోషంగా ఉండాల్సిన సమయ మిది! బీహేపీ అండ్ సెలిబ్రేట్!" అన్నాడు సుధాకర్ ఉత్సాహపరుస్తూ.

మాట్లాడకుండా తన గదిలోకిపోయి తలుపులు భళ్ళున మూసుకుని మంచమ్మీద బోర్లాపడి వెక్కి వెక్కి ఏడ్చింది లత. అంతవరకు మధుకర్ చావు కోరుకున్న లత ఇప్పుడతని చావు కబురు విని తట్టుకోలేకపోయింది.

తనకిప్పు డర్థమయ్యింది - మధుకర్ని తనెంత గాఢంగా ప్రేమించినదీ! అందుకే అతని తిరస్కారాన్ని భరించలేకపోయింది. ఒళ్ళు తెలియని ఆవేశంతో అతని మీది ఉక్రోషంతో అతని చావుని కోరుకుంది.

కాని ఇప్పుడు ఆవేశం చల్లారిపోయి, వివేకం తలెత్తి తను చేసిన ఘోరమైన తప్పు ఆకాశమంతా విస్తరించి తన మీద విరుచుకు పడుతుంటే రెక్కలు తెగిన పక్షిలా విలవిలలాడుతోంది.

సరిగ్గా అప్పుడే ఆమె మంచం పక్కన శబ్దమైంది.

చటుక్కున లేచి కూచుంది లత.

చీకటి పడిపోయింది. గదిలో లైటు కూడా వెలిగించుకోకుండా అలా ఎంతసేపట్నుంచి ఏడుస్తూండిపోయిందో ఆమెకే తెలియదు.

కళ్ళు చికిలించి మంచం పక్కన శబ్దం వచ్చిన వైపు చూసింది.

అక్కడ.... అక్కడ.... ఎవడో వ్యక్తి నిల్చుని ఉన్నాడు.

త్రుళ్ళి పడింది లత.

అతను....అచ్చం చనిపోయిన మధుకర్ లాగానే వున్నాడు. మధుకర్‌లాగా ఉండట మేమిటి! మధుకరే!.... చచ్చి తనని సాధించబోతున్నాడా?

"ఎవర్నువ్వు?" అరిచాననుకుంది. కాని శబ్దం పెదవి

దాటి రాలేదు. కీచుగా సన్నటి మూలుగులా బయటి కొచ్చింది.

"నే నెవరో తెలీదా మైడియర్ లతా! నువ్వు ప్రేమిం చానని చెప్పిన మధుకర్‌ని. రా....నన్ను కౌగలించుకో! నేనంటే నీ కెంతో ఇష్టం కదా! రా....తొందరగా ఊ!"

అతను ఒక్కో అడుగే ఆమె వయిపు వేస్తుంటే, లత భయంతో టెన్షన్‌తో బిగుసుకుపోయి నాలిక పొడారి పోగా, వెనక గోడ అడ్డు రావటంతో కుప్పలా నేల కూలి పోయింది.

మధుకర్ పకపక నవ్వాడు.

"బతికుండగా నా కౌగిలికోసం, నా ప్రేమకోసం తపించిపోయినదానవి, ఇప్పుడు నేను కోరి నీ కోసమొస్తే అలా దూరంగా పారిపోతావేం? రా, కమాన్ లతా, కమాన్!" అతను ఆమె ముందు నించుని చేతులు చాచి నవ్వుతున్నాడు.

రెండు చేతుల్తోను ముఖాన్ని భయంతో కప్పుకుని, "ప్లీజ్, నన్నేం చెయ్యకు....నన్నేం చెయ్యకు...." హిస్టీరికల్‌గా అరుస్తూ స్పృహతప్పి పడిపోయింది లత.

5

"యు ఆర్ అండర్ అరెస్ట్!" అన్నాడు ఇనస్పెక్టర్. శ్రీనివాస్ సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ.

సుధాకర్ అదిరిపడి చూశాడు. తనని తానదుపులో పెట్టుకుని, "ఎందుకు?" అన్నాడు పెడసరంగా.

"కన్నతండ్రిని హత్యచేసి రాక్షసంగా ఖండ ఖండా లుగా నరికినందుకు!" కూల్‌గా చెప్పాడు శ్రీనివాస్.

"వాట్ ఇనస్పెక్టర్? వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్?" అరిచాడు సుధాకర్.

"డోంట్ లెట్ యువర్ టంగ్ టు టాక్ నాన్సెన్స్!....
చాలా ప్లాన్డ్‌గా చేశావు హత్య. శవం ముఖాన్ని చెక్కేసి, జుట్టు గీయించి, గుర్తు తెలియని విధంగా చేశావు. మధుకర్ బస్‌పాస్‌ని శవం జేబులో పెట్టి హతుడు మధుకర్ అనే భ్రాంతి కల్పించి పోలీసుల్ని పక్కదారి పట్టించాలని చూశావు. కాని పోస్ట్‌మార్టం రిపోర్టులో శవం వయసు నలభై సంవత్సరాలుగా డాక్టరు నిర్ధారించటంతో కేసు మలుపు తిరుగుతుందని నువ్వూహించలేదు."

"అబద్ధం. అంతా అబద్ధం. నేను మా నాన్నగారి నెందుకు చంపుతాను?"

"ఎందుకా? ఆస్తికోసం. డబ్బుమీది వ్యామోహం రక్త సంబంధాన్ని, వావి వరసల్ని కూడా లెక్కచెయ్యదు. మీ తండ్రిగారు ఆస్తినంతా మీ చెల్లెలు లత పేర రాసేశారు. నువ్వు సకల వ్యసనాలకు బానిసవని ఆయనకు తెలిసి పోయింది. అందుకే కసితో ఆయన్ని చంపేసి, లతని పిచ్చిదానిగా చేసి ఆస్తినంతా నీ చేజిక్కించుకోవాలను కున్నావు.

అందుకే నకిలీ మధుకర్‌ని లత గదిలో రహస్యంగా దాక్కోమని చెప్పి, ఆమె మీదికి వదిలావు. మధుకర్ దయ్యమై తనని వేధిస్తున్నాడని భ్రమ పుట్టించి ఆమెను మానసికంగా దుర్బలురాల్ని చేసి, పిచ్చిదానిగా మార్చ డమో, లేక భయంతో గుండె ఆగిపోయేలా చేయటమో నీ ప్లాన్‌లోని క్లైమాక్స్.

కాని అసలు మధుకర్‌వచ్చి చెప్పిం తర్వాత మాకు అనుమానం కలిగి నీ గురించి ఆరాతీశాం. అసలు విష యం బయటపడింది. ఇప్పుడు నకిలీ మధుకర్ మా ఆధీ

నంలో వున్నాడు. అతను మా మర్యాద చూశాక నిజం కక్కేశాడు....”

“నో, అంతా అబద్ధం! కట్టుకథ. చచ్చిన మధుకర్ తిరిగి రావటమేమిటి?”

“కాదు మిస్టర్ సుధాకర్. ఇది పచ్చి నిజం.” అన్న మాటలు వినిపించి అదిరిపడి చూశాడు సుధాకర్.

ఎదురుగా చిరునవ్వుతో మధుకర్!

“నువ్వు....నువ్వు చావలేదా? నిన్ను నా చేతుల్తో చంపేశాను....నో....అందరూ కలిసి నన్ను పిచ్చివాడ్ని చేస్తున్నారు....” జుట్టు పీక్కున్నాడు సుధాకర్.

“నిన్నరాత్రి మా స్నేహితుడింటికి వెళుతున్న నా మీద పడి నా పీక పిసికి చంపబోయావు. నేను ఊపిరి బిగబట్టి చచ్చినవాడిలా నేల కూలిపోయాను. నా జేబునించి బస్ పాస్‌ని తీసుకొని నన్ను పక్కనేవున్న నూతిలో పారేశావు.

నాకు ఈతవచ్చు. మునిగిపోకుండా పైకితేలి, పైకొచ్చే మార్గంలేక తెల్లవార్లూ నూతిలోనే గడిపాను. మధ్యాహ్నం వరకు నా ఉనికిని గుర్తించిన వారులేరు. ఆ నూతికి సమీపంలో ఇల్లు నిర్మాణంలో ఉండటంవల్ల నీటికోసం నూతికొచ్చిన పనివాళ్ళకి నేను కనిపించటం, వాళ్ళు నన్ను పైకి తీయటం జరిగింది.

వెంటనే పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి ఇనస్పెక్టర్ శ్రీనివాస్ గారితో నీ సంగతి రిపోర్టు చేశాను. ఆయన రంగంలోకి దిగి మీ ఇంటికి వెళ్తే నకిలీ మధుకర్ పట్టుబడ్డాడు....” అన్నాడు మధుకర్.

పోలీసులు సుధాకర్ చేతికి కఫ్స్ బిగించారు. □

సమసిపోని సమస్య

కొన్నాలగడ్డ రామలక్ష్మి

నేనొక సీ ఐ డీ ఆఫీసర్ని!

ఆ ఊళ్ళో నాగేశ్వర్రావుపై రహస్య పరిశోధనలు చేయడానికి వచ్చాను.

అందరికీ నాగేశ్వర్రావు పెద్దమనిషి. ఆయనకు డబ్బూ వుంది. డబ్బుతో కీర్తిని సంపాదించుకునే తెలివీ వుంది.

డబ్బుతో ఆయన ఎన్నో మంచిపనులు చేస్తున్నాడు. అందువల్ల ఆయనవద్ద చెడ్డపనుల ఫలితంగా డబ్బు చేరు తోందని ఎవరూ అనుకోరు.

నాగేశ్వర్రావుకు రాష్ట్రంనుంచి కేంద్రం దాకా పలుకు బడివుంది. అందువల్ల ఆయన నేరాలను బయటపెట్టడానికి సి ఐ డీ ఆఫీసరు కావలసొచ్చాడు.

ఊళ్ళో ప్రవేశించిన నాలుగు రోజుల్లోనే నేను నాగేశ్వ ర్రావు గురించి చాలా రహస్యాలు సంపాదించాను.

ఐదో రోజున నాకు నాగేశ్వర్రావునుంచి ఆహ్వానం వచ్చింది.

స్వయంగా నాగేశ్వర్రావే నన్ను తన పర్సనల్ రూంలో ఏకాంతంగా కలుసుకున్నాడు.

"నీ పేరు ఫలానా—నువ్వో సీ ఐ డీ ఆఫీసరువి—" అన్నాడాయన.

నేను మనసులో ఆశ్చర్యపడినా పైకి ప్రకటించలేదు.

"నువ్వు ఫలానా తేదీన ఫలానా విధంగా ఈ ఊళ్ళో అడుగుపెట్టావు...."

నేను తెల్లబోయాను కానీ దొరకదల్చుకోలేదు.

"నువ్వు నా గురించింతవరకూ ఫలానా ఫలానా సమా చారం ఫలానా ఫలానా పద్ధతిలో సేకరించావు...."

ఆయన చాలా కరెక్టుగా చెబుతూంటే నేను నిశ్చేష్టుణ్నై పోయి - తేరుకున్నాక—"మీరు నాకు చెప్పదల్చుకున్న దేమిటి?" అన్నాను.

"నీ గురించిన భూత వర్తమానాలు నాకూ తెలుసు. నీకూ తెలుసు. భవిష్యత్తు విషయంలో కలిసి నిర్ణయం తీసుకోనడం మంచిదనిపించింది...." అన్నాడాయన.

"చెప్పండి—" అన్నాను.

"నాపై ఆరాలు తీయమని నిన్నొకరు నియమించారు. వారికంటే పైవారు నీ గురించి నాకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్నందజేస్తున్నారు...." అన్నాడాయన.

"చెప్పండి...."

"నీ ప్రతి కదలికనూ, ఊపిరినీ తెలుసుకోగలను నేను...."

"చెప్పండి...."

"ఉదాహరణకు నీ విపుడు జూలీ ఆచూకీ తెలుసుకుందుకు వచ్చావు...."

ఆశ్చర్యంగా ఆయనవంక చూశాను.

జూలీ అంతర్జాతీయ నేరస్థురాలు. వేషాలు మార్చడంలో దిట్ట. అందమైన ఆడపిల్ల. ఎలాంటి మగాడినైనా చిత్తు చేయగల సమర్థురాలామె. ఆమె యీ ఊళ్ళో ప్రవేశించింది.

పోలీసు లామెను తరుముతున్నారు.

ఆమె కిక్కడ నాగేశ్వరరావు రక్షణ లభించిందని వారికి తెలుసు.

కానీ అది వారు ఋజువు చేయలేరు.

ఆమె ఎక్కడుందో వారికి తెలియడంలేదు. కానీ యీ ఊళ్ళోనే ఉందని వారికి తెలుసు. అందుకే ఊరిచుట్టూ దిగ్బంధం చేశారు. పోలీసులకు తెలియకుండా ఊళ్ళోంచి పిట్టకూడా ఎగిరిపోలేదు.

నాగేశ్వరరావు జూలీ నెక్కడెలా దాచాడో నేను తెలుసుకోవాలి. నాగేశ్వరరావుకీ జూలీకీ ఉన్న సంబంధ మెలాంటిదో—వారిరువురూ కలిసెలాంటి నేరాలు చేస్తున్నారో తెలుసుకోవాలి....

నాగేశ్వర్రావు గురించి నా కప్పగించబడిన బాధ్యతల్లో ఇది కూడా ఒకటి. ఇంకా చెప్పాలంటే ఇది చాలా ముఖ్యమైనది.

"మీరు చాలా తెలుసుకున్నారు...." అన్నాను.

"ఇప్పటికి నా గురించి నువ్వూ తెలుసుకుని వుంటావు...."

"చెప్పండి...."

"పోలీసులూ, సి ఐ డీ లూ సామాన్యుల నేరాలు పట్టుకోడానికే కాదు. గొప్పవాళ్ళ నేరాలు దాచడానికి కూడా. గుర్తుంచుకో...."

"మీరు నా నుంచి ఏమాశిస్తున్నారు?"

"జూలీ యీ ఊళ్ళోలేదని సీవు సీపై అధికారులను నమ్మించాలి. నాపై ఏ అనుమానాలూ లభించలేదని రిపోర్టిచ్చి యీ ఊర్నుంచి తప్పుకోవాలి...."

"అలా చేయకపోతే!"

"ఈ ఊరికిప్పటికి నాపై ఆరాలు తీయాలని ముగ్గురొచ్చారు. వారిలో ఇద్దరు బుద్ధిగా నా మాట విని వెనక్కు తిరిగి వెళ్ళిపోయారు. అలా వెళ్ళని ఒక్కడూ పైకి పోయాడు. తెలిసిందా!" అన్నాడు నాగేశ్వర్రావు.

ఆ విషయం నాకు తెలుసు. పైకి పోయినతడు నాకు గురుతుల్యుడు, అందుకే నాగేశ్వర్రావంటే నాకు పగ వుంది. ఆ పగ నాధారంగా చేసుకునే నా బాస్ నన్నీపనికి నియోగించాడు.

దేశాన్నేలేవారే అవినీతిని ప్రోత్సహిస్తూ మళ్ళీ మళ్ళీ ప్రజల అభిమానాన్ని పొందగలిగే యీ వ్యవస్థలో నా బాస్ లాంటివారు ఆశాకిరణాలు! తమకు చేతనైనంతలో ఉడతా భక్తిగా సేవలు చేస్తున్నారు వారు దేశానికి....

"ఆలోచించుకోవాలి...." అన్నాను.

"ఆలోచించుకో—కానీ నేను మళ్ళీ నిన్ను పిలవను." అన్నాడు నాగేశ్వర్రావు తమాషాగా నవ్వుతూ—"వీ ఆలోచన నిన్ని ఊర్నించి బైటకు పంపేయాలి....సరిగ్గా ఇరవై నాలుగ్గంటల్లో నువ్వీ ఊరు వదలిపెట్టాలి. లేకుంటే నువ్వు నా శత్రువుకిందేలెక్క. నా శత్రువులనేం చేయాలో నాకు తెలుసు—"

నేను నాగేశ్వరావు దగ్గిర సెలవు తీసుకున్నాను.

2

ఇరవై నాలుగు గంటలు గడిచిపోయాయి.

ఈ ఇరవై నాలుగ్గంటలలోనూ ఒకే ఒక విచిత్రం జరిగింది.

ఊళ్ళో అడుగు పెట్టగానే నేనో కాల్ గరల్ నెంగేజ్ చేసుకున్నాను.

ఆమె పేరు దమయంతి. అందానికి మారు రూపంలా ఉంటుంది.

ఒక రోజామెతో గడిపేక—ఆ ఊళ్ళో ఉన్నంత కాలమూ ఆమెతోనే గడపాలనిపించింది. నా కోరికపై ఆమె నా గదిలోనే ఉండిపోయింది.

మేము కలిసి తిరిగేవాళ్ళం.

చాలామంది మమ్మల్ని కలిపిచూశారు.

ఈ ఇరవై నాలుగంటల్లోనూ దమయంతి విచిత్రంగా ప్రవర్తించింది.

ఇద్దరం క్లబ్బులో ఉండగా ఆమె పెద్దపెట్టున అరుస్తూ మాట్లాడింది.

నే నాశ్చర్యపోయాను. నలుగురూ నా చుట్టూ చేరారు.

"నన్ను ప్రేమించానంటూ తీయని మాటలు చెప్పి వల్లో వేసుకొన్నాడు. పెళ్ళి చేసుకుంటానని మాటిచ్చాడు. ఇప్పుడేమో మనం స్నేహితులుగా విడిపోదామంటున్నాడు. తన్ను మర్చిపోమంటున్నాడు, అల్లరిచేస్తే చంపుతానని బెదిరిస్తున్నాడు. మీరే నాకు సాక్ష్యం. నా పేరు దమయంతి. మా యిద్దరిపెళ్ళి జరిగితీరాలని ఇతడికి బుద్ధి చెప్పండి. పేరుకుతగిన పతివ్రతగా నేను పేరు తెచ్చుకుంటాను...." అందామె అందరిలో....

నేను తెల్లబోయి అలాంటిదేమీ లేదని అందరికీ నచ్చ జెప్ప బోయాను.

అక్కడున్న ప్రతి ఒక్కరూ నన్ను ముఖం వాచేలా చీవాట్లు వేశారు.

అంతా వెళ్ళిపోయాక ఆమెను ఏకాంతంలో అడిగాను. "అలా ఎందుకు ప్రవర్తించావు?" అని.

"నాకు నిన్ను పెళ్ళి చేసుకోవాలనిపించింది—" అందామె.

"నాకుండొద్దూ...." అన్నాను.

"నా కోరిక తీర్చుకొందుకు నాకు చేతనైన ఉపాయం పన్నాను. నన్ను వదుల్చుకొందుకు నీ చేతనైన ఉపాయం నీవు పన్నుకో...." అందామె.

ఆమె కళ్ళలో చిలిపితనం, మాటలో సవాలు....

"మోసపోయాను. నువ్వమాయకురాలివనుకున్నాను-" అన్నాను.

"మొదటిరోజు నీకు నాలో నచ్చిందమాయకత్వమేనా?" అందామె. ఆమె గొంతులో వెటకారం ధ్వనించింది.

ఒక కాల్‌గర్ల్‌లో అమాయకత్వాన్ని చూడాలనుకోవడం నా పొరపాటే!

"ఈ రాత్రికి మనం కలుసుకోము...." అన్నాను.

"ఎందుకని?" అందామె.

"నా మనసు పాడయింది...."

"దాన్ని నేను బాగు చేయగలను...."

"ఈ రాత్రికి నేనింటికి వెళ్ళాలనుకోడంలేదు...."

"అయితే నేను వెళ్ళి నీ కోసం ఎదురు చూస్తూంటా నక్కడ. ఆ విషయం గుర్తు చేసుకుంటే నువ్వే పరుగున ఇంటికొస్తావు...." అందామె.

"ఐతే నువ్వెళ్ళు...." అన్నాను.

ఆమె వెళ్ళిపోయింది

అప్పుడు రాత్రి ఎనిమిదయింది....

పన్నెండుదాకా నేను క్లబ్బులోనే ఉన్నాను.

నా మనసు మనసులో లేదు.

"దమయంతి అలా ఎందుకు ప్రవర్తించింది?" అన్న ప్రశ్న నన్ను వేధిస్తూంది.

ఆమె చెప్పిన సమాధానం నాకు తృప్తికరంగాలేదు.

ఇంటిదగ్గిర ఆమెను మరికొన్ని ప్రశ్నలు వేసి విషయం కూడా లాగాలి.

ఆమె ఇంటిదగ్గిర నా కోసం ఎదురుచూస్తూ ఉంటా నంది. ఎలా ఎదురుచూస్తుందో నాకు తెలుసు.

ఆమెలో గొప్ప ఆకర్షణ ఉంది!

ఆమె ఏకాంతంలో నాతో ఏం మాట్లాడినా సరసంగా ఉంటుంది. మధురంగా ఉంటుంది. నేనెవరినో ఏం చేయా లనుకుంటున్నానో ఆమెకు నిమిత్తంలేదు. నన్ను సంతో షంగా ఉంచే కబుర్లు తప్ప ఇంకేమీ ఆమె కవసరంలేదు.

బహుశా ఆమె నిజంగానే నన్ను పెళ్ళి చేసుకోవాలను

కుంటోందేమో!

ఈ నాలుగు రోజుల్లోనూ ఆమె నాతో యిల్లాలిగానే మసిలింది.

నేను తీసుకున్న యిల్లు చిన్న బంగళా. అందులో నా కోసం ఓ ప్రీమియర్ పద్మిని కారు.

ఆ వీధిలో అలాంటి బంగళాలు చాలా ఉన్నాయి కాబట్టి ప్రత్యేకతేమీ లేదు. ఆ బంగళాలో దమయంతి మాత్రం నాకు ప్రత్యేకత.

నాకు దమయంతిని చూడాలనిపించింది.

ఇంటి తాళం ఒకటి నా దగ్గరుంది. ఒకటి దమయంతి కిచ్చాను.

సరిగ్గా పన్నెండింటికల్లా క్లబ్బులోంచి లేచాను.

అయితే వెంటనే ఇంటికి వెళ్ళలేదు.

కాసేపు రోడ్లమీద తిరిగాను.

బయట బాగా చలిగా ఉంది. ఆ చలి నాలో వెచ్చటి ఆలోచనలు పుట్టిస్తోంది. ఆ వెచ్చదనంలో దమయంతి స్ఫురిస్తూంది.

ఇల్లు చేరుకునేసరికి ఒంటిగంటయింది.

వీధి తలుపు దగ్గరగా లాగితే తాళం పడిపోతుంది. లోపల్నుంచి తలుపు తీసుకోవచ్చుకానీ - బయట్నుంచి మళ్ళీ తాళంచెవితో తీసుకోవాలి.

నేను తాళంతీసి లోపల ప్రవేశించాను.

ఇల్లంతా చీకటిగా, నిశ్శబ్దంగా ఉంది.

దమయంతింకా ఇంటికి రాలేదేమో!

నాలో కొంత నిరుత్సాహం ప్రవేశించింది. ముందు తడుముకుంటూ స్విచ్ వేశాను.

మధ్యహాలు ప్రకాశవంతమైంది.

హాల్లోంచి బెడ్రూం వైపు చూశాను.

నాకూ, ఆ గదికీ మధ్య - డోర్ కర్టెన్ అడ్డంగా ఉంది.

దమయంతి తక్కడ ఉందో లేదో!

చకచకా బెడ్రూం సమీపించి కర్టెన్ తొలగించి తెల్లబోయాను.

దమయంతి గదిలో ఉంది. మంచం మీద పడుకుని ఉంది.

గదిలో బెడ్ లైటు వెలుగుతోంది. ఆ వెలుతురులో కూడా ఆమె గుండెల్లోకి దిగబడిన కత్తి కనబడుతోంది. ఎర్రటి రక్తం గడ్డ కట్టినా మెరుస్తూంది.

"మైగాడ్" అనుకున్నాను.

గదిలోకి ప్రవేశించి లైటు వేశాను.

చూడగానే తెలిసిపోతోంది. దమయంతి సజీవంగా లేదు.

ఎందుకిలా జరిగింది?

ఒక్క క్షణం ఆమెనే పరీక్షగా చూశాను.

ఆమె కళ్ళు తెరిచే వున్నాయి. రెప్ప పడకపోవటంవల్ల ఆమె చూపు లదోలా ఉన్నా - ఆమె అందం చెక్కు చెదరలేదు.

ఎందుకిలా జరిగింది?

నా బుర్ర చురుగ్గా పని చేస్తూంది.

దమయంతి ఎవరి మనిషీ కాదని నాకు తెలుసు. కానీ నాగేశ్వర్రావామెనే డబ్బుతో ప్రలోభపెట్టి - క్లబ్బులో ఆమెచేత అలా మాట్లాడించి వుంటాడు.

దమయంతిని చంపడానికి నా క్కారణాలున్నట్లు క్లబ్బులో ఎందరో ఋజువిస్తారు. సాక్ష్యం చెబుతారు.

నేను సిఐడీ ఆఫీసర్ని కావచ్చు. అంతమాత్రాన ఒక అమాయకురాలిని హత్యచేసే అధికారం నాకు లేదు!

ఇది నాగేశ్వర్రావ్ పన్నాగం. ఆయన నన్ను తెలివిగా హత్య కేసులో ఇరికించాడు.

ఈ పరిస్థితుల్లో నేనేం చేయాలి?

దమయంతి శవం నాకు ప్రమాదం.

ముందా శవాన్ని వదుల్చుకోవాలి.

నా బుర్ర చురుగ్గా పని చేస్తూంది.

శవాన్ని వదుల్చుకునే ముందు నేను దమయంతి శవంగా మారిందని నిర్ధారణ చేసుకోవాలి.

అందుకే ముందు లైటార్పేశాను. బెడ్లైటు కూడా.

గదిలో చీకటి....

ఇప్పుడు నేను శవాన్ని సమీపిస్తే - శత్రువు లెవరయినా పొంచి ఉంటే ఫ్లాష్ వెలుగుతుంది. దీపమున్నప్పటికంటే లేనప్పుడయితే ఫ్లాష్ విషయం సులభంగా తెలుస్తుంది.

నేను శవాన్ని సమీపించాను. నాడి పరీక్షించాను. శ్వాస, గుండె చూశాను. ఆమె నిస్పందేహంగా చనిపోయింది.

ఇప్పుడు నేనామెను ఊరి బయటకు తరలించాలి.

నా కారు వెనకసీటు పెట్టెలాంటిదే!

నేను మధ్యహాల్లో దీపం కూడా ఆర్పేశాను.

కారులోంచి - పెట్టెలాంటి వెనకసీటును తెచ్చాను.

చీకటికి నా కళ్ళు త్వరగానే అలవాటు పడ్డాయి.

పెట్టెను బెడ్రూమ్లో ఉంచి శవాన్ని సమీపించాను.

నా జేబులో రుమాలుంది. రుమాలు దమయంతి నా

కోసం కొనిచ్చింది. అది నాదని ఎవరూ ఋజువు చేయలేరు.

రుమాలుతో దమయంతి ముఖాన్ని మూసి వెనుకనించి ముడి వేశాను.

చటుక్కున ఎవరయినా చూసినా శరీర మెవరిదో తెలియకూడదు. శవాన్ని గుర్తించడానికి పట్టే వ్యవధి ఒకోసారి ఎంతగానో పనికి వస్తుంది.

శవాన్ని పెట్టెలోకి చేర్చాను. పెట్టెను మోసుకుంటూ కారుకు వెనుక సీటుగా అమర్చాను.

ఇంటికి తాళం వేసి కార్లో బయలుదేరాము.

నా గుండె దడదడ మంటోంది.

ఎన్నడూ లేని భయం నన్నావహించింది.

నేరస్థుల్ని పట్టుకోవాల్సిన నేను - చేయని నేరానికి భయపడి నేరస్థుడిగా తప్పించుకోవాలనుకుంటున్నాను.

మరో పరిస్థితిలో అయితే దమయంతి హత్యను పరిశోధించి నేరస్థుణ్ని ఉరికంబ మెక్కించేవాణ్ని.

కానీ - యిప్పుడు....

నేరస్థు డెవరో నాకు తెలుసు.

నాగేశ్వర్రావు నా ప్రత్యర్థి. అసామాన్యుడు.

నన్ను నిర్దాక్షిణ్యంగా ఉరికంబ మెక్కించగలడు. అదీ హంతకుడన్న పేరుతో.

అందుకే ముందు దమయంతి శవాన్ని మాయంచేసి- అప్పుడు నాగేశ్వర్రావు పని పట్టాలి.

ఇప్పుడు నేనీ శవంతో ఊళ్లోంచి బయిటపడాలి.

కారు జోరుగా పోనిస్తున్నాను.

నాకు తెలుసు. ఊరిచుట్టూ పటిష్టమైన కాపలా ఉంది. అన్ని వయిపులా ప్రతివాహనాన్నీ క్షుణ్ణంగా శోధించడం

జరుగుతుంది.

అయితే నేను సిఐడీ ఆఫీసర్ని కాబట్టి నాకు కొన్ని ప్రత్యేక సదుపాయా లున్నాయి. నన్ను నేను రక్షించు కొనడాని కా సదుపాయా లుపయోగించుకోవాలి - అను కున్నాను.

కారు ఊరి చివరకు చేరుకుంది.

అక్కడ చెక్‌పోస్ట్....

నలుగురు పోలీసులు నన్నూ నా కార్నీ ఆపారు.

నేను కారాపి విసుగ్గా వారి వంక చూస్తూ - "నా కారు నంబర్ చూడలేదా? నా గురించి తెలియదా?" అన్నాను.

నా దర్పానికి భయపడి - "ఎవరు మీరు?" అన్నా డొకడు.

నా జేబులోంచి అయిడెంటిటీ కార్డు తీసి చూపించాను.

బ్యాట్రీలైటు వెలుగులో ఆ కార్డునీ, ముఖాన్ని పరి శీలనగా చూస్తూ - "సార్ ఒకసారి కారును శోధిస్తే మీ కభ్యంతరమా?" అన్నాడతడు.

"అభ్యంతర మేమీ లేదు. కానీ దేశానికే ప్రమాదం. ఒక అర్జంటు పనిమీద హడావుడిగా వెళుతున్నాను. ప్రతి క్షణం నాకు ముఖ్యమైనది...." అన్నాను.

"వెళ్ళండి సార్" అన్నాడతడు వినయంగా.

"తిరిగి వచ్చేటప్పుడు మీతో కాసేపు మాట్లాడి మీ విశేషాలు వింటాను. ప్రస్తుతానికి వెడుతున్నాను" అంటూ కారు స్టార్టు చేశాను.

పెద్ద గండమే గడిచింది నాకు.

ఇప్పుడు నా గమ్యం నాకు తెలుసు.

అక్కడికి సరిగ్గా రెండు కిలో మీటర్ల దూరంలో ఓ కొండప్రాంతం వస్తుంది. ఆ కొండల మధ్యలో ఒక

ఏరుంది.

శవాన్ని నేనా ఏరులో పారేస్తే - అదేమయిందో అయిపు కూడా వుండదు.

ఆ ఏటి ప్రవాహవేగాని కా శరీరం మనుషుల కందని చోటికి చేరుకుందు కెంతోసేపు పట్టదు.

రెండు కిలోమీటర్ల దూరం చేరుకుందుకు రెండే నిము షాలు పట్టింది. అక్కణ్నించి కొత్త ఇరుకుదారిలో వెల యేటికి మరో నిముషం. ఆ తర్వాత కార్లోంచి శవాన్నెత్తి నీటిలోకి విసిరివేయడం మరో అయిదు నిముషాలు.

అప్పటికి నా మనసు తెరిపిన పడింది.

నాగేశ్వరరావు నా కంటగట్టాలనుకున్న నేరాన్నిప్పుడే కడిగేసుకున్నాను.

తేలికగా నిట్టూర్చి కారులో తిరుగుప్రయాణమయ్యాను. దారిలో చెక్‌పోస్టుదగ్గరాగి పోలీసుల్ని పలకరించాను.

"ఏం చేసొచ్చారు సార్ -?" అన్నాడు వారిలో ఒకడు.

"చెప్పకూడదు - రహస్యం" అన్నాను.

అతడు నవ్వాడు.

"ఇక్కడ మీ చెకింగ్ దేనికి? రహస్యం కాకపోతేనే చెప్పండి -" అన్నాను నవ్వుతూ.

"మీకు టైముంటే కారు దిగండి సార్ - " అన్నా డతడు.

కారు దిగాను.

నాకోసం అతడక్కడో కుర్చీ వేశాడు.

"జూలీ పేరు మీరు వినే ఉంటారు. ఆమె ఈ ఊర్నించి తప్పించుకోకుండా ఈ కాపలా ...." అన్నా డతడు.

"ఆమెను తప్పించుకోకుండా ఎలా ఆపగలరు? ఊళ్ళో బస్ స్టాండుంది, రైల్వేస్టేషనుంది. ఎయిర్‌పోర్టు కూడా

ఉంది-" అన్నాను.

"కానీ అందుకు మా ఏర్పాట్లు మా కున్నాయిసార్-" అన్నాడు పోలీసు.

"ఒక మనిషి ఎన్ని మారువేషాలైనా వేయొచ్చు. ఆమెను మీరెలా పట్టుకోగలరు?" అన్నా నాశ్చర్యంగా.

"ఇందులో ఆశ్చర్య మేమీలేదు సార్...." అన్నాడు పోలీసు.

అతడు చెప్పిన కథ నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది.

జూలీ ఈ నగరంలో ప్రవేశించినప్పు డామెనో సీ ఐడీ ఆఫీసరు వెంటాడుతూ వచ్చి తనూ నగరంలో ప్రవేశించాడు. ఆమెను నీడలా అనుసరిస్తూ మసిలాడు. ఒకరోజామె అతణ్ని కనిపెట్టి ఎదురు తిరిగింది. అత డామెపై పిస్తోలు ప్రయోగించాడు. నిజానికది మామూలు పిస్తోలు కాదు. ఆ పిస్తోలు ద్వారా అత డామె శరీరంలోనికో సూదిని విసిరి—ఓ మందు ప్రవేశపెట్టాడు.

ఆ మందు ప్రభావంవల్ల ఆమెను కనుక్కునేటందుకు రైల్వేస్టేషన్లో, ఎయిర్ పోర్టులో, బస్ స్టాండులో రహస్య యంత్రాలు పనికివస్తాయి. ఆమె ఆయా ప్రాంతాల అడుగు పెట్టగానే అక్కడ గంట మ్రోగుతుంది. గంట మ్రోగేక ఆమెను కనుక్కోవడం పెద్ద కష్టంకాదు.

ఆ మందు ప్రభావం ఆమెపై నెలరోజులుంటుంది ఏ పెట్టెలోనైనా దాగుని పయనిస్తే తప్ప ఆయా ప్రాంతాల ఆమె ఉనికి మందు ప్రభావంతో తెలుసుకోవచ్చు. అందుకే అన్ని ప్రాంతాలా మనుషలు పట్టేటంత పెద్దపెద్ద పెట్టె లన్నింటినీ క్షుణ్ణంగా శోధించడం జరుగుతోంది. చెక్ పోస్టుల దగ్గర జాగ్రత్తగా వాహనాలను శోధించడం

జరుగుతోంది.

"మందు ప్రభావం గురించి ఆమెకు తెలుసా?" అన్నాను.

"తెలుసు-" అన్నాడు పోలీసు. "తనపై మందు ప్రయోగించబడగానే ఆమె క్షణాలమీద అక్కడ్నించి మాయమైపోయింది. ఆమెను వెంటాడిన సీ ఐ డీ ఆఫీసరు కూడా మాయమయ్యాడు...."

"ఆ మందు ప్రభావం నెలరోజులే కదా! అంతవరకూ ఆమె ఇక్కడ రహస్యంగా ఉండొచ్చును...." అన్నాను.

"అక్కడే ఉంది సార్ తమాషా! ఆమె ఈ వూరివి వదిలిపెట్టాల్సిన అత్యవసరమైన పనేదో ఉందిట. ఈ ఊళ్ళో ఆమె పదిరోజులకు మించి ఉండడానికి లేదు. అందాకే ఆమె నెలాగో అలా బయటపెట్టగలమని మా అందరి ఆశానూ...."

నాకో చిన్న అనుమానం వచ్చింది—"సీ ఐ డీ ఆఫీసరు మాయమైతే-సమాచారం పోలీసుల కెలా అందిందీ?"

"అతడు పిస్తోలుద్వారా ఆమెలో మందుప్రవేశపెట్టాక-ఆ విషయం పోలీసులకు చెబుతూ హెచ్చరించాడు. హెచ్చరిక సగంలో వుండగా సందేశం ఆగిపోయింది. ఆ సమయంలో జూలీ మనుషులతణ్ని గమనించి విషయం తెలుసుకుని బంధించి ఉంటారని పోలీసుల అనుమానం."

"ఆ ఆఫీసరు బంధించబడివుంటే—ఆ మందుకు విరుగుడు ప్రయోగించబడి ఉండేది కదా!" అన్నాడు.

"ఆ మందుకు విరుగుడులేదు-" అన్నాడు పోలీసు.

"అయితే ఆ జూలీని నా కార్లో దాచావని మీ రనుకున్నారా?"

"అనుకోవడం కాదు. డ్యూటీ చేస్తున్నాం. మీరు

సీ బీ ఐ ఆఫీసరు కాబట్టి కానీ లేకుంటే మిమ్మల్ని వదిలే వాళ్ళంకాదు. మీ కారు నెంబరు మాదగ్గరుంది-"

నేను నవ్వి "వెలవు" అన్నాను.

3

ఇంటికి వెళ్ళలేదు నేను. చెక్‌పోస్టు దాటేక ఎందుకో నాలో కొత్త టెన్షన్ ప్రారంభమైంది.

తిన్నగా ఓ హోటలుకు వెళ్ళి రూం బుక్ చేసుకున్నాను.

రిసెప్షనిస్టుకు ఫోన్‌చేసి-"అమ్మాయిలు దొరుకుతారా?" అన్నాను.

"ఊఁ" అన్నాడతడు.

ఓ అమ్మాయిని గదికి రప్పించుకున్నాను.

అందమైన అమ్మాయి.

వయసు, నాజూకుతనం, చలాకీతనం — అన్నీ ఉన్నాయి.

అర్ధరాత్రి సమయంలోంచి తెల్లవారుఝాముకు మారుతోంది—అయినా నాకు మత్తులేదు. నిద్ర వచ్చేలాకూడా లేదు.

ఆ అమ్మాయితో సరదాగా గడిపాను.

ఆమె మంచిది.

నాలోని టెన్షన్ తగ్గడానికామె ఎంతగానో సహకరించింది. ఎన్నాళ్ళనించో ఎరిగున్నదానిలా నాతో ప్రవర్తించింది.

నే నామెకు ప్రత్యేకంగా థాంక్స్ చెప్పుకున్నాను.

ఆమె నవ్వి "థాంక్స్—నాకెందుకు" అంది.

"ఎందుకేమిటి? డబ్బు తీసుకున్నంత మాత్రాన నీ సాహచర్యం మరిచిపోతగింది కాదు" అన్నాను.

"నేను మీ దగ్గర డబ్బు తీసుకోను" అందామె.

"ఎందుకని?"

"నాకు డబ్బు ముట్టింది...."

"ఎలా?"

"నాకు నాగేశ్వర్రావుగారి ద్వారా డబ్బు ముట్టింది. నేను మీకు నచ్చితే మీరాయనకే థాంక్స్ చెప్పుకోవాలి" అందామె.

ఆశ్చర్యంనుంచి తేరుకునేందుకు నాక్కాసేపు పట్టింది. తేరుకున్న వెంటనే "నిన్ను నాకోసం నాగేశ్వర్రావుగారేర్పాటు చేశారా?" అన్నాను.

"అవును. లేకుంటే ఈ హోటల్లో అందరికీ ఇలాంటి సదుపాయాలుండవు" అందామె.

"అంటే?"

"ఈ హోటల్లో ప్రత్యేకమైన అతిథులకు తప్ప—ఆడపిల్లల సరఫరా ఉండదు. ఇంక మీరు నన్నింకేమీ అడగొద్దు...."

నా కర్థమయింది. నాగేశ్వర్రావు నన్ను గమనిస్తూనే ఉన్నాడు. నేనీ హోటలుకు రాగానే నాకోసం ఇక్కడీ ఏర్పాట్లు చేశాడు....

"కానీ ఆయనకూ నాకూ అంతగొప్ప స్నేహమేమీ లేదే? నీవు గొప్ప స్నేహితులకు మాత్రమే పరిచయం చేయతగ్గ యువతివి...."

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్" అందామె.

"నాది కాంప్లిమెంట్ కాదు. ప్రశ్న!" అన్నాను.

ఆమె నవ్వి "మీ రాయనకు గొప్ప స్నేహితులే అయుండాలి" అంది.

"ఎలా చెప్పగలవు?"

"నేను వచ్చేసరికి మీరు బాగా టెన్షన్‌లో ఉన్నారు. టెన్షన్‌లో ఉన్నవారికి రిలీఫ్ కావాలనే ఆయన నన్ను నియోగిస్తారు...." అని ఆమె ఓ క్షణమాగి "ఆయనకు గొప్ప స్నేహితులైతే తప్ప—ఆయన పనుల్లో సాయ పడరు. నాగేశ్వర్రావుగారికి పనుల్లో సాయపడినవారికి టెన్షన్ తప్పనిసరి...." అంది.

నాగేశ్వర్రావుకు నేను సాయపడ్డానా? ఎలా?

ఎంత ఆలోచించినా నా కర్థం కాలేదు.

ఆమె వెళ్ళిపోయింది. నేను నిద్రపోయాను మర్నాడు మధ్యాహ్నందాకా.

అప్పుడు లేచి స్నానాదులు ముగించుకుని హోటల్లోంచి బైటపడ్డాను.

నాకు నచ్చిన మరో హోటల్లో భోంచేశాను.

కార్లో ఎక్కడెక్కడో తిరిగాను.

ఇంటికి వెళ్ళాలంటే భయంగా వుంది.

నాతో నాలుగురోజులు గడిపిన దమయంతి శవంగా మారిపోయిందా యింట్లో - ఆ శవాన్ని నేనే స్వయంగా ఏటిలో కలిపాను.

ఎవరికెవరు ఋణమో?

రాత్రి మొదటాట చూసేక ఇంటికి వెళ్ళాను. కారును బంగళా ముందాపి తాళం తీసుకుని లోపల ప్రవేశించి హాల్లో లైటువేశాను.

నిన్నటి సంఘటన గుర్తుకొచ్చింది.

ఎందుకో ఒకసారి వళ్ళు జలదరించింది.

నాగేశ్వర్రావు నన్ను హెచ్చరించాడు. ఇరవైనాలు

గ్గంటలు టైమిచ్చాడు. ఆ టైములో నన్ను నమ్మిన దమయంతి దాక్షిణ్యంగా హత్య చేయబడింది. ఆమెను నేనే ఏట్లో కలిపాను. అందుకు ప్రతిఫలంగా నాగేశ్వరరావు నా కోసం మరో అమ్మాయి నేర్పాటు చేశాడు.

నేనాయనకు సాయపడ్డా నంటుం దామె.

అందులో నాగేశ్వరరావుకు సాయమేముంది!

ఆలోచిస్తూనే తలుపులు వేసి బెడ్రూంవైపుకు నడిచాను.

నాకూ—బెడ్రూంకి మధ్య అడ్డంగా తెర....

తెరను పక్కకు తొలగించాను.

మంచం చూడగానే నిన్నటి విశేషం గుర్తుకొచ్చింది.

మంచంపై దుప్పటిమీద రక్తపుచార ఉంది.

నేను మంచం మీదకు వెళ్ళి కూర్చున్నాను.

అప్పుడు నాకదో రకం వాసన వేసింది.

ఉలిక్కిపడ్డాను. అదోరకం వాసన....ఎలకో, బల్లో చచ్చిన వాసన....

గదంతా గాలించాను. ఎక్కడా ఏమీ కనబడలేదు.

అప్పుడు మంచం కిందకు తొంగిచూశాను.

ఎవరో మనిషిలా కనబడుతున్నారు....

ఉలిక్కిపడి బయటకు లాగాను........దమయంతి శవం!

అప్పుడు నాకు కలిగిన ఆశ్చర్య మింతా అంతా కాదు.

నా సమస్యింకా సమస్యలాగే మిగిలిపోయింది.

మరి - కారు వెనక సీట్లో పెట్టెలో పెట్టి నేను తీసుకుని వెళ్ళిందెవరిని? కొంపతీసి జూలీని కాదు గదా! □

నలిగిన మల్లెలు

బి. రాజేశ్వరి

భార్యను నెట్టుకుంటూ లోపలికి వచ్చాడు రాజు. సరాసరి పడగ్గదిలోకి వచ్చి తలుపుల వెనక, మంచం కింద దేని కోసమో దీక్షగా చూడసాగాడు.

లలిత భర్త వైఖరికి విస్మయంచెంది మౌనంగా అతని

చర్యల్ని గమనిస్తూండిపోయింది.

రాజు పెరటి తలుపు గడియ తీసి వుండటం గమనించాడు. ఒక్క అంగలో అక్కడికి చేరి తటాలున తలుపులు తెరిచి వీధిలోకి చూశాడు.

సన్నని గల్లీ అది; నిర్మానుష్యంగా ఉంది.

మధ్యాహ్నం రెండుగంటల సమయం. ఆ సమయంలో ఆఫీసులో ఉంటాడు రాజు. ఉదయం భోంచేసి వెళ్ళిపోతే సాయంత్రం ఆరుగంటలకే యిల్లు చేరేది. మధ్యలో ఎప్పుడూ ఇంటికి రాడు.

భర్త మౌనంగా వుండటం, వింతగా ప్రవర్తించటం లలిత మనసుని తెలియని భీతితో నింపేస్తున్నాయి.

చివరికి గొంతు పెకల్చుకుని "ఏమిటండీ వెతుకుతున్నారు?" అన్నది.

"పెరటి తలుపు తెరిచి వున్నదేం? ఇంత క్రితం ఇటు ఎవరైనా వచ్చి వెళ్ళారా?" భార్య ప్రశ్నకి ప్రశ్నే బదులన్నట్టు అడిగాడు.

"అబ్బే. ఎవరూ రాలేదు. ఎందుకూ అడుగుతున్నారు?"

"మరి తలుపెందుకు తెరిచి వున్నది?" భార్య కళ్ళలోకి తీక్షణంగా చూస్తూ అడిగాడు రాజు.

"అదే అర్థం కావటంలేదు. ఉదయం పాలవాడు వచ్చినపుడు తీసి మళ్ళీ వెయ్యటం మరచిపోయుంటాను" అన్నదామె.

పాలవాడు దొడ్డివైపు రావటం అలవాటే!

"అప్పట్నుంచీ అలా తెరిచే వుందంటావ్!"

"మరి ఆ తర్వాత ఎవరూ రాలేదు, యీవైపు."

"ఎవరూ రాలేదేం?! నన్ను నమ్మమంటావ్!"

"ఏమిటండీ మీరనేది! మీ మాటలు, చేష్టలు కొత్తగా వున్నా యీ రోజు."

"ఉంటాయుంటాయి. కొత్త కొత్త విషయాలు తెలుస్తున్నాయి కదూ!?"

భర్త మాటల్లోని వ్యంగ్యం ఆమె కర్థకావటంలేదు. తెల్లబోయి చూస్తూంది.

వచ్చినంత వేగంగాను వెనుతిరిగి బయటకు వచ్చి స్కూటర్ స్టార్టుచేసుకుని వెళ్ళిపోయాడు రాజు.

లలితకి అవమానంతో తల కొట్టేసినట్టనిపించింది.

దాదాపు వారం పదిరోజులుగా రాజు తనతో అంటీ ముట్టనట్టు ప్రవర్తిస్తున్నాడు. తనే పనిచేసినా శల్య పరీక్ష చేస్తున్నాడు. తను సరిగ్గా గమనించలేదుగాని, ప్రతిక్షణం అతని కళ్ళు తనలో ఏదో లోపాన్ని వెతుకుతున్నట్టే అనిపిస్తూంది. ఈరోజు ప్రవర్తనతో అది తారస్థాయికి చేరింది.

రాజు తనని అనుమానిస్తున్నాడా?

వేదనగా తల విదిలించింది లలిత. తనలో ఎలాంటి లోపంలేదు. మరెందుకు అనుమానిస్తున్నా డతను! తనలో ఏం దోషం కనిపించింది?

దుఃఖం తన్నుకొచ్చిందామెకు. వీధి తలుపు గడియ పెట్టి వచ్చి మంచంమీద బోర్లా పడుకుని కాసేపు వేదన తీరేవరకు ఏడ్చింది. మనసు తేలికయినట్టనిపించింది.

బాత్‌రూంకి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చి సోఫాలో కూలబడింది.

రాజుతో తనకి పెళ్ళయి అయిదేళ్ళు కావస్తూంది. పిల్లలు కలగలేదనే చింత తప్పితే తమ కెలాంటి లోటులేదు. తనకి పిల్లలు తప్పక కలుగుతారని, గర్భధారణ శక్తిలో

ఎలాంటి లోపంలేదని డాక్టర్లు చెప్పారు. సంసార జీవితం విషయంలో తా మిద్దరిమధ్య ఎలాంటి అసంతృప్తి లేదు.

మరి రాజు ప్రవర్తన ఎందుకిలా వింతగా వుంది? తన వంక అనుమానంగా, అవమానకరంగా ఎందుకు చూశాడు? దానికన్నా తనని నోటికొచ్చినట్టు తిట్టి కొట్టినా భరించేది.

ఆమె ఆలోచనలని చెదరగొడుతూ కాలింగ్ బజ్జర్ బర్రుమన్నది.

ఉలిక్కిపడింది లలిత. మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చారా యీయన? భయపడుతూ లేచి వెళ్ళి తలుపు తెరిచి ఉలిక్కి పడింది.

అక్కడ గుమ్మం పొడవునా నిల్చునివున్న వ్యక్తి భర్తకాదు. ముక్కు మొహం తెలియని మనిషి.

వెంటనే తలుపు సగం మూసి, "వారు లేరు...." అని ఏదో చెప్తుండగానే అతను ఎంతో చొరవగా ఆమెని దాదాపు తాకుతూ లోనికొచ్చి తనే తలుపు మూసేశాడు.

లలిత నివ్వెరపోయి అతన్ని వారించబోయింది. అతను చిద్విలాసంగా నవ్వుతూ. "అలా కూచో, నీకేం ప్రమాదం నానుంచి రాదని హామీ ఇస్తున్నాను" అన్నాడు.

"ఎవరు నువ్వు? ఏమి టీ దౌర్జన్యం? వెంటనే ఇక్కడ్నుంచి వెళ్ళిపో! లేకుంటే చుట్టుపక్కలవారి నందర్నీ పిలిచి అల్లరి చేస్తాను."

"అలా చేయటంవల్ల నష్టపోయేది నువ్వే! నీ అంతట నువ్వే నీ భర్త అనుమానాన్ని నిజం చేసిందాని వవుతావు."

త్రుళ్ళిపడింది లలిత. తన భర్త తన ననుమానిస్తున్నట్టు ఇతని కెలా తెలుసు? అసలు ఎవ రితను? స్వంత

మనిషిలా వచ్చి సోఫాలో బైఠాయించి చిద్విలాసంగా కబుర్లు చెప్తున్నాడు!?

"నువ్వు మాట్లాడేదేమిటో నా కర్థంకావటం లేదు. నీతో మాట్లాడవలసిన అవసరం నాకు లేదు. వెంటనే వెళ్ళు...." తలుపులు తెరవటానికి అటు అడుగువేసి అంతలోనే అతని చేతిలో తళుక్కుమన్న కత్తినిచూసి మెదలకుండా నిల్చుండి పోయింది.

అతను కోరగా నవ్వుతూ ఆమెవైపు నాలుగడుగులు వేసి "దీని అవసరం నాకు కల్పించవనే నమ్ముతున్నాను. మర్యాదగా ఇలా వచ్చి కూచో" అన్నాడు. అతని నవ్వు వెనక క్రౌర్యం, తెగింపు కనబడ్తున్నాయి.

లలిత చిగురాకులా వణికిపోతోంది. ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది.

"నీకేం కావాలి?" గొంతు పెకల్చుకుని అడిగిందామె.

"అలా అడుగు, చెప్తాను....నీభర్త నిన్ననుమానిస్తున్నాడు, అవునా?"

"అదంతా నీ కనవసరం."

"ఓహో, నాకు తెలిసిపోయిందని ఉలుకా? ....సరే, అసలు విషయానికొస్తాను. మీ ఆయనకి నీమీద అనుమానం పుట్టించింది నేనే!"

అదిరిపడింది లలిత. "నువ్వా? అందువల్ల నీ కేమిటి లాభం?"

"లాభం లేకుండా నే నేపనీ చెయ్యను" అతనేదో చెప్తుండగానే కాలింగ్ బెల్ చప్పుడయ్యింది.

ఇద్దరు ఉలిక్కిపడ్డారు. లలిత శ్వాస బిగబట్టింది. ఎవరయి వుంటారు? ఎవరైనా, తన కీ దుర్మార్గుడినుంచి రక్షణ దొరికితే చాలు!

అతను లలితవంక చూసి, "తలుపు తెరిచి చూడు. నేనందాకా నీ పడకగదిలో దాక్కుని చూస్తుంటాను. ఏమైనా పిచ్చివేషాలు వేస్తే నీ ప్రాణాలు, నీ భర్త ప్రాణాలు కూడా దక్కవు. ఏదో చెప్పి పంపెయ్యి" అన్నాడు.

అతను చటుక్కున పడకగదిలోకి తప్పుకున్నాడు. ఆ గదిలోనించి వీధి గుమ్మం చాలా స్పష్టంగా కనిపిస్తూంది.

లలిత మౌనంగా వెళ్ళి తలుపు తెరిచింది.

ఎదురుగా రాజు!

అతన్ని చూస్తూనే ముందుగా ఆమె కానందమే కలిగింది. కాని, అంతలోనే భయంవేసింది.

ఆమె నోరు తెరిచి ఏమీ చెప్పలేని పరిస్థితి!

రాజు భార్యవైపు తినేసేలా చూస్తూ, "తలుపు తెరవటాని కింతసేపా?" అన్నాడు.

"మీరనుకోలేదండీ!" అన్నదామె అనాలోచితంగా.

"ఆహా, ఎవరనుకున్నావేమిటి?" అన్నాడు వ్యంగ్యంగా. ఆమె ఇదంతా పట్టించుకునే స్థితిలో లేదు.

సరిగ్గా అప్పుడే ఆమె ఊహించని సంఘటన జరిగిపోయింది.

అంతవరకు దాక్కుని చూస్తూన్న ఆగంతకుడ్ని రాజు చూసేశాడు. "ఎవడ్రా అది?" అంటూ పడకగదివైపు ఉరికాడతను.

ఆగంతకుడు ఒక్కసారిగా అవతలి తలుపు తెరచుకుని దొడ్డివైపు పరుగెత్తడం, పెరటి తలుపు తెరుచుకుని గల్లీలోకి ఉరికెయ్యటం ఒకేసారి జరిగిపోయాయి.

రాజు పెరటి తలుపు చేరుకుని బయటికి చూశాడు. కాని అతని కెవరూ కనిపించలేదు. మెరుపు వేగంతో

లో పలికొచ్చి, ఊహించని సంఘటనకి, దిమ్మెరపోయి నిల్చుని ఉన్న భార్య చెంప పగిలేలా కొట్టాడు.

ఎన్నడూ భర్త చేత దెబ్బలు తినని లలిత అదురుపాటుతోను, అవమానంతోను నిలదొక్కుకోలేక పోయింది. తూలి నేలమీద పడిపోయింది.

"ఎవడువాడు? చెప్పు! ఎన్నాళ్ళుగా సాగుతోం దీ వ్యవహారం!?" అరిచాడు రాజు.

భీతహరిణంలా వణికిపోయింది లలిత.

"ఇంతక్రితమే కాలింగ్‌బజ్జర్ నొక్కితే ఎవరోనని తలుపు తెరిచాను. వీడు లోపలకొచ్చి కత్తి చూపించి బెదిరిస్తుండగా మీ రొచ్చారు."

"అబద్ధం....వాడు లోపలికొచ్చి దాదాపు ఇరవై నిమిషాలయింది. నేను వీధి చివర్నుంచి చూస్తున్నాను. నేనిందాకా వెళ్ళిపోయాననుకున్నావు కదూ!?....నిఘావేసి చూస్తున్నాను, నా అనుమానం నిరాధారం కాదని తేలిపోయింది...." అంటూ పడకగదిలోకి వచ్చి పరీక్షగా చూశాడు.

పక్క బాగా నలిగిపోయివుంది. పక్కమీద నలిగిన మల్లెపూలు, పగిలిన గాజులు కనిపించాయి. అవి లలిత వేసుకున్న గాజులేనని, ఆ మల్లెపూలు ఆమె జడలోవేనని చూడగానే తెలిసిపోతోంది.

నేలమీద కాల్చిపారేసిన సిగరెట్టు పీకలు నాలుగయిదు కనిపించాయి. అక్కడ ఓ మగాడు దాదాపు పదిహేను నిమిషాలు గడిపి వుంటాడనటానికి అవి తిరుగులేని సాక్ష్యాలు.

భర్త వెనకనే పడకగదిలోకి వచ్చిన లలిత విభ్రాంతపోయి చూసింది—నలిగిన పక్కను, పక్కమీది పూలని,

గాజు ముక్కల్ని, సిగరెట్ పీకలు కూడా ఆమె దృష్టిలో పడ్డాయి.

అంతక్రితమే నీట్‌గా సర్దిన పక్క అది. దానిమీద తను పడుకోలేదు కూడా. పగిలిన గాజులు, పూలు పక్క మీది కెలావచ్చాయి? ఆమెకి తల తిరుగుతోంది. ఏ క్షణం లోనైనా స్పృహ తప్పిపోయేలా ఉంది.

"నన్నింత వంచిస్తావని, నువ్వింత వగలాడివని నా కిన్నాళ్ళు తెలియదు. నా కళ్ళు తెరుచుకున్నాయి. నిన్ను నేనేమీ చెయ్యను. నాతో కాపరం నీ కిష్టం లేక పోయిం తర్వాత మనం విడిపోవటమే శ్రేయస్కరం....

విడాకు లిచ్చేవరకు నువ్వు నీ పుట్టింటికి వెళ్ళు....నీ నీడ కూడా నా మీద పడితే సహించలేను. ఈ ఇల్లు ఓ పవిత్ర దేవాలయంగా భావించాను. నిన్ను అందులో ఓ దేవతగా ఆరాధించాను. జీవితంలో ఎన్నడూ మరచిపోలేని పాఠం చెప్పావు. నేను ఆఫీసునించి వచ్చేసరికి 'నీవి' అనే వస్తువులేవీ నా కళ్ళ పడకూడదు. దటాల్స్!"

అతనేం చెప్తున్నాడో, ఎప్పుడు వెళ్ళిపోయాడో లలితకు ఒంటిమీద తెలివిలేదు.

2

"అక్కా నువ్వు చెప్తున్నది నిజమేనా!? బావ ఇంత దిగజారిపోయాడా? నిన్ననుమానించేటంత కుసంస్కారి అనుకోలేదు" రమేష్ ఆవేదనగా తల విదిలించాడు.

లలిత కళ్ళు ఎర్రగా ఉబ్బిపోయాయి, ఏడ్చి ఏడ్చి. ఒక్క రోజులో నే ఆమె వంద లంఖణాలు చేసిందానిలా బాగా కుంగిపోయింది.

భర్తతత్వం ఆమెకు బాగా తెలుసు. అతని కిష్టంలేని పని తను చెయ్యలేదు. తన మాట కే మాత్రం తేడా

వచ్చినా రాజు సహించడు. అందుకే ఆ సాయంత్రం ట్రెయిన్‌కి బయలుదేరి పుట్టింటికి వచ్చేసింది—చిన్న చీటీ భర్తకి రాసిపెట్టి.

తండ్రితో నిజం చెప్పటానికి ధైర్యం చాల్లేదు. తమ్ముడితో చెప్పుకుంది. తల్లిలేని లోటు ఆమెకీ సందర్భంలో పూడ్చుకోలేనిదిగా కనిపించింది.

అక్క చెప్పిందంతా విన్నాక రమేష్ తన అభిప్రాయం చెప్పాడు.

"ఇన్నాళ్ళూ నేనూ అనుకోలేదు. అయితే బావ పుర్రెకు పుట్టిన బుద్ధి కాదిది. ఆ దుర్మార్గుడు తనే బావకి నామీద లేనిపోనివి చెప్పి బావ మనసు విరిచేశాడు. మాటల్లో వాడే గొప్పగా చెప్పుకున్నాడు. అలా చేయటంవల్ల వాడికేం లాభమో తెలీదు."

"ఇంతకీ ఆ రోగ్ ఎవడు? వాడికి బావకి ఏమిటి సంబంధం? వాడు బావకి తెలిసిన వాడే అయితే బావని చూసి ఎందుకు పారిపోతాడు? అసలు ఉద్దేశమేమిటి? వాడిని ఇదివరలో ఎప్పుడైనా చూశావా?....కనీసం. నువ్వు కాలేజిలో చదువుకునే రోజుల్లోనో స్కూల్లో చదువుకున్న రోజుల్లోనో ...."

తల అడ్డంగా తిప్పింది లలిత.

"నాకో ఆలోచన వస్తోంది" అన్నాడు రమేష్.

"ఏమిటది?"

"బావ వాళ్ళ ఆఫీసులోనో బయటనో మరో అమ్మాయితో సంబంధం పెట్టుకుని ఉంటాడు. ఆమెను పెళ్ళాడటానికి నువ్వు ప్రతిబంధకంగా వుండటంవల్ల నిన్ను చట్టబద్ధంగా వదిలించుకోవటానికి మాస్టర్ ప్లాన్ చేసివుంటాడు. ఆ ఆగంతకుడు బావ స్నేహితుడో, ఆ అమ్మాయికి దగ్గిర

బంధువో అయుంటాడు. వాడితో కలిసి బావ తిరుగులేని పథకం వేసుంటాడు."

విస్తుపోయి చూసింది లలిత తమ్ముడివంక. అతని తార్కిక శక్తికి మరోసారైతే ఆమె ముచ్చట పడిపోయుండేది. కాని ఇప్పుడున్న పరిస్థితి వేరు: తనకిది జీవన్మరణ సమస్య.

"ఫీది కేవలం నిరాధారమైన అనుమానం మాత్రమే: నాకు తెలిసినంత వరకు బావ దారి తప్పలేదు. ఆయనే కావాలంటే నేను స్వచ్ఛంగా అడ్డు తప్పుకుని వుండేదాన్ని. ఇంత నీచమైన పథకం బావ కావాలని వెయ్యరు. ఏదో బలమైన కారణముండి ఉండాలి."

"అయితే అసేమిటో నేను స్వయంగా వెళ్ళి ఆరా తీస్తాను."

3

రమేష్ అప్పటికప్పుడు బయల్దేరి వెళ్ళాడు.

బావకు తెలియకుండా అతని ఆఫీసులోను, ఇంటి చుట్టుపక్కల అతని గురించి ఆరాతీశాడు. ఆఫీసులో అతనికి మంచి చరిత్ర వుంది. ఇంటి చుట్టుపట్ల వాళ్ళు కూడా అతని గురించి చెడుగా ఎలాంటి మాట చెప్పలేదు.

రాజు చాలా బుద్ధిమంతుడని, ఎలాంటి బలహీనతలు లేని పురుషోత్తముడని రమేష్ కర్థమయిపోయింది. మరి ఎక్కడుంది లోపం? ఎందుకతను అక్కయ్యను అనుమానాల్తో వేధించి పుట్టింటికి పంపేశాడు, ఎలా ఈ సమస్యను పరిష్కరించాలి?

ఎలక్ట్రానిక్స్‌లో బి.టెక్ చేస్తున్న రమేష్ మెదడు ఆలోచనలతో వేడెక్కిపోయింది. తన పరిశోధనలో రాజు దుర్మార్గుడని తేలటానికి బదులు ఉత్తముడని ఋజువయి

పోయింది.

రమేష్ రాజు ఇంటికెదురుగా ఉన్న పాన్‌షాప్ దగ్గిర నిల్చుని ఆలోచిస్తున్నాడు. అప్పుడు మధ్యాహ్నం రెండున్నర గంటలయింది.

అతని నిరీక్షణ ఫలించి ఓ ఆగంతకుడు రాజు ఇంటి గేటు తెరుచుకుని గుమ్మం ఎక్కి కాలింగ్‌బెల్ నొక్కుతున్నాడు. రెస్పాన్స్ రాకపోవటంతో తలుపుకున్న తాళం కప్పును గుర్తించి, తల పంకించి, మెట్లు దిగి పక్క ఇంటివాళ్ళ నేదో అడుగుతున్నాడు అతను.

రమేష్ ఊపిరి బిగబట్టి చూస్తూ చెవులు రిక్కించాడు. పక్కింటామె చెప్తున్న మాటలు లీలగా వినిపిస్తున్నాయి. అక్క పేరు దొర్లింది. ఊరు వెళ్ళిందని చెప్తోం దామె.

రమేష్ వెంటనే ఆ వ్యక్తిని పట్టుకుని సంగతి తేల్చేయాలనుకున్నాడు. కాని తొందరపడితే అంతా రసాభాసవుతుందని వివేకం హెచ్చరించింది.

ఆ వ్యక్తి వెనుతిరిగి వెళ్ళిపోతున్నాడు. రమేష్ కొంచెం దూరంలో అతన్ని వెంబడిస్తున్నాడు. అతనేదైనా వాహనం ఎక్కుతాడేమో, ఎలా అనుసరించాలి అనుకొంటూ నడుస్తున్నాడు. అయితే ఆ వ్యక్తి కాలినడకనే వెళ్తున్నాడు.

మెయిన్ వీధుల్లోంచి కాక పక్కసందుల్లోంచి వెళ్తున్నాడు. మధ్యలో ఓ పాన్‌షాప్ ముందు ఆగి మినీసైజ్ ఫిల్టర్ సిగరెట్ పాకెట్ కొన్నాడు. దాని బ్రాండ్ స్పష్టంగా గుర్తించాడు రమేష్. అలాంటి సిగరెట్ పీకలు తమ పడగ్గదిలో దొరికినట్టు అక్క చెప్పటం గుర్తొచ్చింది.

అంటే....వాడే వీడా?

రమేష్ ఉడుకురక్తం ఉరకలు వేసింది. ప్రతీకార

వాంఛతో అతని శరీరం రోమాంచిత మయ్యింది. పిడికిళ్లు బిగుసుకున్నాయి. ఆ క్షణంలోనే వాడిమీద పడి పీక నులిమి చంపెయ్యాలన్న ఆవేశాన్ని బలవంతాన అణుచు కున్నాడు.

ఆ వ్యక్తి ఓ ఇంటిముందు ఆగాడు.

రమేష్ సందు చివర ఆగిపోయాడు. అది చిన్న గల్లీ. ఆ గల్లీలో మరుగులేదు దాక్కోవటానికి. బయట పడి పోవాల్సి వుంటుంది—ఇంకా ముందుకి వెళ్తే.

ఆ వ్యక్తి మునివేళ్ళతో తలుపుమీద టకటక కొట్టాడు. ఓ నిమిషం తర్వాత తలుపులు తెరచుకున్నాయి. అతను లోపలకు ప్రవేశించి తలుపులు మూసేశాడు.

రమేష్ రెండంగల్లో ఆ ఇల్లు చేరుకున్నాడు. తను చేస్తున్నది దుస్సాహసమని అతనికి తెలుసు. ఈ మిస్టరీ ఏమిటో యీపూట తేల్చెయ్యాలి! ఆదే అతని కృత నిశ్చయం!

లోపల్నుంచి సన్నగా మాటలు వినిపిస్తున్నాయి.

"....పుట్టింటికి తరిమేశాడు. మన ప్లాన్ సక్సెస్...." ఆ మాటలు తనంతవరకు అనుసరించి వచ్చిన వ్యక్తివని గ్రహించాడు రమేష్.

కర్కశమైన నవ్వు వినిపించింది. "లేకపోతే దొంగ ముం.........పెద్ద పతివ్రత పోజు కొడ్తుందా? నా చెంప పగలగొడ్తుందా? పదిమందిలోను. నన్నవమానించినందుకు వడ్డీతో సహా ప్రతీకారం చెల్లించుకున్నాను. ఇక దాని బతుకు కుక్కలు చింపిన విస్తరే. రాజు పూర్తిగా వది లేసినట్టే!" ఆ మాటల్లో కసి, రాక్షసత్వం ధ్వనించాయి.

రమేష్ ఆ క్షణమే పోయి వాళ్ళిద్దర్నీ నరికేద్దామను

కొన్నాడు. ఇంతలో మళ్ళీ మాటలు వినిపించి ఆగి పోయాడు.

"రాజు నా ఫోన్ కాల్ కి అదిరిపోయి నిజంగానే వాడి పెళ్ళాం చెడిపోయిందనుకున్నాడు, దానికి తోడు నా నటనతో నాటకాన్ని క్లైమాక్స్‌కి తీసుకుపోయాను....ఇంతకీ నా కేది ప్రతిఫలం?!"

"కమాన్ లెటజ్ సెలిబ్రేట్!...." సీసా కార్క్ తీసిన శబ్దం, గ్లాసులో ద్రవం చేస్తూన్న వింత శబ్దం.

రమేష్ మొల్లో తడుముకున్నాడు. గట్టిగా తగిలింది కత్తి. ముందుచూపుతో దాన్ని వెంట తెచ్చుకున్నాడు. ఈ పోరాటంలో తన ప్రాణం పోయినా ఫరవాలేదు. అక్క సంసారం నిలబడితే చాలు!

మరో అయిదు నిమిషాలు అక్కడే ఫేచివున్నాడు రమేష్. వాళ్ళు బిగించే మందు బాగా తలకెక్కినాక తను వాళ్ళ కంటబడటం మంచిది!

తర్వాత మునివేళ్ళతో ఆ వ్యక్తి చేసినట్టే శబ్దం చేశాడు. ఓ నిమిషం తర్వాత తలుపులు తెరుచు కొన్నాయి.

మెరుపువేగంతో లోపలికి దూరి తలుపు బిగించి వాళ్ళ ద్దరిమీద దాడి చేశాడు రమేష్. స్వతహాగా బలిష్ఠుడైన రమేష్ ముష్టిఘాతాలకి, అప్పటికే నిషా బాగా తలకెక్కిన ఆ యిద్దరు వ్యక్తులు స్పృహతప్పి పడిపోయారు.

కత్తి అవసరం రానందుకు సంతోషించాడు రమేష్. వాళ్ళు యెదురుతిరిగితే చంపిపారెయ్యాలనుకున్నాడు. మళ్ళీ అంతలోనే వాళ్ళు చస్తే బావకి ఎప్పటికీ నిజం తెలియకుండా పోతుందని జంకాడు.

అది రెండు గదుల చిన్న ఇల్లు. లోపల మరో గది—

వంటగదిలా ఉంది! పెరట్లో గుడ్డలు ఆరేసుకునే నైలాన్ తాడు కనిపించింది. దాన్ని విప్పితెచ్చి వాళ్ళిద్దర్నీ కలిపి బలంగా కట్టేశాడు రమేష్.

తలుపులు అన్నివైపుల్నుంచి బంధించి, ముందుగదిలో వెతికి ఓ తాళంకప్ప తాళంతోబాటు సంపాదించాడు. తర్వాత బయటికొచ్చి తలుపుకు తాళం పెట్టి రోడ్డుమీది కొచ్చాడు.

మరో పది నిమిషాల్లో రాజు పని చేస్తున్న ఆఫీసుకి ఆటోలో వెళ్ళాడు. బావమరిదిని చూసి ముఖం చిట్లించు కున్నాడు రాజు.

రమేష్ అతన్ని వేడుకుని బయటకు తీసుకొచ్చాడు రాజు.

"ఎందుకొచ్చావ్?" అన్నాడు తిరస్కారంగా రాజు.

"రాయబారాలు నా దగ్గర పనికిరావు" అన్నాడు కరుగ్గా.

"బావా, దయచేసి నాతో రండి. మీకు ఓ తిరుగులేని నిజాన్ని చూపిస్తాను" అన్నాడు రమేష్ అతని చేతులు పట్టుకుని బతిమాలుతూ.

మొదట ఒప్పుకోలేదు రాజు. తర్వాత రమేష్ దీనంగా వేడుకోవటంచూసి ఏమనుకున్నాడో లోపలికివెళ్ళి వెంటనే బయటికొచ్చి "పద!" అన్నాడు.

రమేష్ మహదానందంతో బయట ఆపివుంచిన ఆటోలో రాజుని తీసుకుని ఆ యింటికి తీసుకువెళ్ళాడు. రాజు మౌనంగా అత న్ననుసరించాడు.

రమేష్ తలుపు తాళం తీసి లోపలకు అడుగు పెట్టాడు.

రాజు లోపలి దృశ్యం చూసి నిర్ఘాంతపోయాడు. కట్టి

పడేసిన వాళ్ళిద్దర్నీ గుర్తించాడు. మొదటివాడు తనింట్లో పడగ్గదిలో దూరినవాడు. రెండోవాడు....!?

ఉలిక్కిపడ్డాడు రాజు.

అవును....వాడే! తమ యింటి కెదురుగా వున్న యింట్లో వుండేవాడు. వాడ్ని ఓ సారి తన భార్య చెంప పగలగొట్టింది, అసభ్యంగా ప్రవర్తించినందుకు. వీధిలోని వాళ్ళందరూ వాడికి దేహశుద్ధి చేసి అక్కడ్నుంచి వెళ్ళగొట్టేశారు. అక్కడ్నుంచి వచ్చేసి యిక్కడ కాపరం పెట్టాడన్న మాట! వాడి బాధలు భరించలేక భార్య వదిలేసి పోయిందని చెప్పుకునేవారు. వాడి పేరు ప్రకాశ్.

అదంతా గుర్తొచ్చింది రాజుకి.

రమేష్ చన్నీళ్ళు తెచ్చి వాళ్ళ ముఖాన చిలకరించాడు.

వాళ్ళకి మెలకువ వచ్చింది.

కత్తి వాళ్ళ ముఖాల కానించి వాళ్ళిద్దరిచేత నిజాన్ని కక్కించాడు రమేష్.

ప్రకాశ్ నోట అసలు విషయాన్ని విన్న రాజు రమేష్ వైపు చూడలేక తల దించుకున్నాడు. ఆపుకోలేని ఆవేశంతో ప్రకాశ్‌ని, వాడి అనుచరుడ్ని అందిన చోటల్లా కాళ్ళతో తన్ని ముఖాలమీద ఉమ్మి, "పద రమేష్!" అన్నాడు రాజు.

బయటికొచ్చాక, "వెంటనే మీ ఇంటికి వెళ్దాం పద. మీ అక్క నన్ను క్షమిస్తుందంటావా?" అన్నాడు రాజు పశ్చాత్తాపం నిండిన కంఠంతో.

"అదేమిటి బావా, అక్క మీ కోసం పరితపిస్తోంది. కళ్ళలో ఒత్తులు వేసుకుని నిరీక్షిస్తోంది...." చెప్పాడు రమేష్.

□

నిజం నిద్దురపోయింది!

యస్.డి.వి. అజీజ్

సాయంకాలం ఆరుగంటల సమయం....!

కర్నూలు పట్టణానికి ఉత్తర సరిహద్దుగా ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన తుంగభద్రా నదీతీరాన అసహనంగా అటూ, యిటూ తిరుగుతూ వుంది శ్యామల. ఆమె మస్తిష్కంలో చెలరేగే ఆలోచనలన్నీ అతని గురించే!

అతను....ప్రదీప్....

ఓ నెలరోజుల క్రితం శ్యామలకు అతను నదీతీరాన్నే పరిచయం అయ్యాడు.

మొదట మాటలు కలిశాయి.

పిదప....

మనసులు కలిశాయి....

నేడు పెళ్ళి గురించి కలలు కంటున్నారు.

శ్యామల స్థానిక 'ఉజ్వల' దినపత్రికలో ప్రూఫ్‌రీడర్. నెలకు ఆరొందల జీతం!

శ్యామల ఉద్యోగం గురించి ప్రదీప్‌కు తెలుసు కాని ప్రదీప్ ఉద్యోగం గురించి శ్యామలకు అణుమాత్రమయినా తెలియదు. ఆమె ఎప్పు డడిగినా యేదో ఒకటి చెప్పి తప్పించుకొంటూ వుంటాడు ప్రదీప్. జీతం మాత్రం "నీ కంటే రెట్టింపు దొరుకుతుంది" అని మాత్రం అంటుం టాడు.

"ఈ రోజేమైనా సరే ప్రదీప్‌ను గురించి పూర్తి వివ రాలు తెలుసుకోవా"లని నిశ్చయించుకొంది శ్యామల.

కారణం?

గతరాత్రి ప్రదీప్‌తో తన పెళ్ళి విషయం తన తండ్రి రంగనాథం దగ్గర ప్రసక్తి తెచ్చినప్పుడు అతను ముందు కొంచెం చిరుబురు లాడినా చివరికి ఒప్పేసుకొన్నాడు. అయితే ఓ షరతు పెట్టాడు. ఆ షరతేంటంటే:

'అతని గురించి పూర్తి వివరాలు నాకు తెలిపిం తర్వాతే అతనితో నీకు వివాహమౌతుంది.'

ఈ షరతుకు ఆనందంగా ఒప్పేసుకుంది శ్యామల. అందుకే ప్రదీప్ దగ్గర్నుంచి ఎలాగయినా సరే పూర్తి వివ రాలు రాబట్టాలని నిశ్చయించుకుంది। అందుకే రోజూ

తాము కలుసుకొనే నిర్ణీతవేళ కంటే కొద్దిగా ముందుగానే వచ్చింది ప్రతిరోజు సాయంకాలం శ్యామల, ప్రదీప్‌లు ఆరున్నర తర్వాత అక్కడ కలుసుకొంటారు.

"శ్యామలా!"

ఎంతో అనునయంతో అప్యాయంగా పిలిచాడు ప్రదీప్ వెనుక వుండి శ్యామల భుజంపై మెల్లిగా చెయ్యివేసి.

ఒక్కమారుగా ఉలిక్కిపడి చప్పున వెనుతిరిగి చూసింది శ్యామల....ప్రదీప్....తన ప్రదీప్....అలవోకగా నవ్వుతూ నిల్చొని వున్నాడు.

శ్యామల కళ్ళల్లో కొత్త కాంతులు గమనించిన ప్రదీప్ మనసు పులకరించి పోయింది.

అవ్యక్తానందంతో అడిగాడు "ఏంటీ శ్యామలా ఈ రోజు విశేషం? నీ కళ్ళల్లో మున్నెన్నడూ చూడని కొత్త కాంతులు కనబడుతున్నాయి."

శ్యామల మనసాపుకోలేకపోయింది. గబగబా అదుర్దాగా అసలు విషయం చెప్పేసి అతని ఎదపై తల వాల్చి అంది "ఈ రోజున నీవు నీ గురించి అన్ని విషయాలు దాచుకోక చెప్పాలి."

ఆ పలుకులు ప్రదీప్ గుండెలో పలుగులై గుచ్చుకున్నాయి.

మనసు విలవిలలాడింది.

గుండెలో అలజడి మొదలయింది.

చల్లని మందమారుతం వీస్తున్నా అతని నుదుట చిరుచెమటలు పట్టాయి. తన గురించి ఎలా చెప్పాలో పాలుపోవడంలేదు ప్రదీప్‌కు. ఆ ప్రస్తావన మార్చాలని ప్రయత్నించాడు. అతను తప్పించుకొనే ప్రయత్నం చేసేకొద్దీ శ్యామల 'నీ గురించి వివరాలు చెప్పందే నిన్నొదిలేది లేదు'

అన్నట్టుగా అతని కళ్ళల్లోకి గుచ్చి గుచ్చి చూస్తూ మళ్ళీ మళ్ళీ అడిగింది.

"అయితే రేపు సాయంకాలం అయిదు గంటలకు నీవు నా గదికొస్తే - నా గురించి పూర్తి వివరాలు చెబుతాను" అన్నాడు ప్రదీప్ చివరకు.

2

"నమస్తే ఇన్‌స్పెక్టర్!"

మర్నాడు కోర్టులో సబ్మిట్ చెయ్యవలసిన ఓ క్రిమినల్ కేసు తాలూకు చార్జ్ షీటును ఫైనలైజ్ చేసుకొంటూ వున్న ఇన్‌స్పెక్టర్ అజయ్ తలెత్తి చూశాడు. ఎదురుగా ముగ్గురమ్మాయిలు....అజయ్‌లో విస్మయం, ఆశ్చర్యం ఒకేమారు కలిగాయి. వారి చేతుల్లో వున్న పుస్తకాలను చూసి 'కాలేజి అమ్మాయిలు' అని నిర్ధారించుకొన్న తర్వాత "కూర్చోండి!" అంటూ తన ఎదురుగా వున్న కుర్చీలను ఆఫర్ చేశాడు.

చార్జిషీటును టేబుల్ డ్రాయర్‌లో వుంచుతూ అడిగాడు "చెప్పండి! విశేష మేమిటి?"

ముగ్గురమ్మాయిలు ఒకరి ముఖా లొకరు చూసుకొన్నారు.

"నువ్వు చెప్పవే!"

"ఊహూఁ....నువ్వే చెప్పు!"

"నే చెప్పను....నువ్వు చెప్పు శైలూ!"

ఇద్దరి మధ్య కూర్చున్న 'శైలజ' అనే అమ్మాయి ఎక్కడలేని ధైర్యం తెచ్చుకొని కొద్దిగా ముందుకు వొంగి ఇన్‌స్పెక్టర్ అజయ్ వంక చూస్తూ చెప్పింది.

"ఇన్‌స్పెక్టర్‌గారూ! హత్య జరిగింది. ఓ ముసలతడ్ని ఎవరో చంపేశారు."

అదిరిపడ్డాడు అజయ్.

"వాట్?" అజయ్ కనుబొమలు పైకెగసాయి.

"అవును ఇన్‌స్పెక్టర్!" ఇంకో అమ్మాయి బదులిచ్చింది.

అజయ్ భృకుటి ముడిపడింది.

"ఎక్కడ?" ఉద్వేగంగా ప్రశ్నించాడు.

"రైల్వేస్టేషన్‌కు దగ్గరలో వున్న మా కాలేజీ దగ్గర."

"మీది ఏ కాలేజి?" నొసలు చిట్లించి అడిగాడు.

"కె. వి. ఆర్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీ."

శైలజ అనే అమ్మాయి తాము చూసిందేమిటో చెప్పింది.

ఇన్‌స్పెక్టర్ అజయ్ వారితో గబ గబా రిపోర్టు వ్రాయించుకుని....వారిని కూడ తీసుకుని తన సిబ్బందితో హత్య జరిగిన ప్రాంతానికి హుటాహుటిన తరలి వెళ్ళాడు.

హత్య జరిగింది కాలేజి పక్కన వున్న ఓ పెద్ద గుంటలో....హతుని తల చిట్లిపోయి వుంది. హంతకుడు హతుడ్ని చంపటానికి ఉపయోగించిన బండరాయి కూడ హతుని పక్కనే పడి వుంది. ఆ రాయి రుధిర వర్ణంలోకి మారి వుంది. హతునికి కుడివైపున కొన్ని కాగితాలు చెల్లాచెదరుగా పడివున్నాయి.

వాటి వంక నిశితంగా చూసాడు అజయ్. అతని మస్తిష్కంలో ఏదో అనుమానం తలెత్తింది. దగ్గరే వున్న కానిస్టేబుల్ వంక చూస్తూ సైగ చేశాడు.

ఓ కానిస్టేబుల్ శవం చుట్టూ పోగయిన జనాన్ని ప్రక్కకు తరిమాడు.

ఇంకో కానిస్టేబుల్ ఇన్‌స్పెక్టర్ కనుసైగల ఆజ్ఞను అందుకొని, క్రిందికి వంగి చెల్లాచెదరయిన కాగితాలను ఒకటిగా పేర్చి అజయ్‌కి అందించాడు. అజయ్ వాటిని అందుకుని జాగ్రత్తగా చూశాడు.

ఎవరి తాలూకో దస్తావేజులవి! గొలుసు వ్రాతలో వ్రాయబడి వున్నందున వాటిలోని విషయం అజయ్‌కు సరిగా అర్థం కాలేదు. వాటిని నిదానంగా చదివి ఆకళింపు చేసుకోవాలనుకొన్నాడు.

హతుని పాదాల దగ్గర ఓ ముతక ఖద్దరు సంఛి పడి వుంది. కానిస్టేబుల్ ఆ సంచిని అందుకుని అందులోని ఒక్కో వస్తువు బయటకు తీశాడు. అందులో ఒక జత బట్టలు ఓ పదిహేను ఏళ్ళ వయసున్న కుర్రాడి ఫోటో వుంది.

ఫోటోలో ఉన్న కుర్రాడి నుదుటిపై పెద్ద పుట్టుమచ్చ స్పష్టంగా అగుపిస్తూ వుంది. చాలాకాలం క్రితం తీసిన ఫోటో అది! ఫోటోపై అక్కడక్కడ మరకలు పట్టి వున్నాయి.

ప్రాథమిక పరీక్షలు జరిగిం తర్వాత శవాన్ని పోస్టుమార్టమ్ కోసం మార్చురీకి పంపించారు.

3

మర్నాడుదయం.

అజయ్‌కు హతుని తాలూకు పోస్టుమార్టమ్ రిపోర్టు అందింది. 'హతుడు సాయంకాలం నాలుగు అయిదు గంటల మధ్య చంపబడ్డాడు. హతుడు చనిపోయిన విధానాన్ని బట్టి చూస్తే హతుడ్ని చంపిన హంతకుడు చాల బలిష్టమయిన వ్యక్తిగా తెలుస్తూ వుంది.

హత్య జరిగిన ప్రాంతంలో దొరికిన వేలి ముద్రలు,

పాత నేరస్తుల వేలిముద్రలతో పోల్చిచూస్తే హంతకుడు పాత నేరస్థుడు కాదు. కొత్త వ్యక్తి అయివుండాలని తెలుస్తూ వుంది.

అజయ్ పోస్టుమార్టమ్ రిపోర్ట్సు, వేలిముద్రల నిపుణుడ్నుంచి వచ్చిన రిపోర్టు అందేలోపు హతుని దగ్గర దొరికిన ప్రాంసరినోట్లపై వ్రాయబడిన విషయాన్ని ఆకళింపు చేసుకున్నాడు. సంక్షిప్తంగా అందులోని విషయం ఇది:

"కర్నూల్ జిల్లా బనగానెపల్లి తాలూకలోని చెరువుపల్లె గ్రామంకు చెందిన నేను అనగా కట్ట సుబ్బరాయుడను నేను నా యావదాస్తిని కీ॥ శే॥ డైన నా•ఒక్కగా నొక్క కుమారుడు శ్రీ నారాయణరాయుడు కుమారుడు శ్రీప్రసాద్ బాబు పేర వ్రాస్తున్నాను. ప్రసాద్ తన పదునాలుగవ ఏట తండ్రితో ఘర్షణపడి ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. అతను ఎక్కడున్నది తెలుసుకొని ఈ యావదాస్తిని అతనికి ఒప్పజెప్పే బాధ్యత నా విశ్వాసపాత్రుడు శ్రీ రంగయ్యకు ఒప్పజెప్పడం జరిగింది. నా మనవడు దొరికేంతవరకు నా యావదాస్తిపై అజమాయిషీ శ్రీ రంగయ్యదే! నేటి నుంచి (1-9-76) పదిహేను సంవత్సరములలోపు నా మనవడు తిరిగి రాకపోతే నా యావదాస్తి కర్నూల్ పట్టణంలోని అనాథాశ్రమానికి చెందుతుంది. ఇది నా మనస్ఫూర్తిగా వ్రాయించిన వీలునామా

ఇట్లు
చెరువుపల్లె గ్రామ వాస్తవ్యుడు,
శ్రీ సుబ్బరాయుడు."

వీలునామా చదివి ఆలోచనలో పడ్డాడు అజయ్.

హంతకుడు ఎవరయి వుంటాడు?

దేనికోసం హత్య చేసుంటాడు?

డబ్బు కోసమా?

డబ్బు కోసమే అయితే అతన్ని అంత దారుణంగా చంపాల్సిన అవసరం వుండదు. ముసలాడే కాబట్టి బెదిరించి లొంగదీసుకుని డబ్బు గుంజుకోవచ్చు. మరి దేని కోసం హత్యచేసి వుంటాడు?

ఇతనికి గిట్టనివారు ఎవరయినా ఈ హత్య చేయించారా?

ఇలాంటి ప్రశ్నలతో అజయ్ మస్తిష్కం వేడెక్కిపోయే సమయంలో టేబుల్‌పైని ఫోన్ మ్రోగింది. విసురుగా ఫోను అందుకుని చిరాగ్గా అడిగాడు: "హలో ఎవరండి?"

"మీరు అర్జెంటుగా రైల్వేస్టేషన్‌కు వస్తే మీకో ముఖ్య విషయం చెబుతాను." అజయ్ భృకుటి ముడిపడింది.

"ఎవరు మీరు? ఏంటా ముఖ్యవిషయం?" ఆత్రంగా ప్రశ్నించాడు అజయ్.

"హత్య కేసు విషయం. ఉదయం మీరు కేసు నమోదు చేసుకున్న హత్యకేసు విషయం. ఆ కేసుకు సంబంధించిన కొన్ని వివరాలు నే నందివ్వగలను. వస్తారా?"

"తప్పకుండా వస్తాను. ఇంతకు ఎవరు మీరు?"

"మీరు వస్తే మీకే తెలుస్తుంది నే నెవరినో?"

"మిమ్మల్ని నేనెలా గుర్తుపట్టేది?"

"మీరు స్టేషన్‌లోకి రండి చాలు. నేనే వచ్చి మిమ్మల్ని పలుకరించి పరిచయం చేసుకుంటాను."

"అయితే ఇప్పుడే వస్తాను."

"అలాగే.... మీకోసం ఎదురు చూస్తూ వుంటాను."

అవతలి వ్యక్తి ఫోన్ పెట్టేసిన శబ్దం వినిపించింది.

అజయ్ కూడ ఫోన్ పెట్టేసి పక్కనే కొద్ది దూరంలో స్టూల్‌పై కూర్చొని కునికిపాట్లు పడుతున్న కానిస్టేబుల్ దగ్గిరికెళ్ళి తన చేతిలోని రూలుకర్రతో అతని భుజంపై చిన్నగా చరిచాడు.

అంతే!

అతను ఒక్కమారుగా తుళ్ళిపడి క్రిందపడబోయాడు. అతను క్రిందపడకుండా చప్పున వొడిసిపట్టుకొన్నాడు అజయ్ అతని కునికిపాటు ఎగిరిపోయింది.

ఎదురుగా నిల్చున్న ఇన్‌స్పెక్టర్ అజయ్ వంక బిక్కచచ్చిపోయిచూస్తూ "సారీ!" అంటూ గుటకలు మింగాడు.

"ఎన్నిసార్లు చెప్పాలయ్యా నీకు! స్టేషన్‌లో నిద్ర పోవద్దని! అదీగాక నా ముందే నిద్రపోతావేమయ్యా నీవు? అంతగా నీకు నిద్రపై మక్కువ వుంటే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి ఇంట్లో రేయింబవళ్ళు నిద్ర పో!"

"సారీ సార్" తలవొంచుకొని అన్నాడా కానిస్టేబుల్.

"ఇంకోమారు ఇలా కునికిపాట్లుతో కనిపించావో నిన్ను సస్పెండ్ చెయ్యడం ఖాయం గుర్తుంచుకో! నే అర్జెంటుగా రైల్వేస్టేషన్ కెళ్తున్నాను. ఏదైన అర్జెంటు మెసేజ్‌వస్తే అక్కడికి ఫోన్‌చేసి నన్ను పిలవమని చెప్పు! నేనక్కడే వుంటాను. గుర్తుందా?" అజయ్ అతనివంక సూటిగా చూస్తూ అన్నాడు.

"గుర్తుంది సార్" అలవాటు ప్రకారం శెల్యూట్ కొడుతూ అన్నాడు. అజయ్ అతని శెల్యూట్ గురించి పట్టించుకోకుండా వడివడిగా అడుగులువేస్తూ బయట పార్కుచేసి వున్న మోటర్ బైక్ స్టార్ట్‌చేసి రైల్వే స్టేషన్‌వైపు పోనిచ్చాడు.

4

అజయ్ రైల్వేస్టేషన్ చేరుకోవడానికి పావుగంట పట్టింది. మధ్యలో బైక్ ఆపి పెట్రోలు పోయించుకోవడం వల్ల. రైల్వేస్టేషన్ చేరుకొన్న అజయ్ మోటర్‌బైక్ స్టేషన్‌ముందు ఆపి వడివడిగా అడుగులు వేసుకొంటూ ప్లాట్‌ఫాం వైపు నడిచాడు. అప్పటికే అతని రాకను గమనించిన ఓ అపరిచిత వ్యక్తి అజయ్ ముందు ప్రత్యక్ష మయి పలుకరించాడు. అజయ్ ఆ అపరిచిత వ్యక్తి వంక అనుమానస్పదంగా తేరిపార జూస్తూ అడిగాడు "ఇందాక ఫోను చేసింది మీరేనా?"

అవునన్నట్టుగా అతను చిన్నగా తలాడించి చెప్పాడు. "నా పేరు రంగయ్య. ఇక్కడ క్యాంటీన్ నడుపుకొంటున్నాను. నిన్న సాయంకాలం నాలుగంటలప్పుడు హత్యగావించబడ్డ ముసలాడు ఇంకో కుర్రాడు....ఇద్దరు కలసి వచ్చి నా దగ్గిర కాఫీ తాగారు. ఓ పావుగంటసేపు నా క్యాంటీన్ ముందే నిలబడి మాట్లాడుకొన్నారు. బహుశ ఆ కుర్రాడే ఈ హత్యచేసి వుండొచ్చని నా అనుమానం?"

"ఏమని మాట్లాడుకొన్నారు?" ఉద్వేగంగా ప్రశ్నించాడు అజయ్.

"వారేం మాట్లాడుకొన్నది నే నంతగా వినలేదు. పట్టించుకోలేదు. అయితే ఒక్క మాట మాత్రం ముసలాడి నోట విన్నాను. అది మాత్రం బాగా గుర్తు! చెప్పమంటే చెబుతాను" అన్నాడు రంగయ్య, అజయ్‌వంక చూస్తూ.

"చెప్పండి!" ఆదుర్దాగా ప్రశ్నించాడు అజయ్.

ఆ మాటేంటో చెప్పాడు రంగయ్య.

'బాబూ! ఓ కుర్రాడికోసం వెతుక్కొంటూ ఈ వూరొచ్చాను.'

"ఎవరా కుర్రాడు? చెప్పాడా?"

"తెలియదు. ఆ ఒక్కమాట మాత్రమే విన్నాను."

"ఆ ముసలాడి వెంటవున్న ఆ కుర్రాడికి ఎంత వయసుండొచ్చు?" ఏదో జ్ఞాపకం చేసుకొంటూ అడిగాడు అజయ్.

"సుమారు మీ వయసుండొచ్చండి!"

అజయ్ వయసు పాతిక.

రంగయ్య హంతకుడు ఎలా వుంటాడో వర్ణించడం మొదలుపెట్టాడు.

"కుర్రాడు చూడ్డానికి అందంగానే వుంటాడు. చామన చాయ. ఉంగరాలజుత్తు, కోరమీసం, తెల్లటి దుస్తులు వేసుకొని వున్నాడు."

"ఇంకేమైనా గుర్తులున్నాయా మచ్చలాంటివి?" రంగయ్య కళ్ళల్లోకి సూటిగా చూస్తూ ప్రశ్నించాడు అజయ్.

"నేనంతగా గమనించలేదండి. కాని నుదుటిమీద గాయపు మచ్చో....పుట్టుమచ్చో వున్నట్టు గుర్తు. కుర్రాడి ఉచ్చారణ చాల చక్కగావుంది. ప్రతి పలుకులో ఎదుటి వ్యక్తిని ఆకర్షించే అందం, అణుకువ వున్నాయి."

"మీరు నిన్నే ఎందుకు ఫోను చెయ్యలేదు?"

"నా కీ ఆలోచన రాలేదు"

"ఇంకేమైనా చెప్పగలరా? అతని గురించి."

రంగయ్య కాసేపు కళ్ళుమూసుకొని....ఆ కుర్రాడి రూపాన్ని మరోమారు స్మరణకు తెచ్చుకొని చెప్పాడు "ఇంతకంటే ఇంకేం చెప్పలేను ఇన్‌స్పెక్టర్‌గారు?"

అజయ్ మస్తిష్కంలో మథనం మొదలయ్యింది.

"నా వెంట వస్తారా?" రంగయ్యవంక చూస్తు అన్నాడు అజయ్.

"ఎక్కడికి?" విస్తుపోతూ ప్రశ్నించాడు రంగయ్య.

"పోలీస్ స్టేషన్‌కు."

"ఎందుకు?" భయపడుతూ అడిగాడు రంగయ్య.

అజయ్ 'భయపడవద్దు!' అన్నట్టుగా అతని భుజం చిన్నగా చరచి నవ్వుతూ చెప్పాడు. "కొందరు హంతకుల ఫోటోలు చూపిస్తాను. వాటిల్లో నువ్వు చెప్పిన కుర్రాడేమైన వున్నాడేమో గుర్తు పట్టగలవా?"

"ప్రయత్నిస్తాను" చేతులు నులుపుకొంటూ అన్నాడు రంగయ్య.

"అయితే వెళదాం పద!"

క్యాంటీన్‌ని తన క్రింద పనిచేసే కుర్రాడికి అప్పగించి అజయ్ వెంట పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళాడు రంగయ్య.

క్రిమినల్స్ తాలూకు ఫోటోలన్నీ తీసి రంగయ్య ముందుంచాడు అజయ్.

రంగయ్య వాటివంక పరీక్షగా చూశాడు. అందులో తాను వెనుకటి రోజు స్టేషన్‌లో చూసిన కుర్రాడి ఫోటో లేదు. ఆ విషయమే చెప్పాడు. అజయ్ చిన్నగా నిట్టూర్చి వేడిగాలి బయటికి వొదిలాడు.

"ఇక నే వెళ్ళమంటారా సార్?" అజయ్‌వంక అదోలా చూస్తూ అన్నాడు రంగయ్య.

"వెళ్ళరండి! అయితే మీరు మే మెప్పుడు పిలిస్తే అప్పుడు స్టేషన్‌కు రావల్సివుంటుంది."

రంగయ్యలో కంపనం మొదలయ్యింది.

అజయ్ మళ్ళీ చెప్పాడు "అదే. హంతకుడ్ని గుర్తు పట్టడానికి"

రంగయ్య కంపనం కొద్దిగా తగ్గింది.

"వస్తానండి!"

"మంచిది....ఈ కేసులో మీ వంతు సహాయం చేసి నందుకు థ్యాంక్స్!" అంటూ అతనివంక కృతజ్ఞతా పూర్వకంగా చూశాడు అజయ్.

రంగయ్య పెదాలపై సన్నటి చిరునవ్వు!

5

సాయింకాలం నాలుగు గంటలవేళ!

టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫోను మ్రోగింది.

"హల్లో!"

"ఈజ్ ఇట్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్."

"యస్...."

"హూ ఆర్ యూ?"

"ఇన్‌స్పెక్టర్ అజయ్ స్పీకింగ్"

"గుడీవినింగ్ అజయ్‌కుమార్‌గారు!"

"గుడీవినింగ్....ఎవరు మీరు?"

"నేనెవరైంది ఓగంట తర్వాత మీకే తెలుస్తుంది. నే చెప్పేది వింటారా?"

"చెప్పండి!"

"ఇంకో అరగంటలో బి. క్యాంప్ నుంచి ఓల్డు బస్టాండ్‌కు ఓ సిటీబస్సు బయల్దేరబోతుంది. ఆ బస్సులో నీలం రంగు చీరె—అదే రంగు జాకెట్టు నుదుట కూడ అదే రంగు బొట్టు పెట్టుకున్న ఓ అమ్మాయి ప్రయాణమై వస్తుంది. ఆ అమ్మాయిని మీరు ఫాలో అవుతూ వస్తే నేనెవరో మీకు తెలుస్తుంది" ఫోను పెట్టేసిన శబ్దం వినిపించింది.

వెళ్ళాలా? వద్దా? ఆలోచనలో పడ్డాడు అజయ్.

చివరికి వెళ్ళడానికి నిర్ణయించుకొన్నాడు.

మఫ్టీలో అజయ్ ఇద్దరు కానిస్టేబుల్స్‌ను వెంట తీసుకుని

నాలుగు ఇరవై అయిదు నిముషాలకు బి.క్యాంప్ సిటీ బస్టాప్ చేరుకున్నాడు. నాలుగు నిముషాలు అటు ఇటు దిక్కులు చూస్తూ గడిపాడు. 4.39 ని॥ ఎనిమిదో నెంబర్ సిటీబస్సు వచ్చి ఆగింది.

ముగ్గురూ బస్సెక్కారు. బస్సు ముందుకు కదిలింది, 'రైట్' అన్న కండెక్టర్ కేకతో.

అజయ్ బస్సులోని ప్రయాణీకుల వంక తేరిపార జూశాడు. ముందుసీట్లో కూర్చుని వుంది నీలం రంగు చీరె కట్టుకొన్న అమ్మాయి. ముందుకు వెళ్ళి ఆమెవంక అదోలా చూశాడు.

శ్యామల దృష్టి మరల్చుకుంది.

అజయ్ దృష్టి ముందుకు సారించాడు. అతని అణువణువులో ఉద్వేగం! ఉద్రిక్తత!!

బస్సు అయిదారు స్టేజిలు దాటింది. మధ్యలో శ్యామల ఎక్కడా దిగలేదు.

నాలుగు నలభైకి బస్సు ఓల్డు బస్టాండ్ చేరుకుంది.

శ్యామల బస్సు దిగి అటు ఇటు చూసింది. తనకు తెలిసినవారు ఎవరైనా అగుపిస్తారేమోనని.

దూరాన తాను పనిచేస్తున్న పత్రికలో డైలీ సీరియల్ 'వనజ' వ్రాస్తున్న రచయిత మాత్రం అగుపించాడు. అతని చూపులన్నీ ఎటో వున్నాయి.

'అతను తనవైపు చూడ్డం లేదు' అని గ్రహించిన శ్యామల వడివడిగా అడుగులు వేస్తూ పరుగులాంటి నడకతో అక్కడ్నుంచి ఓ ఫర్లాంగ్ దూరం నడిచి జిల్లా మున్సిఫ్ కోర్టుకు ఎడమవైపున అయిదో నెంబర్ ఇంటిముందు ఆగింది.

ఓమారు గుండెల నిండుగా ఊపిరి పిల్చుకుని తలుపు

తట్టింది.

ఓ నడివయసు వ్యక్తి తలుపు తీశాడు. అతని పేరు రాజు. కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో ఆడిటర్. ఆ ఇంటి వోనర్ అతనే! అతని ఇంట్లోనే మేడపైని గదిలో ప్రదీప్ అద్దెకుంటున్నాడు. అతను శ్యామలవంక చిరునగవుతోచూస్తూ అడిగాడు. "ప్రదీప్‌కోసం వచ్చావమ్మా?"

అవునన్నట్టుగా తలూపింది శ్యామల, చిన్నగా నవ్వి.

శ్యామల ప్రదీప్ వెంట ఓ అయిదారు సార్లు రావడం అతను చూడ్డంవల్ల, ప్రదీప్‌కు శ్యామ లెవరో, తన కేమౌతుందో చెప్పి పరిచయం చెయ్యక తప్పింది కాదు.

"మేడపైని గదిలో వున్నాడు వెళ్ళు!"

శ్యామల గబగబా మేడమెట్లెక్కి పైకి వెళ్ళింది. శ్యామలపైకి వెళ్ళగానే అంతవరకు దొంగల్లా తలుపు చాటునే పొంచివున్న ముగ్గురూ లోపలికొచ్చారు.

అజయ్ రాజును నిలదీసి అడిగాడు.

తన జేబులో వున్న విజిటింగ్ కార్డును అతని చేతిలో వుంచి.

రాజు వున్నది చెప్పాడు.

"రెణ్నెల్ల క్రితం మా మేడపైన గదిలో అద్దెకు దిగాడు. పేరు ప్రదీప్. మంచి కుర్రాడు. ఏదో బిజినెస్ చేసుకొం టున్నాడు."

"ఇందాక పైకి వెళ్ళిందే ఆమె ఎవరు?"

"అతనికి కాబోయే భార్య. పేరు శ్యామల. ఇక్కడి స్థానిక దినపత్రిక 'ఉజ్వల' లో ప్రూఫ్‌రీడర్."

"ఇప్పుడెందుకు పైకెళ్ళింది?"

"తెలియదు."

"మేమతన్ని కలుసుకోవాలి."

"ఎందుకు?" నొసలు చిట్లించి అనుమానంగా అడిగాడు రాజు.

"అవసరం వుంది."

రాజు ఇంకేం అడగలేదు.

"రండి వెళ్దాం!" అంటూ మేడ మెట్లెక్కడం ప్రారంభించాడు.

ముగ్గురూ అతన్ని అనుసరిస్తూ పైకి వెళ్ళారు.

"ప్రదీప్ తలుపు తెరు....నేను శ్యామలను వచ్చాను" గట్టిగా అరుస్తూ తలుపు బాదుతూ వుంది శ్యామల. అలా శ్యామల గట్టిగా అరుస్తూ తలుపులెంతగా బాదుతున్నా లోపలినుండి ఎలాంటలికిడి రావడంలేదు. తలుపులు తెరుచుకోవడం లేదు.

శ్యామలలో భయాందోళనలు ఒక్కమారుగా పెల్లుబికాయి. వెనుతిరిగి రాజువంక చూస్తూ అంది "చూడండి! ఎంత పిల్చినా తలుపు తియ్యడంలేదు. నాకేంటో భయంగా వుంది" ఆమె పలుకుల్లో తొట్రుపాటు, కంగారు, కలవరం!

అందరిలోనూ అనుమానం మస్తిష్కాన్ని చుట్టేసింది.

నలుగురు తలుపులు బాదారు. అయినా ఫలితం శూన్యం!

అందరు కలసి ఒక్కుమ్మడిగా కలసి తలుపులపై తమ బలాన్ని ప్రయోగించారు. మరు నిముషాన్నే అంత వరకు మూసివున్న తలుపులు 'దభీ' మంటూ పెద్ద శబ్దం చేస్తూ విరిగి ముందుకు పడ్డాయి. లోపలికి పరుగెత్తుకు వెళ్ళి హృదయవిదారకమైన ఆ దృశ్యాన్ని చూసి చలించిపోయి స్థాణువు లయ్యారు.

రక్తపు మడుగులో నిర్జీవంగా పడివుంది ప్రదీప్ శవం!

. అతని పొత్తికడుపులో బలంగా దిగబడివున్న కత్తి!! ఈ ఘోర దృశ్యాన్ని చూసి భరించలేని శ్యామల కెవ్వున కేకవేసి స్పృహ తప్పింది.

రాజు శ్యామల క్రిందపడకుండా ఒడిసి పట్టుకున్నాడు.

అజయ్ దృష్టి ముందుకు సారించాడు. కొద్దిదూరంలో టేబుల్‌పై ఓ ఉత్తరం ఫ్యానుగాలికి రెపరెపలాడుతూ వుంది. అజయ్ ఒక్క ఉదుటున వెళ్ళి ఆత్రంగా ఆ ఉత్తరాన్ని అందుకొన్నాడు. అందులో....

"శ్యామలా!

నేనో దొంగను. గజదొంగను. ఎన్నో దొంగతనాలు చేశాను - అయినా ఇప్పటిదాక చట్టానికి దొరక్కుండా తప్పించుకొంటూనే వున్నాను. చెడు స్నేహితుల ప్రభావంవల్ల చిన్ననాడే చెడిన నేను, ఓ రోజు మా యింట్లోనే మా అమ్మ నగలు దొంగతనం చేస్తూ మా తండ్రికి పట్టుబడి, చావుదెబ్బలు తిని ఇంట్లో నుంచి పారిపోయాను. ఏ ఆధారం లేని నాకు దొంగతనమే ఆధారమయ్యింది. చివరికి అదే వృత్తి ప్రవృత్తి అయ్యింది.

అప్పట్నుంచి అనేకరకాల దొంగతనాలు చేస్తూ అటు ప్రభుత్వాన్ని, ఇటు ప్రజల్ని మోసం చేస్తూ నా మజిలీలో భాగంగా ఈ వూరొచ్చాను. వచ్చిన రోజే నీ వగుపించావు. నా హృదయంలో స్థానం ఏర్పరచుకొన్నావు. నిన్ను చూసిం తర్వాత నాలో ఏదో తెలియని మధురభావం ఏర్పడింది. ఆ భావం

అవ్యక్తం! ఎలాగయినా సరే నీతో పరిచయం చేసుకోవాలనిపించింది. చేసుకొన్నాను.

నీవు సహృదయతతో కూడిన నీ స్నేహంతో పాటు నిష్కల్మషమైన నీ ప్రేమను కూడ అందించావు. ఆ ప్రేమను 'పెళ్ళి' అనే బంధం ద్వారా శాశ్వతం చేసుకోమన్నావు. కాని నేను నీ ప్రేమను శాశ్వతం చేసుకోలేక వెళ్ళిపోతున్నాను.

కారణం?

మొన్నటివరకు నేనో దొంగని మాత్రమే! కాని నిన్నటి నుంచి హంతకుడ్ని కూడా అయ్యాను. నా వృత్తి ప్రకారం ఓ ముసలాడ్ని వంచించి అతని దగ్గిర్నుంచి డబ్బు లాక్కో చూశాను. అతను ఇవ్వలేదు. బెదిరించాను. బెదరలేదు.

ఫలితం?

నాలో పిచ్చి ఆవేశం కలిగింది.

ఆ ముసలాడ్ని అమానుషంగా ఘోరంగా ఓ పెద్ద బండరాయితో కొట్టి చంపాను. అయినా అతన్నుంచి నా కేమి లభించలేదు. ఓ ఫోటో, కొన్ని ప్రాంసరి నోట్లు తప్ప. అవి అక్కడే విసిరికొట్టి వచ్చేశాను. రూంకు వచ్చిం తర్వాత ఎన్నడెరుగని బాధను అనుభవించాను. ఆ బాధ నాలో ని అణు వణువుకు సోకి నన్ను కలచివేసింది. ఒకరితో మనసు విప్పి చెప్పుకోవడానికి కూడా వీలులేని పరిస్థితి నాది. నీతో చెప్పుకొంటే నీ ప్రేమ ఎక్కడ కరువైపోతుందో నన్న భయం!

అటు నీతో చెప్పుకోలేక ఇటు నాలో నేను

కుమిలిపోతూ ఎంతటి మానసిక క్షోభను, నరక యాతన్ను అనుభవించానో ఆ భగవంతునికే తెలియాలి. ఆ బాధ భరించలేని నేను తల చిట్లిపోయేంతవరకు గది గోడకు తలను కొట్టుకోవాలనిపించింది. కాని ఎందుకో అలా చెయ్యలేకపోయాను. చివరికి పొడుచుకొని చావాలనిపించింది అదే ప్రకారంగా చస్తాను.

శ్యామలా!

చచ్చేముందు నాదో మాట! నీవు నా గురించి పూర్తిగా మరచిపోవాలి. మన మధ్య జరిగింది ఓ పీడకలగా భావించి ఆత్మస్థైర్యంతో నీ జీవితాన్ని సుఖమయం చేసుకో! మరి నీవు నా ఈ ఆఖరి మాటను తప్పకుండా మన్నిస్తావు కదూ!

ఇట్లు
నీ ప్రేమను పొందలేని
ఓ దౌర్భాగ్యుడు
ప్రదీప్."

ఉత్తరం చదవడం పూర్తిచేసిన అజయ్ భృకుటి ముడి పడింది. అనుమానం బలపడింది. దగ్గరగా వెళ్ళి విగత జీవుడైనా ప్రదీప్ నుదుటిపంక పరీక్షగా చూశాడు.

అతడనుకొన్నది నిజమయ్యింది. మనసులోనే చిన్నగా గొణుక్కున్నాడు, 'ఏ మాత్రం సందేహం లేదు. ఇతను చెరువుపల్లె సుబ్బరాయుడు మనువడు ప్రసాదే!' ప్రదీప్ నుదుటిపై పెసరగింజంత వున్న పుట్టుమచ్చను తదేకంగా చూస్తూ—!!

□

ప్రతాప రవిశంకర్

సీరియల్

మహా యాత్ర

(గత సంచిక తరువాయి)

అప్పుడు నరేంద్ర జవాబు చెప్పలేదు ఆయనకు —

చచ్చిపోయిన ఎలుగుబంటి - తల తెగిపోయిన కొండ చిలువ వికృతంగా వాళ్ళముందు పడివున్నాయి.

"నీకు తుపాకీ పేల్చటం కూడా నేర్పుతాను. నేర్చుకుంటావా?" అనడిగాడు ఎడ్వర్డ్.

వద్దన్నాడు నరేంద్ర.

"కాదు....తుపాకి పేల్చటం కూడా నేర్చుకోవటం మంచిది. ఎప్పుడైనా ఉపయోగపడుతుంది. గురి చూడటం- తుపాకీ పట్టుకోటం వస్తే చాలు. పేల్చటం కష్టంకాదు.... ఇప్పుడే నేర్పుతాను. ఈ చెట్లమధ్యనించి బయటకు వెళదాం."

ఇద్దరూ మళ్ళీ ఆ అడవిలోనుండి బండీవున్న ప్రదేశానికి వచ్చారు

కత్తిని బండీలో పడేశాడు.

ఎడ్వర్డ్ తుపాకీని ఇచ్చాడు నరేంద్రకు. ఎందుకో అతని చెయ్యి వణికింది దాన్ని అందుకుంటున్నప్పుడు—

జీవితంలో ఎప్పుడైనా తుపాకీ పేల్చటం ఉపయోగపడుతుందా:—ఆలోచిస్తూనే దాన్ని అందుకున్నాడు.

కొంచెంసేపట్లోనే—ఢాం—అన్న తుపాకీ కూత ఆ ప్రాంతంలో మార్మోగింది.

34

ఖైదీలు ఎదురు చూసిన ఆ రోజు వచ్చేసింది.

జపాన్‌వాళ్ళ దాడి అండమాన్‌దీవులమీద విజయవంతంగా ముగిసిపోయింది....ఆ దీవి మొత్తం వాళ్ళ ఆధీనంలోకి వచ్చేసింది.

ఖైదీలు ఎదురు చూసినట్టుగానే జపాన్‌వాళ్లు వాళ్ళందరినీ స్వతంత్రులుగా పరిగణించి జైలునించి విడుదల చేశారు.

నరేంద్రకు గాల్లో తేలిపోతున్నట్టుగా అనిపించింది. గాల్లోనే ఎగిరి భిలాస్‌పూర్‌కు వెళ్ళిపోతే బాగుంటుందనుకున్నాడు.

ఆ రోజు ఖైదీలంతా అండమాన్ దీవిలో స్వేచ్ఛగా కాళ్ళు అరిగిపోయేట్టుగా తిరిగారు. ఖైదీలందరూ ఎవరి ప్రాంతానికి వాళ్ళు వెళ్ళే ప్రయత్నాల గురించి ఆలోచించటం మొదలు పెట్టారు.

ఎడ్వర్డ్‌ను కలుసుకున్నాడు నరేంద్ర....

అతడి మొహంలో సంతోషాన్ని గుర్తించాడాయన.

"జైల్లో పెట్టలేదు కాని ప్రస్తుతం మేమంతా ఈ దీవిలో బందీలమే—మమ్మల్ని ఏం చెయ్యవలసిందీ వాళ్ళు నిర్ణయించుకోలేదు. కొన్ని ఉత్తర్వుల కోసం ఎదురు

చూస్తున్నారు. ఐతే, నీ కో రహస్యం చెబుతాను. తొంద ర్లోనే ఈ దీవిని తిరిగి బ్రిటిష్ ప్రభుత్వం వశపరుచు కుంటుంది. అందుకు ప్రయత్నాలు కూడా జరుగు తున్నాయి" అన్నాడు ఎడ్వర్డ్....

"ఐతే మళ్ళీ ఖైదీలనందరినీ జైల్లో వుంచుతారా?" భయంగా అడిగాడు నరేంద్ర....

"తెలీదు. పెట్టకపోవచ్చు, ఐతే కొంతమంది రాజకీయ ఖైదీలు వున్నారు. వాళ్ళందరినీ తిరిగి జైల్లో బంధించ వచ్చు, ఎందుకంటే వాళ్ళంతా బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతి రేకంగా పోరాటాలు జరుపుతున్న మనుషులు"

ఆయనతో కొంచెంసేపు గడిపి తిరిగి ఖైదీలను కలుసు కున్నాడు.

అంతాకలిసి స్వేచ్ఛావాయువులను గుండెలనిండా పీల్చు కున్నారు....జపాన్ వాళ్ళకు కృతజ్ఞతలు తెలియజేసు కున్నారు.

ఎడ్వర్డ్ తనకు చెప్పిన ఆ రహస్యాన్ని ఎక్కువ సేపు గుండెల్లో దాచుకోలేకపోయాడు. త్వరలోనే బ్రిటిష్‌వాళ్ళు తిరిగి ఆ దీవిని హస్తగతం చేసుకోటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తనకు తెలిసినట్టుగా తనకు బాగా స్నేహితులైన ఇద్దరు ఖైదీలకు చెప్పాడు నరేంద్ర. ఐతే ఎడ్వర్డ్ తనకు ఆ వార్తను చెప్పినట్టు వాళ్ళతో చెప్ప లేదు.

అంతే—క్షణాల్లో ఆ వార్త ఖైదీలందరికీ చేరి పోయింది. ఆ సాయంత్రానికే జపాన్ సైనిక అధికారు లకు కూడా తెలిసిపోయింది. వాళ్ళు ఆచూకీ తీశారు.

అప్పటికప్పుడే నరేంద్ర కోసం వేట మొదలయింది.

చీకటి పడటానికి ముందుగానే నరేంద్రను జపాన్

పై నికాధికారులు పట్టుకున్నారు. కొంచెం సేపటి తర్వాత గానీ నరేంద్రకు వాళ్ళు అతన్ని తిరిగి ఎందుకు బంధిం చారో తెలీలేదు.

అతనితోపాటు ఇంకో యాభై మంది ఖైదీలను కూడా వాళ్ళు నిర్బంధంలోకి తీసుకున్నారు.

నరేంద్రతోపాటు వాళ్ళంతా బ్రిటిష్ ప్రభుత్వానికి మద్దతునిస్తున్నారని—బ్రిటిష్ గూఢచారులుగా వ్యవహ రిస్తున్నారనీ ఆరోపించారు.

వాళ్ళందరినీ తిరిగి అదే జైల్లో బంధించారు.

ఆ రాత్రి కొంతమంది అధికారులు ఆ ఖైదీలనందరినీ- బ్రిటిష్ ప్రభుత్వపు తిరుగుదాడి—గురించి ఎట్లా తెలిసిందో చెప్పమని వేధించారు.

వాళ్ళెవ్వరూ చెప్పలేకపోయారు, చివరకు నరేంద్ర తనకు తెలీదనే అన్నాడు, ఎవరో ఖైదీలు అనుకుంటున్న ప్పుడు విన్నానని చెప్పాడు, అంతేగానీ, అతను ఎడ్వర్డ్ పేరును బయట పెట్టలేదు. తను ఎంత గొప్ప పొరపాటు చేశాడో అతనికి అప్పుడుకాని అర్థంకాలేదు. ఎడ్వర్డ్ ఆ విషయాన్ని తనకు చెప్పకుండా వుంటే బాగుండేదని అను కున్నాడు.

ఐనా ఇప్పుడు చెయ్యగలిగింది ఏదీలేదు.

చాలా సేపటివరకూ ఆ అధికారులు ఖైదీల నందరినీ హింసలుపెట్టి అడుగుతూనేవున్నారు.

కాని—వాళ్ళు ఏ ఒక్క ఖైదీ దగ్గరనించీ ఎటువంటి సమాచారాన్నీ రాబట్టలేక పోయారు, ఆ రాత్రికి ఖైదీల హింసాకాండ ముగించి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళగానే నరేంద్రకు ఏడుపు వచ్చింది. జీవితంలో ఎదురుచూడకుండా వచ్చిన ఒక గొప్ప అవకా

శాన్ని కేవలం తన తొందరపాటుతో తన్నేశాడు. తనే కాకుండా ఇంకో యాభై మంది ఖైదీల జీవితాలను కూడా నాశనంచేశాడు.

తెల్లవారేవరకూ బాధపడుతూనే వున్నాడు.

నీలూ అతని కళ్ళఎదుట కనపడుతూనే వుంది. దగ్గరయిందనుకున్న ఆమె రూపం దూరమవుతూ కనపడింది.

35

బ్రిటిష్ గూఢచారులుగా—వాళ్ళ అనుచరులుగా వ్యవహరించారనుకున్న ఆ ఖైదీలను ఏం చెయ్యాలో ఆ సాయంత్రం నిర్ణయించారు జపాన్ సైనికాధికారులు.

వాళ్ళందరికీ మరణ శిక్ష విధించారు. అయితే వాళ్ళకు విధించిన శిక్షను చాలా రహస్యంగా వుంచారు, ఎవ్వరికీ తెలియనివ్వలేదు.

వాళ్ళ పథకం ప్రకారం ఖైదీలకు మరణశిక్ష ఆ జైల్లో కాని—ఆ దీవిలోకాని అమలు జరగదు.

ఖైదీలందరినీ రెండు పడవల్లో సముద్రంలో కొంత దూరం తీసుకువెళతారు, అక్కడ వాళ్ళందరినీ కాల్చి ఆ శవాలను సముద్రంలో నెట్టి వచ్చేస్తారు. ఆ ఖైదీల శవాలు అండమాన్ దీవి వైపుకు కొట్టుకురావడం కూడా వాళ్ళకు ఇష్టంలేదు.

చీకటి పడేవేళకు పడవలు రెండూ సముద్రతీరంలో సిద్ధం చెయ్యబడ్డాయి. ఖైదీలందరినీ సముద్ర తీరానికి చేర్చారు.

"మమ్మల్ని ఎక్కడికి తీసుకెళుతున్నారు?" ఒక ఖైదీ ధైర్యంచేసి అడిగాడు వాళ్ళందరినీ పడవల్లోకి ఎక్కిస్తున్నప్పుడు.

అంతే—ఒక సైనికుడు తుపాకీ మడమతో ఆ ఖైదీ

గుండెలమీద గట్టిగా పొడిచాడు.

పెద్దగా అరిచాడు ఆ ఖైదీ బాధతో....

"ఎవ్వరూ పెదవులు కదిలించకూడదు. మీరంతా ఖైదీలు, మీరు బ్రిటీష్ ప్రభుత్వపు గూఢచారులు...." అన్నాడా అధికారి.

ఆ తర్వాత ఎవ్వరూ మాట్లాడలేదు.

ఆ పడవలు మరీ ఇరుకుగా వున్నాయి.

రెండు పడవల్లో ఖైదీలకు సమానంగా సైనికులు కూడా వున్నారు తుపాకీలు పట్టుకుని, ఖైదీలందరినీ గోనె సంచీల్లో కుక్కినట్టు వూపిరాడకుండా పడవల్లో ఇరికించారు.

సముద్రంలోకి వెళ్ళిపోయాయి పడవలు.

వాళ్ళనేం చెయ్యబోతున్నారో గ్రహించారు ఖైదీలు. అది వాళ్ళందరికీ మరణయాత్ర అని తెలిసిపోయింది. లేకపోతే అంత చీకటిలో తుపాకీలు పట్టుకున్న సైనికులు వాళ్ళందర్నీ పడవల్లో ఎక్కించుకుని సముద్రంలోకి తీసుకెళ్ళవలసిన అవసరం లేదని వాళ్ళకి తెలుసు.

జపాన్ సైనికులు ఉత్సాహంతో పాటలు పాడుతున్నారు—పడవల్లో వెళుతూ—ఖైదీల మరణవేదన గురించిన ఆలోచనలే వాళ్ళకు లేనట్టు....

ప్రశాంతంగా వున్న సముద్రంలో పడవలు వాలుగాలికి మెత్తగా నీటిమీద జారిపోతున్నాయి.

ఒక గంట గడిచింది.

ఢాం—

ఒక సైనికుడి చేతిలో తుపాకి పేలింది.

గుండెకు చిల్లుపడిన ఖైదీ మరణకేక వేశాడు.

అంతే—రెండు పడవల్లోనూ వున్నట్టుండి జపాన్

సైనికుల చేతుల్లో తుపాకీలు చప్పుళ్ళు చేశాయి.

ఖైదీలు ఆర్తనాదాలు చేశారు—తుపాకీ గుండ్లు గుండెలను, తలలను చీల్చుకు వెళుతున్నప్పుడు—

ఏదో జరుగుతుందని వాళ్ళంతా వూహించినా అంత హఠాత్తుగా వాళ్ళమీద సైనికులు కాల్పులు జరుపుతారని ఖైదీలు అనుకోలేదు.

అప్పటికే పడవలు సముద్రంలో చాలాదూరం వచ్చేశాయి. అర్ధరాత్రి ఎప్పుడో దాటిపోయింది.

ఎక్కువమంది ఖైదీలు ఆ తుపాకీ గుళ్ళనించి తప్పించుకోలేక పోయారు. కొంతమంది తుపాకీలు పేలగానే ఎగిరి ఆ చీకటిలోనే సముద్రంలోకి దూకేశారు. అట్లా దూకిన వాళ్ళలో నరేంద్రకూడా వున్నాడు.

సముద్రంలోకి దూకుతున్న ఖైదీలను కూడా—కొంతమందిని చీకటిలోనే, నక్షత్రాల మసక కాంతిలోనే కాల్చేశారు ఆ సైనికులు.

ఖైదీలు సగంమందికి పైగానే వాళ్ళ తుపాకులకు బలైపోయారు. ఇంకొంతమంది ఖైదీల శవాలు పడవల్లోనే ఉండిపోయాయి. ఇంకొంతమంది తుపాకీదెబ్బ తగలగానే వెనక్కు విరుచుకుని సముద్రంలో పడిపోయారు.

"తప్పించుకున్నారు ఖైదీలు" అన్నాడొక సైనికుడు కాల్పులు ఆపి—

"ఇది సముద్రం. ఎంత దూరం ఈదగలరు? ఒడ్డు చేరకముందే చచ్చిపోతారు. ఈ మధ్యలోనే సొరచేపలకు ఆహారంగా దొరికిపోతారు" అన్నాడు ఇంకో సైనికుడు నీళ్ళలోకి చూస్తూ....

అప్పటికే నీళ్ళలోకి దూకిన ఖైదీలు పడవలకు దూరముగా సముద్రంలో ఈదుకుంటూ వెళుతున్నారు.

అపరాధ పరిశోధన పోటీ-226

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకి రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-5-'87 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జూన్ '87 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఓటినా పైచేయి మాదే అంటున్న క్రికెట్ జట్టు—? (భారత్, శ్రీలంక)
2. నేడు రాష్ట్ర ప్రజలను పీడిస్తున్న ప్రధాన సమస్య—? (త్రాగేనీరు, అధిక పన్నులు)
3. మంచి ఆరోగ్యానికి దీనికి మించినది లేదు—? (తేనె, నిమ్మపండు)
4. ఇవి కుట్టితే మనిషికి నరకమే—? (తేళ్ళు, తేనెటీగలు)
5. ఇటీవల పోలీసు లాఠీ దెబ్బలకు గురై మరణించిన అశోకా హోటల్ కార్మికుడు—? (చంద్రుడు, పద్మనాభం)

అక్కడికి దగ్గర్లోనే ఒక విచిత్ర దీవి వుందని ఖైదీలకూ తెలీదు—పడవలో ఉన్న జపాన్ సైనికులకీ తెలీదు.

చచ్చిపోయిన ఖైదీలను సముద్రంలోకి నెట్టి పడవలను వెనక్కు మళ్ళించారు సైనికులు.

ఆ చీకటిలో సముద్రంలో ఈదుతున్నారు ఖైదీలు—

36

తెల్లవారటానికి కొంచెం ముందుగా సముద్రం ఒడ్డుకు ఆ దీవికి ఈదుతూనే చేరుకున్నారు పదహారు మంది ఖైదీలు.

అంతా ఒకచోట నిలబడ్డారు.

చలికి వాళ్ళ శరీరాలు వణికిపోతున్నాయి. చేతులు—కాళ్ళు బిగుసుకుపోయినట్టుగా అనిపించాయి. గంటల తరబడి ఈదటంలో బాగా అలసిపోయారు.

"మనకు చాలా అన్యాయం జరిగింది." అన్నాడు నరేంద్ర వాళ్ళతో వణుకుతున్న గొంతుతో.

"అవును. మనల్ని బ్రిటిష్ గూఢచారులుగా ఎందుకు అనుమానించారో అర్థం కావటంలేదు" అన్నాడొక ఖైదీ. ఈ అనుమానానికి కారణం నరేంద్ర అని వాళ్ళెవరికీ తెలేదు.

"ఏమైనా ప్రాణాలతో బయటపడ్డాం. ఇందుకు మనం సంతోషపడాలి. మనతోటి ఖైదీలు చాలామంది వాళ్ళ తుపాకీలకు ఆహుతయిపోయారు. ఇందుకు మాత్రం విచారంగా వుంది" అన్నాడు నరేంద్ర.

"నిజమే. ఎక్కువమంది తప్పించుకో గలిగినట్లయితే బాగుండేది. ఐనా ఈ జపాన్ సైనికులు మరీ కిరాతకుల్లాగా ఉన్నారు."

మా వద్ద సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు, వైద్య, విద్య మరియు స్కూలు, కాలేజి విద్యార్థులకు అచ్చుపుస్తకములు, ఎక్సర్‌సైజు పుస్తకములు, హిందీ, ఇంగ్లీషు నవలలు లభించును.

నేడే కేటలాగుకై వ్రాయండి.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

(బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ)

టౌన్‌హాల్ రోడ్డు—రాజమండ్రి - 1

"మనల్ని ఇంతదూరం తీసుకువచ్చి కాల్చి చంపాల్సిన అవసరం ఏముంది? అండమాన్ దీవిలోనే ఎందుకు చంప లేదు?" అడిగాడు ఒక ఖైదీ నరేంద్రను.

"ఏమో? ఏదో కారణం వుండి వుంటుంది, అందుకే వాళ్ళు ఇంత శ్రమ తీసుకున్నారు. అందువల్లనే మనమైనా ఆ చావునుండి తప్పించుకోగలిగాము" అన్నాడు నరేంద్ర.

వాళ్ళు ఒంట్లో వేడి పుట్టడానికి అవయవాలను ఒకదాని కొకటి గట్టిగా రుద్దుకున్నారు.

కొంచెం సేపటికి ఆ దీవిమీద సూర్యోదయం అయ్యింది. ఎండ తగలటంతోనే వాళ్ళ శరీరంలో వున్న చల్లదనం క్రమంగా తగ్గిపోయింది.

వాళ్ళ బట్టలు కూడా పూర్తిగా ఆరిపోయాయి.

వాళ్ళంతా సముద్ర తీరం నుండి లోపలకు నడుస్తున్నప్పుడు మళ్ళీ మృత్యుదీవిలో అడుగుపెడుతున్నట్టుగానే అనిపించింది నరేంద్రకు. ఆ దీవిలో ఎదురయిన భయంకరమైన అనుభవాలు ఒక్కసారిగా అతనికి గుర్తుకొచ్చాయి.

ఐనా తప్పదు.

ఎవ్వరిలోనూ శక్తిలేదు. బాగా ఆకలిగా కూడా వుంది. రాత్రి వాళ్ళెవరికీ ఆహారం పెట్టలేదు.

కొంచెం దూరం నడిచేసరికి వాళ్ళు నడవలేని స్థితికి వచ్చేశారు. శక్తిలేక కాళ్ళు వణకడం మొదలుపెట్టాయి.

సముద్రం ఒడ్డునే ఇసుకలో కూలబడిపోయారు. వెల్లకిలా పడుకున్నారంతా వరసగా—

కొంచెంసేపటికే వాళ్ళకి నిద్రపట్టింది.

సముద్రం హోరు వాళ్ళకు వినపడటంలేదు. అప్పుడప్పుడు రివ్వున వీస్తూన్న గాలికి ఇసుక పైకిలేస్తూంది.

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జులై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా రు. 90/- చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము. పత్రికల ఖరీదుకు మించి మీరు పైసా చెల్లించ నవసరం లేదు.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియ జేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి నెలా మరియు రెండేసి నెలలకు V.P. ద్వారా పత్రికలు తెప్పించు కునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెల కానెల రు. 19-60 లు, రెండేసి నెలలకు రు. 30/-లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం ఏది కావలసినా మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

37

ఖైదీలందరికీ మెలకువ వచ్చేసరికి మధ్యాహ్నం దాటి పోయింది. ఎండ తీక్షణంగానే వున్నా ఎందువల్లనో వాళ్ళకు అంతగా బాధ అనిపించలేదు.

"మనం ఆహారం వెతుక్కోవాలి" అన్నాడు ఒక ఖైదీ.

"ఆహారాన్ని వెతుక్కుంటూ మనం ఆహారం అవకుండా జాగ్రత్తపడాలి" అన్నాడు నరేంద్ర.

"అంటే?"

"ఈ దీవిలో నరమాంస భక్షకులు వుండొచ్చు. క్రూరమైన జంతువులు వుండొచ్చు. అప్పుడు మనమే వాటికి ఆహారం అవుతాం."

"నిజమే ...జాగ్రత్తగా వుండాలి....మన దగ్గర ఆయుధాలు కూడా లేవు" ఎవరో అన్నారు.

అక్కడి నుండి లోపలకు నడిచారు.

ఇసుకలో ఎక్కడా జంతువులు కానీ - మనుషులుకానీ నడిచిన కాలి జాడలు వాళ్ళకు కనపడలేదు. గాలికి ఇసుక లేస్తూనే వుంది. వాళ్ళ పాదాల జాడలు మాత్రం స్పష్టంగా ఇసుకలో పడుతున్నాయి.

కొంచెం దూరం వచ్చేసరికే ఆ దీవి చివరివరకూ కనపడింది. చాలా చిన్నదీవి....అక్కడక్కడ ఎత్తు తక్కువగా వున్న చెట్లు తప్ప ఇంకేమీ కనపడలేదు. చిన్న చిన్న పొదలు కూడా లేవు.

నిప్పు చేసుకోటానికి రాళ్ళు మాత్రం కనపడ్డాయి.

చిన్న చిన్న జంతువులు కానీ - పక్షులుగానీ కనపడతాయేమోనని రెండుసార్లు ఆ దీవంతా వెతికారు. ఏమీ కనపడలేదు.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీద బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-5-'87 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు జులై '87 నెల సంచికలో ప్రకటిస్తాము.

మార్చి '87 పోటీ ఫలితాలు

(1) మార్చి' 87 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

గమ్యం చేరేలోపల,
గండాలెన్నెన్నో!!

పంపినవారు: శ్రీమతి సుమతీ శేఖర్, బి.ఏ., భాగ్యనగర్ కాలనీ, కడప.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

విజయం నీదే కావాలి!
వెలుగై నేనే ఉండాలి!!

పంపినవారు: శ్రీమతి ఆర్. శ్రీజ్యోతి, W/o ఆర్. విశ్వేశ్వరరావు, టెలిఫోన్ ఎక్స్చేంజ్, ఏలూరు.

"ఆశ్చర్యంగావుంది.... ఒక్క జంతువు కూడా లేదు."

"ఇందులో ఆశ్చర్యం లేదు. ఇది చాలా చిన్న దీవి. చాలా తక్కువ కాలంలోనే ఇసుక మేటవేసి ఈ దీవి ఏర్పడి వుంటుంది. అందుకే ఇక్కడి చెట్లు కూడా తక్కువగా వున్నాయి. అవి కూడా ఎక్కువ ఎత్తుగా పెరగలేదు. అందుకే ఒక్క పక్షికాని - జంతువు కాని లేదు" అన్నాడు నరేంద్ర.

"అయితే ఇప్పుడు మనం ఏం చెయ్యాలి? దహించి వేస్తున్న ఈ ఆకలిని ఎట్లా తీర్చుకోవాలి?" అడిగారు కొంతమంది.

"చెట్ల ఆకులు తినాలి" అన్నాడు నరేంద్ర.

"ఆకులు తినటమా?" అన్నారు.

"తినాలి. తినకపోతే ఆకలితోనే ఈ దీవిలో చచ్చిపోక తప్పదు."

"ఎన్ని రోజులు ఆకులు తినగలం.... అందరం కలసి ఆకులను తింటుంటే అవి ఎన్ని రోజులకు వస్తాయి? ఆ ఆకులు కూడా అయిపోయిన తర్వాత ఏం చెయ్యాలి?" అనడిగాడొక ఖైదీ.

"ఏం చెయ్యాలో నాకూ్కడా తెలీదు. ఇప్పటికి ప్రాణాలు నిలుపుకునే దారి గురించి చెప్పాను. ఆకులు అయిపోయేవరకు బతికివుంటే అప్పుడే ఇంకో మార్గాన్ని ఆలోచించుకోవచ్చు" చెప్పాడు నరేంద్ర.

అంతా ఆకులు తిని ఆకలి తీర్చుకోటానికి సిద్ధపడ్డారు.

చెట్టు కిందకు వెళ్ళారు.

పైకి చూశారు. ఎత్తు తక్కువగానే వుంది. ఆ చెట్టుకు పువ్వులు లేవు - కాయలు కూడా లేవు. ఆకులు వెడల్పుగా అక్కడక్కడ వున్నాయి.

వెలువడింది!

విడుదలైన ప్రతిచోటా సంచలనం కలిగిస్తున్న
ఆంధ్రుల ఆహ్లాద రచయిత

మల్లాది వెంకట కృష్ణమూర్తి
తాజా నవల

ఒక నువ్వూ - ఒక నేనూ

వెల: రు. 25

తప్పక చదవండి!

నేడే అడ్వాన్సుతో పాటు ఆర్డర్లు పంపండి.
పోస్టు ఖర్చులు పూర్తిగా మీరే భరించుకోవలెను.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్
మ్యూజియం రోడ్, గవర్నరు పేట,
విజయవాడ-520 002.

ఒక ఖైదీ చెట్టు ఎక్కాడు.

కొన్ని ఆకులను విరిచి కిందకు వదిలాడు. వాటిని తీసుకుని నోట్లో పెట్టుకున్నారు కొంతమంది. నరేంద్ర కూడా అనుమానపడుతూనే ఆ ఆకులను నోట్లో పెట్టుకున్నాడు.

బాగా వగరుగా కొంచెం చేదుగా వుంది. అంతేకాదు నములుతున్నప్పుడు ఏదో వెగటు వాసన వచ్చింది.

అంతా ఆకుల్ని పారేశారు.

"ప్రయోజనం లేదు. ఈ ఆకుల్ని మనం తినలేము. ఇవి ఆహారానికి పనికిరావు" అన్నారు వాళ్ళు.

"మీరే చెప్పండి, ఏం చేద్దాం?" అన్నాడు నరేంద్ర చేతిలో వున్న ఆకును పూర్తిగా తింటూ.

"అదే తెలీటం లేదు. తల్చుకుంటే భయంగా వుంది. మనకంటే జపాన్ సైనికుల తుపాకీలకు బలైపోయిన వాళ్ళంతా అదృష్టవంతులు వాళ్ళకి ఆకలి సమస్య లేదు - ఆహారం సమస్య కూడా లేదు" అన్నారెవరో.

"ఇంత సముద్రం దగ్గరే వుంది, ఏదో ఒక జంతువు కోసం ప్రయత్నం చేద్దాం" అన్నాడో ఖైదీ.

"ఎట్లా ప్రయత్నం చేస్తాం? చేపల్ని పట్టటానికైనా మన దగ్గర ఆయుధాలు లేవు కదా!"

మళ్ళీ ఎవ్వరూ మాటాడలేదు.

సముద్రం అలలు ఒడ్డుకు చేరుతున్నప్పటి చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది.

"దాహంగా వుంది" అన్నారు కొంతమంది ఖైదీలు.

(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page


Regd. no: 57/HD
PRABHAKAR